రామాయణం

# బాలానంద కుశలవుల కథ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

బాలానంద

# కుశలవుల కథ

Office of the Registrar of Publications
APR 1999
Andhra Pradesh, Hyderabad-12

రచన:
నాగశ్రీ

Acc. No. 26814

నవరత్న బుక్ సెంటర్
ఏలూరు రోడ్, విజయవాడ - 2.

# విషయసూచిక


పండుగరోజు
పెడతిరిగిన వెనుకటి కథ
రాణకెక్కిన రామరాజ్యం
రాణివాసానికి రాములవారిరాక
రామచంద్రులు విన్న శుభవార్త
సీతమ్మకు చేసిన సీమంతం
కీడులో మేలు కూడివచ్చింది
సీతాదేవి వేవిళ్ళ పాటలు
లోకాచారపు పోకడలు
మరపురాని మనోవేదన
సౌమిత్రితో సమాలోచన
గురువుల రాక
రాజసూయం చేసే విధానం
పుట్టబోయే పాపాయికి పెట్టబోయే పేరు
చుప్పనాతి చూడలేని తనం
త్రాగుబోతువాని తందనాలు
వినరాని విపరీత నింద
భద్రుని మనసులో బడబానలం
రామ-భద్రులు రహస్య ప్రసంగం
రామనుపాలు వినిన రాజనింద
రహస్య మందిరంలో రామానుజులు
రామానుజుల రౌద్రావేశం
లక్ష్మణుని సమాధానం
భరతుని సమాధానం
శత్రుఘ్నుని సమాధానం
సమ్మతించిన సౌమిత్రి
రాణివాసానికి వచ్చిన రామచంద్రులు
రాముడు సీతను మునిపల్లెకు పోయిరమ్మనుట
సీతాదేవి వనప్రయాణం
సీతాదేవి గంగానదిని దాటుట
పరివారములు కనపడకపోవుట
లోకాపవాదు సీత కెరిగించుట
సీతకు కలిగిన సంతాపం
మరది చెప్పిన మంచిమాటలు
సీతాదేవి ఊరట చెందుట
సీతాదేవి పొందిన పరితాపం
వాల్మీకిముని సీతను ఓదార్చుట
మునికాంతలు సీతను పరామర్శించుట
వాల్మీకిముని చేసిన వాగ్దానం
యమునానదీ తీర మునులురాక
లవణాసురుని గురించి మునులు రామునితో చెప్పుట
శత్రుఘ్నుడు లవణాసురునిమీద దాడిచేయుట
శత్రుఘ్నుడు సేనలతో గంగానదిని దాటుట
శత్రుఘ్నుడు మధుపురానికి రాజగుట
సీతాదేవి కుమారులకు నామకరణం చేయుట
రామ పాలనలో అధర్మం తలెత్తుట
రాముడు శంబుకుని చూడబోవుట
రాముడు శంబుకుని చంపుట
రాముడు రాజసూయం చేయబూనుట
బంగారపు సీతబొమ్మ

రాముడు తీసుకున్న రాజనీతి

శత్రుఘ్నుడు చెప్పిన సాకు

భరతుడు చెప్పిన సాకు

కుశలవులు రామాయణం గానం చేయుట

శత్రుఘ్నుడు రామునితో రహస్యంగా మాటాడుట

రాముడు యాగాశ్వమును విడచుట

కుశలవులు యాగాశ్వమును బంధించుట

శత్రుఘ్నుడు సేనలనంపుట

శత్రుఘ్నుడు లవుని మూర్ఛ నొందించుట

కుశుడు శత్రుఘ్నుని మూర్ఛ నొందించుట

భరతుడు కుశలవుల మీద యుద్ధమాడవచ్చుట

భరతుడు కుశలవులకు చెప్పిన మంచిమాటలు

భరతుడు మూర్ఛపడుట

లక్ష్మణుడు యుద్ధానికి బయలుదేరుట

లక్ష్మణుడు మూర్ఛపడుట

హనుమంతుడు మునిపల్లెకు వచ్చుట

హనుమంతుని తల్లి దండ్రులు

హనుమంతుని జననము

హనుమంతుని మహాపండితుడు

రాముడు సూర్యుని ఆరాధించుట

బంగారపు సీతను తయారుచేయుట

కుశలవులు వాల్మీకి వెంట అయోధ్యకు పోవుట.

హనుమంతుడు సుగ్రీవునకు మంత్రి

హనుమంతుడు మహావీరుడు

హనుమంతుని రామనామము

రాముడు కుశలవులమీద యుద్ధమాడవచ్చుట

కుశలవులు రాముని గేలిచేయుట

కుశలవులు రామునితో యుద్ధముచేయుట.

సీత చెప్పిన చివరి మాటలు

సీతభూదేవిలో కలిసిపోవుట

రాముడు రాజసూయము పూర్తిచేయుట

కుక్క చేసిన నేరారోపణము

నేరం చేసినవానికి అధికారపదవి

రాముడు కుక్కను కాశికి పంపుట

రాజకుటుంబాభివృద్ధి

రామరాజ్య విస్తీర్ణము

రామావతార సమాప్తము

# కుశలవుల కథ

## పండుగరోజు

అది పండుగరోజు. ఏ వీధిలో చూచినా పూల పందిళ్ళు - ఏ వాకిట చూచినా పచ్చ తోరణాలు - ఏ ఇంట చూచినా గొప్ప వేడుకలు. రాజనగరమిలాగా ఒకవంక బ్రాహ్మణులు చదివే వేదమంత్రాలు - ఒకవంక స్త్రీలు పాడే వేడుక పాటలు- ఒక వంక పిల్లలాడే ఆటలు రకరకాల సంబరాలు, రంగు రంగు దీపాలతో కళకళ లాడుతూ కోలాహలంగా వుంది. అయోధ్యాపురమంతా శోభాయమానంగా వేడుక లతో నిండిపోవడానికి శ్రీరామపట్టాభిషేకమే కారణం.

## పెడతిరిగిన వెనుకటి కథ

రామపట్టాభిషేక మిప్పటికి పదునైదేండ్లనాడే జరగాల్సింది. కాని జరగలేదు. ఆనాడూ ఇలాగే నగరమంతా అలంకరించారు. మేళతాళాలు మ్రోయించారు. ఇంట యింటా పండుగలు చేసుకున్నారు. అంతా సిద్ధమయింది. తెల్లవారితే రాముడు రాజవుతాడని ప్రజలంతా సంబరాలు పడ్డారు. ఐతే కోసల దేశానికి దశరథుడు రాజు. ఆయనకు ముగ్గురు భార్యలు. వారిలాగే పట్టపురాణి యైన కౌసల్య కొడుకు శ్రీరాముడు. సుమిత్ర కొడుకులు లక్ష్మణ శత్రుఘ్నులు. కైకేయి కొడుకు భరతు. దశరథుడు కైకేయికి ఏనాడో బాకీపడిన పాత వరాలు రెండూ యిప్పుడు కావాలని పట్టు పట్టింది. దశరథుడు మాటకు బద్ధపడినందున కాదనలేక పోయాడు. అందుచేత తన రాజ్యానికి భరతుడినే రాజుగా అంగీకరించి రాముని అడవులకు పంపవలసి వచ్చింది.

అలాగే భార్య సీతాదేవిగూడ ప్రయాణమై తమ్ముడు లక్ష్మణుని వెంట బెట్టుకొని కారడవికి పోయిన రాముని మునులంతా దీవించారు. రాముడు దుష్టరాక్షసుల్ని చంపి ఘనవిజయం సాధించాడు, తండ్రి చెప్పిన గడువు పదునాలుగేండ్లు దాటగానే తిరిగి ఇంటికి వచ్చి పట్టాభిషేకం చేసుకుంటున్నాడు. ఆ రోజందరికీ యింటి పండుగ - కంటి పండుగ అయింది. అందుకే యీ కోలాహలమంతాను.

## రాణకెక్కిన రామరాజ్యం

శ్రీరాముడు ప్రజల్ని కన్నబిడ్డల్లా పాలించాడు, తన పాలనలో ఎవరికి యిబ్బంది వచ్చినా అదరాభిమానాలతో ఆదుకునేవాడు. తన గురించి, తన మంచి తన్నాన్ని గురించి ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోడానికి చారుల నియమించాడు ఆ సేవకులు రాత్రికాలాల్లో మారువేషాలు ధరించి నగరం నాలుగు మూలలా నాలుగువాడలా తిరిగివచ్చి ప్రజలనుకునే మాటలు ప్రభువులకు చెప్పతుంటారు.

శ్రీరామ పరిపాలనలో వానలు అనుకూలంగా కురిసేవి, పంటలు కొల్లలుగా పండేవి. పశువులు సమృద్ధిగా పాలు పిండేవి. ఎవ్వరికీ బాధ కలిగేది కాదు. అంచేత రామపాలన అందరూ మెచ్చుకుని "రామరాజ్యం" అన్నారు. అలాగే రామరాజ్యం అన్నపేరు ఆనాటికి యీనాటికి వేగుచుక్కలా నిలిచిపోయింది. గొప్ప గొప్ప మునులు రామదర్శనానికి వస్తుంటారు. వచ్చిన మునుల్ని, బ్రాహ్మణుల్ని రాముడు భక్తి శ్రద్ధలతో పూజించి గౌరవిస్తుంటాడు. వారు చెప్పిన ధర్మాలనే తు.చ. తప్పకుండా ఆచరిస్తాడు రాముడు.

వశిష్టముని గొప్ప తపశ్శాలి, ఆయనకు మునులలో అగ్రస్థానముంది. ఆయన మొదటినుంచి రామునికి, రాముని వంశీయులకుకూడా కుల గురువు. సూర్య వంశపు రాజులు ఆయన గీచినగీటు దాటేవారు కారు. రామునికి ఇంకా బలవంతులు గుణవంతులైన మంత్రులున్నారు - సామంతులున్నారు - మంది మార్బలముంది అదీగాక ముప్వురమ్మలు, ముప్వురు మరదండ్రు, కావలసినంత బంధుజనం, కొదువలేని భక్తకోటి. అలాగే అంగబలం సంఘబలం అర్థబలం కలిగిన రామునిసాటి రాముడేనని పేరుకెక్కాడు. రాముడంటే రాజేకాదు- ప్రత్యక్ష దైవమనాలి.

## రాణివాసానికి రాములవారి రాక

రామచంద్రులు రాణివాసానికి చేరుకున్నారు. దాసీజనం రాజుగారికి నమస్కారాలు చెప్పారు. పన్నీరు చిలకించారు. పూలుచల్లారు. మహారాణిగారి మందిరానికి దారిచూపారు. ప్రభువుల రాకకు పట్టపురాణి పరమానందంతో పొంగి పోయింది. ఎదురేగి పిలిచింది, కూర్చుండ నియమించింది ప్రక్కనే కూర్చుని పతి పాదాలు కన్నుల కద్దుకుంది. రాముడానందంగా తన రెండుచేతులూ ఆమెనెత్తి తన ప్రక్కన కూర్చుండబెట్టుకున్నాడు. సీతమ్మ పెనిమిటితో ఏదో చెప్పాలను కుంది. పెదవిదాటి రానిమాట మనసులోనే దాగుడుమూత లాడుతుంది.

రాముడే ముందుగా పలుకరించి “సీతా! మనకు పెండ్లి జరిగి యిప్పటికి ఇరవై అయిదేండ్లు గడిచినై. ఐనా మనకు సంతానం కలుగలేదు. మునిపల్లెకు పోయి మునిపత్నులను సందర్శించి వారి దీవెనలు పొందాలని నీ కోరిక ఎప్పుడో తీరాలిసింది. ఐతే క్రొత్తగా పట్టాభిషేకం - కోటంతా సందడి తీరికలేక

కాలం గడిచిపోయింది. నా కిప్పుడా బాదరబంది యేమిలేదు. ఇక నీ యిష్టం నీ వెప్పుడు వెళతానంటే నేనప్పుడే పంపడానికి సిద్ధం" అన్నాడు చిరునవ్వులు చిందే చందమామలాంటి చక్కదనాల మోముతో. ఆ నవ్వులో నవ్వు. ఆ చూపులో చూపు కలిసిన సీత "ఇప్పుడంత తొందర లేదులెండి" అంది ముక్తసరిగ. రాముడేమీ అనలేకపోయాడు.

## రామచంద్రులు విన్న శుభవార్త

ఆమె మాటలో అంతర్యం తెలియక ఆలోచనలో పడ్డారు రాముడు. ముప్పురు దాసీలు వచ్చి ముసిముసి నవ్వులతో "ప్రభువుల వారికి శుభవార్త" అంటూ నిలబడ్డారు. ఏమిటది అన్నట్లుగా రాముడు వారివంక చూచాడు, వారిలో మొదటి పరిచారిక "మీ సీతమ్మగారికి నెలతప్పింది" అన్నది. రెండవ పరచారిక "మా రామచంద్రులు తండ్రిగారు కాబోతున్నారు" అన్నది. మూడవ పరిచారిక "మీకు యువరాజావారు పుట్టబోతున్నారు" అన్నది. ఆ మాటలు విని ఆనందంతో ఉక్కిరి-బిక్కిరియైన రాముడు ఆ ముప్పురకు రత్నహారాలు బహూకరించాడు.

వైదేహిక వేవిళ్ళు ప్రారంభమైన వార్త అప్పటికప్పుడే నగరమంతా ప్రాకిపోయింది. ముగ్గురత్తలూ మురిసిపోయారు. ముగ్గురు తోడు కోడండ్రూ ముచ్చట పడ్డారు. మరుదులూ ముదమొందారు. ఒకరేమిటి ? అందరూ ఆనంద పరవశులయ్యారు. రాజ పురోహితులు వారీవార్త జనక మహారాజుల వారి కందించారు. మిథిలేశ్వరులు మహానందం చెందారు. ఆయన కన్నులనిండా ఆనంద భాష్పాలు తిరిగినై. "ఎన్నాళ్ళకింత మంచిమాట విన్నాను" అనుకుంటూ

స్వయంగా పోయి వారే అంతఃపురంలో చెప్పారు. రాజదంపతులు రత్నాభరణాలు చేయించుకుని, సారె చీరలు తెప్పించుకుని, పిండివంటలు వండించుకుని, బ్రాహ్మణ ముత్తయిదువుల వెంట బెట్టుకుని, రాజమర్యాదలతో బయలుదేరి అయోధ్యానగరానికి చేరుకున్నారు.

## - సీతమ్మకు చేసిన సీమంతం -

సీతమ్మగారికి సీమంతం చేయించడానికి మిథిలనుండి వచ్చిన జనక మహారాజుకు, వారి పరివారానికి గూడా తగిన మర్యాదలతో మంచి విడిది ఏర్పాటు చేయించారు రామప్రభువులు. నగరంలో ఉన్న ఆడవారందరికీ పేరంటం చెప్పి పిలిపించారు. అంతఃపుర పరిచారికలు వచ్చిన ముత్తయిదువుల పాదాలకు పసుపులు పూసారు. బొట్టు కాటుకలు దిద్దారు. చీరె రవికలు యిచ్చారు. పండ్లూ తాంబూలాలు పైడి పళ్ళెరాలలో పెట్టి పంచి పెట్టారు. మంచి మంచి విందులు చేయించారు, వినోదాలు గావించారు.

మంచి సాంబ్రాణి పొగ తరంగాలుగా వ్యాపించింది. అత్తరు వాసనలు అలుముకున్నాయి. చక్కగా అలంకరించుకొనిన జానకమ్మ గారిని బంగారు గద్దె మీద కూర్చుండబెట్టారు. మిథిలాపురాధీశ్వరులు తెచ్చిన బంగారు గాజులామె చేతులకు తొడిగారు. మంచి ముత్యాల హారాలు మెడలో వేశారు. పట్టు రవిక పట్టు చీరెలు కట్టబెట్టారు. స్త్రీలంతా పాటలు పాడారు.

సీతమ్మ గారికిలాగా సీమంతం ఏడు రోజులు జరిగినై.

## — కీడులో మేలు కూడి వచ్చింది —

అలాగా ఆ వేడుకలు జరిగిన ఏడు రోజుల్లో ఒకనాడు రాణివాసంలో సీతారాములు కూర్చుని జనకమహారాజుగారిని తమ మందిరానికి పిలిపించారు.

కౌసల్య, సుమిత్ర, కైకల్ని పిలిపించారు, లక్ష్మణ, భరత, శత్రఘ్నుల్ని పిలిపించారు. ఊర్మిళ, మాళవి, శ్రుతుకీర్తులనూ పిలిపించారు. అలాగ అందరూ సమావేశమై మాటాడుతుండగా కౌసల్య ముందుగ "యిరువది యైదేండ్లకు సీతమ్మ కడుపు పండింది" అన్నది.

అత్తగారి మాటకు సమాధానంగా సీత "నిజం చెప్పాలంటే యిదంతా రావణాసురుని చలువే" అన్నది. ఆ మాటకు అక్కడున్నవారి మొగాలన్నీ వెల వెల పోయినై. అది గమనించిన జానకి మళ్ళీ కలుగజేసుకుని "ఇందులో పొరపాటులేదు. రావణుడొక విధంగా దుష్టుడే అయినా ఇంకొక విధంగా మంచివాడనక తప్పదు. అతడు నన్నెలా చూచినా నేనాతనిని తండ్రిగానే తలచాను, తలచుకుంటాను.

ఆయన కన్ని మేడలున్నా నన్ను ప్రత్యేకంగా అశోకవనంలో ఎత్తయిన మేడలోనే వుంచాడు. ఆమేడకు నాలుగు వైపులా విశాలమైన కిటికీలు అమరింపబడినై. నాలుగు వైపులా పెద్ద పెద్ద అశోకపు చెట్లు దట్టంగా పెరిగినై. ఎటునుండి గాలి వచ్చినా ఆ అశోకపు చెట్ల మీదుగానే నా మేడలోకి రావాలి. నేను లంకలో ఉన్న సంవత్సరమంతా అశోక పవనాలు తప్ప యింకొక గాలి పీల్చి యెఱుగను. మొదటి నుండి నా గర్భమునందున్న సంతాన నిరోధక వ్యాధి అశోక చెట్లమీది గాలి వలన హరించిపోయింది. నాకు గర్భశుద్ధి కలిగింది. అందువలననే నెలతప్పింది" అని వివరించింది.

"ఔను అశోకం సంతానాన్ని యిచ్చే ఓషధి" అన్నాడు జనకుడు.

అలాగై తేఃమనకు 'కీడులో మేలు కూడి వచ్చింది' అన్నాడు రాముడు.

## — సీతాదేవి వేవిళ్ళ పాటలు —

సీతమ్మగారికి జరిగిన సీమంతం వేడుకలను గురించి ప్రజలలో చెప్పు కోనివారంటూ లేరు. గొప్పవారింటి బిడ్డయినా భర్తవెంట అడవులకు పోయింది. ఎన్నో కష్టాలు పడింది. తన శీలం కాపాడుకుంది. గండాలనన్నింటినీ గడచి ఇంటి కొచ్చింది. కనుక ప్రతి వారికీ ఆమెమీద అదొక రకం సానుభూతి. రమణీమణు లందరూ రకరకాల పాటలు "సీతాదేవి వేవిళ్ళ పాటలు" అని పేరు పెట్టి పాడు కొంటున్నారు. ఆ పాటలు విన్న వారికి గూడా మంచి ఆనందంగా వుంటుంది.

కొంతమంది స్త్రీలు మహారాణిగారిమీద మమకారం కొలది ద్రాక్షపండ్లు, దానిమ్మ పండ్లు పట్టుకెళ్ళేవారు. ఎవరు వచ్చినా, ఎవరేది తెచ్చినా జానకమ్మగారు అంతస్తుల భేదం లేక అందరినీ ఆదరించేవారు. అందరి దీవెనలూ అందుకునేవారు. సీతమ్మగారు పదవికి రాణిగారైనా ప్రజలకు తలలోని నాలుకగా పేరుగాంచింది.

## — లోకాచారపు పోకడలు —

సూడిదలు తెచ్చి సీమంతం చేయించిన జనక మహారాజు సీతారాము లతో లోకాచారపు పోకడల ననుసరించి అమ్మాయి తొలికాన్పు పుట్టింట జరగడం మంచిది కనుక సీతను తన వెంట మిథిలా నగరానికి తీసుకు వెళతానన్నాడు. ఆ మాట వినడంతోనే రాముని తలమీద బండ పడ్డట్టు అనిపించింది. సీత మళ్ళీ తన కంటి ముందు లేకుండా పోతుందేమోనని ఆయన భయం. ఆడవారికి పుట్టింటివారి మమకార మెట్టిదో తెలియును కనుక రాముడు "నన్నొంటిగా విడిచి వెళ్ళొద్దు"

అన్నట్టుగా సీతవంక చూచాడు. ఆ చూపులో అంతరార్థం తెలుసుకున్న "నాన్నా! పదునాలుగేండ్లు అడవిలో అలసివచ్చిన మీ అల్లుడుగారిని పరావ కుండా వదిలేసి రాలేను" అన్నది.

ఆ కుమార్తె అనురాగం చూచిన జనకుడు "పోనీలే తల్లీ! పురుడు పడినాకనైనా నా పుట్టింటికి వచ్చి ఆ చెంబుడు నీళ్ళు పోసుకుని రావడం మ అన్నాడు. సీతారాములు కాస్త గడువు దొరికింది గదా అని మనసులోనే అ "సరే" నన్నట్లుగా తల ఎగుర వేశారు. జనక మహారాజులు మిథిలకు పో వారి కా మాట తలపునకు వచ్చినప్పుడల్లా "ఒకరి నొకరు విడిచి మనమెలాగ గలము?" అని అనుకుంటున్నారు.

## —మరపురాని మనోవేదన—

రాముడు జాలిగుండెగల రాజు. ఎంతో కారణముంటేనేకాని ఇత దండింపడు. లోకంలో శాంతిభద్రతల్ని నెలకొల్పడానికి రాక్షసుల్ని తప్పలేదు-చంపాడు. ఐనా చంపితినే అని మనసులో మదన పడుతూనే ఉన మరచిపోవాలనుకున్నా మరపు రావడంలేదు.

నిజానికి రాక్షసులు బ్రహ్మ వంశీయులు, శివపూజా దురంధరులు. దినం వేదపారాయణం చేసేవారు. సీతను వెదకడానికి లంకకు పోయి ఆంజనేయుడు కూడా లంకలో ఒకనాటి తెల్లవారుజామున విన్న వేదఘో గురించి చెప్పాడు. నూరు తప్పులున్నా అలాంటి వారిని చంపిన పాపం పోతుందా అని వాని భయం. రాముడు పడే సంకటం తెలుసుకుని లక్ష్మణుడు గారికి ధైర్యం చెపుతుంటాడు: "అన్నా! రావణుని తమ్ముడైన విభీ

గూడా రాక్షసుడే, ఐనా మంచివాడు. అతనిని మీరు చంపలేదు సరికదా శరణిచ్చారు. అతనికే లంకారాజ్యం పాలించుకొమ్మని ఇచ్చారు. అలాగే మిగిలిన రాక్షసులు కూడా శరణుఅంటే మీరు కాపాడకపోయే వారా?రావణ కుంభకర్ణాదులు దుర్మార్గులు, యజ్ఞయాగాలు భంగం చేశారు. మునుల్ని పట్టి హింసించారు. దేవతలను ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు త్రాగించారు. చివరకు మా వదినగారిని చెర బట్టినారు. కనుక మీరు వారిని చంపడంలో తప్పులేదు. మీరు చింతపడ తగిన పనిలేదని" చెప్పుతుంటాడు.

## సౌమిత్రితో సమాలోచన

మొదటి నుంచి తన్నెడబాయని ముద్దుల తమ్ముడు లక్ష్మణుడు. "తమ్ముడూ! నీవు నూరు చెప్పు వెయ్యిచెప్పు. రాక్షస వధతో బ్రహ్మ హత్యా పాతకం చుట్టుకుందనే అనుమానం, భయం నన్ను విడిచిపెట్టడం లేదు. దాని కేదైనా తరుణోపాయం కావాలి" అన్నాడు రాముడు లక్ష్మణుడు నిజానికి కల్లా కపటం తెలియనివాడు. కాని ముక్కోపి యైన అన్నగారి దగ్గర మాత్రం తొందర పడడు. రావణుడు ప్రాణాలు వదిలే సమయంలో ఆయన పాదాల చెంత నిలబడి రాముడు రాజధర్మాలు తెలుసుకొనిన సంగతి తన మనసులో మెదులుతూనే వుంది.

అన్నగారికిది నిజం చెప్పే సమయం కాదనుకున్నాడు లక్ష్మణుడు. "రామచంద్ర ప్రభూ! మీకు పాపభీతి ఎక్కువ. దీనాలాపం మీరు వినలేరు. రాక్షసులు మరణించిన భూమిలో నెత్తురు, నెత్తురు మడుగులలో తెగిపడిన మొండాలను చూచినందున మీ కన్నులు చీకటులు క్రమ్మినై. భ్రమలో పడ్డారు. రాక్షసుల్ని చంపిన పాపఫల మనుకున్నారు. ఎలాగనైతేనే? సముద్ర తీరాన

శివలింగ ప్రతిష్ఠ చేశారు. ఆ క్షేత్రానికి "రామేశ్వర" మనే పేరు కూడా వచ్చింది మీకింకా భయమెందు"కని సమాధానం చెప్పాడు లక్ష్మణుడు.

రాముని కేమీ పాలుపోక పైకి చూచాడు,

## — గురువుగారి రాక —

సమయానికి పిలిచినట్లుగా గురుదేవులు వశిష్ఠులవారు వచ్చారు. రామలక్ష్మణులు చివాలున లేచి మునికి నమస్కరించి కూర్చుండ నియమించారు. తరువాత సవిస్తరంగా వారి సందేహమంతా వివరించి చెప్పారు. "కర్తవ్యం సెలవీయండి" అని అడిగారు. వశిష్ఠుడంత తాపీగా గడ్డం సవరించుకొని "వత్సలారా! రావణుడు దుర్మార్గుడైనా సన్మార్గుడైనా తపస్సంపన్నుడు. చతుర్ముఖ బ్రహ్మ కొడుకు పులస్త్యుడు. పులస్త్య బ్రహ్మ కొడుకు విశ్రవసు - విశ్రవసు బ్రహ్మ కొడుకు రావణుడు. రావణుడు కూడా బ్రహ్మే. రావణ వధతో బ్రహ్మహత్యా పాతకం రాదనడానికి వీలులేదు. ఆ పాపం పూర్తిగా పోవాలంటే మీరు రాజసూయం చేయండి"అని సలహా యిచ్చాడు.

ఆ మాట వినడంతోనే రామలక్ష్మణులు యిద్దరూ ముని పాదాలు పట్టుకొని "మీ అనుగ్రహం ఉంటే తప్పక చేస్తాం. రాజసూయ మెలాగచేయాలో ఎప్పుడు చేయాలో, చేసినందున దానివలన ఫలిత మేమిటో చెప్పండి స్వామీ!" అన్నారు.

చెప్తాను వినండి అని వశిష్ఠుడు "రామలక్ష్మణులారా! రాజసూయమంటే చాలా గొప్ప యజ్ఞం. దాని నందరూ చేయలేరు. మీరు సమర్థులు. పూర్వ మీ యజ్ఞంచేసినవారికి ఇంద్రపదవికూడా లభించింది. వారి పితృ

దేవతలందరికీ ఉత్తమలోకాలు సిద్ధించినై. పంచమహా పాతకాలైనా పటాపంచలై పోతాయి, కుబేర పెన్నిధి లభిస్తుంది. సామ్రాజ్యం చేపడుతుంది" అని చెప్పుచుండగా లక్ష్మణుడు అందుకొని "అన్నగారి కదే కావాలి. యజ్ఞవిధానంకూడా సెలవీయండి" అన్నాడు.

## రాజసూయం చేసే విధానం

"తిథి వార నక్షత్రాల మైత్రి చూచుకొని లగ్నాధిపతి బలవంతుడై ఉన్నపుడు మంచిరోజున అంకురారోపణ చేయాలి పంచ కల్యాణి సప్తాశ్వాన్ని వేదోక్తంగా పూజించాలి. 'ఇది అయోధ్యానగర మేలు రామచంద్రుడు రాజసూయ యాగార్థం విడిచిన యాగాశ్వం. బలవంతులుంటే దీనిని పట్టుకొని మాతో యుద్ధం చేసి జయించవచ్చు లేదా మా విజయాన్ని అంగీకరించి తొలగిపొండి' అని వ్రాసిన బంగారు పతకం దాని మొగాన కట్టి దేశంమీద నడిపించాలి. దాని వెంట అశ్వపాలకుని నియమించాలి. తరువాత మహా మునుల ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించాలి" పూస గుచ్చినట్లు చెప్పేశాడు.

అందుకు రాముడు సరే నన్నాడు.

వశిష్టుడు మంచి రోజు చూడడానికి వ్రేళ్ళు లెక్క పెడుతున్నాడు.

లక్ష్మణుడు మెల్లగా రాముని చెవిలో "అన్నా మా వదినగారు గర్భవతి గదా" అన్నాడు. రాముడు సవినయంగా "గురుదేవా! జానకిపుడు నెల తప్పింది" అన్నాడు. వెంటనే వశిష్టుడు వ్రేళ్ళ లెక్క నిలిపి వేసి "నిజమే నీకు పుత్రోదయమయ్యే దాకా పనికిరాద"న్నాడు "రామా! నీకు నీ కీర్తిని యినుమడింప చేసే కొడుకు పుడతాడు. ఆ తరువాత నీవు యజ్ఞం తప్పక చేయి" అన్నాడు.

శ్రీరాముడు కొలువు దీరి కూర్చున్నాడు. తమ్ములంతా చెంతనున్నారు. గురువుల సమక్షంలో రాముడు సభవంక చూచి "పుత్ర జననం తరువాత నేను రాజసూయం చేయబోతున్నా"నని ప్రకటించాడు.

## పుట్టబోయే పాపాయికి పెట్టబోయే పేరు

అయోధ్యానగరం ఆనందమయమై కళ కళ లాడుతుంది. ప్రజలకుగాని ప్రభువులకుగాని ఏ చింత చీకులు లేవు. పాడిపంటలతో శాంతి భద్రతలతో సుఖ జీవనాలు గడుపుతున్నారు. వీరజన రాచనగరం కూడా నిమ్మకు నీరెత్తినట్లు ప్రశాంతంగావుంది. రాఘవులు రాణివాసం విడిచి బయటకు రావడంలేదు. రామచంద్రులు కంటికి కనపడకపోతే జానకమ్మకు ప్రొద్దుపోవడమూ లేదు. ఏడాదిపాటు గడచి ఏకమై దంపతులు తరంగాలు తరంగాలుగా తరలి తెరలి వచ్చే ఆలోచనలు చెప్పుకుంటూనే మధురానుభూతితోనే రేపులు మాపులు దొర్లిపోతున్నాయి.

అది అలా వుండగా వారికో ఆలోచనవచ్చింది. సీతమ్మ కాపురానికి వచ్చాక వారయోధ్యలో పదకొండేండ్లున్నారు. ఆ తరువాత పదునాలుగేండ్లు అరణ్యవాసం చేసి వచ్చారు. ఇన్నాళ్ళకు వారికి సంతాన భాగ్యం కలుగబోతోంది. పుట్టబోయే పాపాయికి పెట్టబోయే పేరేమిటనేది వారి సమస్య. ఆలుమగలు అందును గురించి చర్చించడం, అది తెమలక మర్నాటికి వాయిదా వేసుకొనడంతో కాలం జరుగుతూంది.

## చుప్పనాతి చూడలేనితనం

చుప్పనాతి రావణాసురుని ముద్దుచెల్లెలు. ఆనాడు రావణుడు దొంగగా వచ్చి సీత నెత్తుకొని పోవడానికి యీ చుప్పనాతే కారణం. రాముని కొంప తీయా

లనుకుంది కాని తోబుట్టిన వాని కొంపనే కూల్చుకుంది. ఐనా బుద్ధి రాలేదు. కోపం హెచ్చింది. పక్కవారు పచ్చగా వుంటే చూచి ఓర్వలేదుగా మరి

దండకారణ్యంనుంచి రాముడు లంకకు పోయి రాక్షసుల నందరినీ హతమార్చి తిరిగి వచ్చి పట్టాభిషేకం చేసుకుని సుఖంగా బ్రతకడం దానికి సుతరామూ గిట్టలేదు. మిదుమిక్కిలి దాని ఒడలుమీద చీమలు పాకాడినట్లనిపించింది. రామ రావణ యుద్ధంలో చావుదెబ్బలు తిని చావకుండా పారిపోయి బ్రతికిన రాక్షసులు దానికి తోడయ్యారు. అందరూ కలసి రామునిమీద పగసాధించ తీర్మానించుకున్నారు. రాక్షసులకీ దేవతల మాదిరే హిమరూపాలున్నాయి. కనుక చాకలివాండ్ర రూపాలతో పోయి అయోధ్యలో రజక వాడలో వుంటున్నారు. దొంగ చాకలులంతా ఓ నాటక మాడాలనుకొని సమయంకోసం ఎదురుచూస్తున్నారు.

## త్రాగుబోతువాని తందనాలు

రాముని గూఢచారులలో నమ్మదగిన సేవకుడు భద్రుడు. ప్రభు సేవలో ప్రాలుమాలి ఎరుగడు. రాత్రివేళ మారువేషం దాల్చి వీధులన్నీ తిరిగి జనవాక్యం విని వచ్చి ప్రభువులకు నివేదించడం వానిపని. కామరూపం గల కపట చాకలులు గుట్టు పసిగట్టారు. నగర విశేషాలను కనుగొనడానికి భద్రుడొక చిన్న నాటకమాడుతుంటే ఆ భద్రుడినే చిత్తు చేయడానికి కపట చాకలులు అంతకన్నా పెద్దనాటకం మాడారు. ఆ దొంగ నాటకంలో చుప్పనాతి ఒక చాకలి - దాని మగడొక త్రాగుబోతు.

కల్లు త్రాగడం, కైపు కూతలు కూయడం దానవులకు అలవాటు పడిన పాతవిద్య. ఇప్పుడతగాడు నటించేది కూడా అదే వేషం. నడిరేయి దాటింది.

ఊరు మాటుమణిగింది. కడుపునిండా కల్లు నింపుకున్న కపట చాకలి కదనం ప్రారంభించాడు. ఇంట్లో ఉన్న యిల్లాలిని వీధిలోనికి లాగాడు. "నువ్వింక నాకొద్దంటే ఒద్దు నీకు బెమలున్న సోటికే పోయి బతుకు పో" అంటూ రంకెలు వేయ సాగాడు. ఆ కేకలకు గూడెంలోని జనమంతా గుంపుగూడారు. తీర్పు చెప్పడానికి తిప్పలు పడుతున్నారు. ఆ అమ్మి అలాంటిది కాదన్నారు. నిప్పులాంటి పిల్ల నిజం తెల్సుకోకుండా అనుమాన పడొద్దన్నారు. కొందరు అమ్మలక్కలు వచ్చి "ఒకవేళ తెలిసో తెలీకనో తప్పు చేసిందనుకో ఈ సారికి పోనీయిలే"అని బ్రతిమిలాడు తున్నారు. వాడింకా వేగిపోతూ "గట్టుదాటి పోయిన దానిని నానింక ముట్టుకోనంటే ముట్టుకో"నని ప్రజ్ఞలు చేస్తున్నాడు.

మాయదారి చుప్పనాతి మంది మనసులు కరిగేలాగా "నాకే పాపం తెలియదురా నా దేవుడో" అని నెత్తి నోరు కొట్టుకొని మొత్తుకుంటూంది.

## వినరాని విపరీత నింద

బాటసారి వేషంలో భద్రుడక్కడికి చేరుకున్నాడు. గొడవంతా విన్నాడు. వారిద్దరినీ ఒకటి చేయడానికి ప్రయత్నించాడు. ప్రయోజనం లేక పోయింది. ప్రమాదం సంభవించింది. ఆలినవమానించిన చాకలి భద్రునితో "ఇది నా పెండ్లాం నాకో పనికలిగి పక్కూరి కెళ్ళొచ్చా. నానూళ్లో లేను గందా అనుకుని రంకు మగడింటికి పోయి ఇప్పుడొచ్చింది. కుక్క ముట్టుకున్న కుండ పౌరుషం గల మగాన్ని నేను పారేత్తాను గాని ఎంగిలికూటికాశపడేది లేదు పొండిరా!" అన్నాడు ధీమాగా. "ఆడు సెప్పిందంతా అబద్ధం. అన్నేయంగా నన్నాడి పోసుకుంటుండడు సచ్చినోడు గుడిశిలో తొంగొని కునుకుపోతున్నదాన్ని తాగొచ్చి యీదిలోని

కిడిసింది. మీరైనా సెప్పి మా మామయ్య నాకు దక్కేలా సేయండి బాబా!" అంటూంది చుప్పనాతి చాకలి. ఏంచేయాలనో ఎవరికీ తోచలేదు.

భద్రుడొక ఉపాయం చెప్పాడు. ఓయీ చాకలీ! తెల్లవార వస్తుంది. రేపు మనమంతా రాజుగారి కొలువుకు పోయి చెప్పుకుందాం. రామచంద్రమూర్తి చక్ర ప్రభువు. న్యాయం విచారించి తీర్పు చెప్పినట్లు నడచుకోవడం బాగుంటుంది అన్నాడు. ఆ మాటలకు చాకలి పకపకానవ్వి "పో పోవయ్యా పెద్దమనిషీ! రాముడు నాకేంటి సెప్పేది? ఏడాదిపాటు రావణుని ఇంట్లో ఉన్న ఇల్లాలిని యిడిసేయలేక యెగ్గు సిగ్గులు లేకుండా ఏలుకుంటున్న రామయ్య తీర్పు సెప్పడం, నానేలు కోవడమా! పరాయివాని యింటనున్న పెండ్లాన్ని పరువులేని రాముడు కనుక ఏలుకుంటున్నాడు కాని, ఛా!ఛా! నానైతే చస్తే ఏలుకో"నని తెగబడ్డాడు.

ఆ మాట లాలకించిన భద్రునికి మతిపోయింది. నోటు మాటరాలేదు. కాలు చేతులు కొయ్యబారి పోయినై. చివర కెలాగో గుండె సవరించుకొని మెల్లగ ఘుంటికి చేరుకున్నాడు.

## భద్రుని మనసులో బడబానలం

ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా గడిచిపోతున్న భద్రుని మనస్సులో బడబానలం బయలుదేరింది. శరీరంలో నీరసమేర్పడింది. ఐనా తన ధర్మం తను నెరవేర్చకుండా ఉండలేడు. ఓపిక తెచ్చుకుని రాజ కొలువుకు పోయాడు. అంత మాత్రాన అతనికి ప్రమాదం తప్పలేదు. తను విన్న "లోకాపవాదు రామునితో చెప్పడమా! మానడమా!" అనేది భయంకర సమస్య అయింది.

చెప్పితే రాముడీ జననిందను సహింపలేడు. అప్పుడు సీతాదేవికి మళ్ళీ ఎలాంటి యిబ్బంది వస్తుందో ఊహించలేం. అందులోను ఆమె నిండుచూలాలు, అందుకని చెప్పకపోతే అది రాజద్రోహ మవుతుంది. ఐనా సరే తల్లిలాంటి సీతమ్మ క్షేమం కోసం సేవాధర్మం నిరసించి చెప్పక పోయినా పొగరు బోతైన చాకలి మళ్ళీ మళ్ళీ యీ మాటలనడనే నమ్మకంలేదు. అతనిని చూచి మరి కొందరూ అనవచ్చు. అప్పుడయినా రాముని చెవుల బడవచ్చు. అప్పుడు ప్రభువులు తన్నెలాగ నైనా అపార్థం చేసుకునే అవకాశాలున్నాయి. కాబట్టి చెప్పక తప్పదనుకున్నాడు. కానీ చెప్పలేక పోతున్నాడు.

భద్రునియందు రామునికో క్రొత్తమార్పు కనబడింది. ఆయనకేవో అనుమానాలు పుట్టుకొచ్చినై. అడిగి తెలుసుకోవాలి అనుకున్నాడు. ఒకనాటి రాత్రి భోజనానంతరం భద్రుని పిలిచి "మిత్రమా! కొన్నిదినాల నుంచి నీలో నాకొక విధమైన మార్పు కనిపిస్తూంది. ఏం జరిగిందో చెప్పు. నా దగ్గర నీకు దాపరికమా!" అన్నాడు. భద్రుని గుండె గుభిల్లుమంది. అతని సంకటం గమనించిన రాముడు మళ్ళీ "భద్రా నిజం దాచకుండా చెప్పాలి. నీకిది రాజాజ్ఞ" అన్నాడు కొంచెం అధికార స్థాయిలో.

## రామ-భద్రుల రహస్య ప్రసంగం

నిలుచున్న భద్రుడు నిలుచున్న పాటున కుప్పకూలి పోయాడు. రాముని రెండు పాదాలు పట్టుకొని "ప్రభూ! నేనీవార్త మీకెలా చెప్పను?" అన్నాడు కన్నుల నీరు నింపుకుని. రాముని మనసు పరిపరి విధాల పరువులెత్తింది. భద్రా! ఎలా చెప్పగలను అంటున్నావు మన రాజ్యంలో చెప్పరాని వార్తలేమున్నవి? నా మనసు తహతహలాడుతుంది. త్వరగా చెప్పు. కిష్కింధలో సుగ్రీవాది

వానరులంతా సుఖంగావున్నారా! లంకలో విభీషణాది రాక్షసులంతా క్షేమంగా వున్నారా?" అని ప్రశ్నించాడు.

కన్నీరు చేతనద్దుకుంటున్న భద్రుడు "అందరూ హాయిగానే ఉన్నారు. ఎవరికీ ఏ ప్రమాదమూ లేదు" అన్నాడు కొంచెం తొట్రుపాటు తగ్గించుకుంటూ. రాముడు గూడా కొంచెం తాపీగా "మా పరిపాలనలో అరాజకమేదైనా తలయెత్తిందా?" అన్నాడు. "రామరాజ్యంలో అరాజకమా! లేదు ప్రభూ" అని భద్రుడు సమాధాన మిచ్చాడు. రాముడు తిరిగి "మరైతే నీ మనసులో మదన పెడుతున్న మాట ఏమిటో నన్నూరక విసిగించక చెప్పవేం!" అని కసురుకున్నాడు. భద్రుడు తెప్పరిల్లుకుని "మహారాజా! వినరాని మాట విన్నాను. కాలకూటవిషంకన్న కలుషితమైన వార్త నిటు ప్రెళ్ళగ్రక్కలేక - అటు దిగమ్రింగలేక..." అని చెప్పబోయి చెప్పలేక ఆగిపోయాడు.

పూర్తిగా కోపం తెచ్చుకున్న రాముడు "ఓయీ! భద్రా! అది ఏదైనా సరే. నీవు మాకు చెప్పి తీరాలి. మేము వినితీరాలి" అని కఠినంగా శాసించాడు.

## రామభూపాలుడు వినిన రాజనింద

ఇక భద్రునికి చెప్పక తప్పలేదు. పొరలి పొరలి వచ్చే దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ "ప్రభూ! దేవరవారు ఆదేశించినట్లుగా నేను గూఢచారినై రాజనగర వీధుల్లో తిరుగుతున్నాను. ఒకనాడు చాకలిపేటకు పోయాను. అక్కడొకడు తప్పత్రాగి భార్యనవమానించి యింటినుండి బయటకు తరిమివేశాడు. ఎవరెంత సర్దిచెప్పినా వాడు ససేమిరా వినడంలేదు.

అంతలోనే అక్కడకు పోయిన నేను పనిగట్టుకొని "ఓయీ! రేపు రాజసభలో చెప్పుకొనండి. రామచంద్రమూర్తి న్యాయం విచారించి తీర్పు చెప్పి నట్లు నడచుకొనడం బాగుంటుంది" అన్నాను. వాడంతట పకపకా నవ్వి "పో పోవయ్యా! పెద్దమనిషి! ఆ రాముడు నాకేటి సెప్పేది? ఏడాదిపాటు రావణుని యింట్లో ఉన్న యిల్లాలిని యిడిసేయలేక ఎగ్గు సిగ్గులు లేకుండా ఏలుకుంటున్న రామయ్య తీర్పు సెప్పడం- నాను వినడమా! పరాయివాని పంచనున్న పెండ్లాన్ని పరువులేని రాముడు కనుక ఏలుకుంటున్నాడు కాని ఛా!ఛా! నాసైతే చస్తే ఏలు కోను" అని ఒడలు తెలియని పొగరుబోతుతనంగా మాట్లాడాడు" అని విన్న వించాడు.

భద్రుని నోటినుంచి ఆ మాటలు వెలువడుచుండగానే రాముని దేహం మీద చమటలు పోసినై. కాలుసేతులు కంపించినై. కన్నులు బూజరులు క్రమ్మినై. ఓ భగవంతుడా!" అంటూ పాన్పుమీదికి ఒరిగాడు. అది చూచిన భద్రుడు వెంటనే సీతలోపచారాలు చేసి రాముని తేరుకునే లాగా చేశాడు. ఆ తరువాత రాముడు "ఏమన్నాడా చాకలి?" అంటూ మళ్ళీ మళ్ళీ చెప్పించుకున్నాడు. ఏంచేయాలనో దరీపరి తెలియని స్థితిలో పడిపోయాడు.

## రహస్య మందిరంలో రామానుజులు

లోకనింద మోయడం లోకేశులకైనా భారం. రాజ్యమేలే రాజు ప్రజల కాదర్శనీయుడై వుండాలి. నిజాయితీని వెల్లడించి నిందబాపుకున్న జీవితమే మానవ జీవితం. సూర్యవంశంలో పట్టాను. దశరథుని యింట్లో పెరిగాను. సుధన్వాచార్యుల శిష్యుడనయ్యాను. మునీంద్రులచేత మెప్పులు పొందాను. రాక్షసవీరుల చంపి

లోకైకవీరుడు ననిపించుకున్నాను. రేపు రాజసూయ మహాయజ్ఞం కూడా - చేయబోతున్నాను. ఇంతవానిని నన్ను ఇంకొకరు వ్రేలు పెట్టి చూసి వెక్కిరించడమా? అలా జరగకూడదు,

అలాగనని త్రాగుబోతువాని తక్కిరి బిక్కిరి మాటలకు బెదిరిపోయి పిరికివాడనై సీతను విడనాడుటయా దైవమా! ఆమెకేపాపమూ తెలియదు ? ఆమెలో ఏ లోపమూ కలుగదే ? మచ్చలేని మానవతిని - నెలలు వచ్చిన నిండు చూలాలిని-నన్నే నమ్ముకున్న అన్నులమిన్నను నా యింటినుండి వెళ్ళిపొమ్మనుట సమంజసమా ? అనక చేసేదేమి ?

చివరికేదీ తెగతెంపులు చేయలేకపోయిన రామచంద్రుడు తమ్ముల సలహా తీసుకోవాలి అని వెంటనే సేవకుల నియమించి లక్ష్మణ భరత శత్రుఘ్నులను తన మందిరానికి పిలిపించుకున్నాడు. ముగ్గురు సోదరుల్నీ కూర్చుండ నియమించాడు. ఆ తరువాత వారికి తను విన్న వార్త గురించి సవిస్తరంగా చెప్పి "ఇంతకూ నేనిపుడు సీతను హర్షించి యింటనుంచుకొనవలయునా ? ఎందయినా వెడలనంపవలయునా? కర్తవ్యం చెప్పండి" అన్నాడు.

ముప్పురన్నదమ్ములకూ నిలువుగుండెలు పడిపోయినై.

## రామానుజుల రౌద్రావేశం

వదినగారిమీదమాటపడనీయని ముగ్గురు తమ్ములూ దిగ్గున లేచారు. "అన్నా! ఎంతమాటన్నాడు ? ఎవడు వాడు ? చెప్పండి. వాడెందు దాగియున్నా వెదకి తెల్లవారే లోపల వాని తల నరికి తీసుకవస్తాం" అని విల్లు బాణాలు సవరించుకుంటున్నారు. వారి ముఖాలు కందగడ్డల్లా ఎరుపెక్కాయి.

రాముని ముఖంలో కోపం లేదు. పేలవంగా నవ్వాడు. "తమ్ములూ! మీరు తొందర పడుతున్నారు. మీరు చేయబోయేది మంచిపని కాదు. అందువలన మనమీద వచ్చిన నింద బలపడుతుంది కాని తొలగిపోదు. ఇది ప్రపంచం. ప్రపంచంలో జరిగే మంచి చెడ్డలమీద ప్రజలకు రకరకాల అభిప్రాయాలుండొచ్చు. అది ప్రకృతి సహజం. పుట్టి పెరిగి పుడమిమీద పదికాలాలపాటు బ్రతుకదలచిన వారెవరూ ఎదుటివారి లోపాలను వారి ఎదుట చెప్ప సాహసింపరు. చాటుమాటుగా అనకుండనూ వుండరు. ఆ కారణంగానే "ప్రజలు మనల గురించి మన పాలనను గురించి ఏమను కుంటున్నారో వినిరండి" అని చారుల నియమించాం. ప్రజాభిప్రాయాల మీద శాసించే అధికారం ప్రభుత్వానికిలేదు. నేనే రాజును. నా ఇష్టమే చెల్లాలి అనే నిరంకుశ పాలన నేను చేయను. నాతమ్ములును నా మాట మీరరనే నేనతను కుంటున్నాను. కావున మీరు సావధానంగా కూర్చుండి మన మిపుడేమి చేయ వలయునో మీమీ అభిప్రాయాలను వెల్లడించండి" అన్నాడు.

## లక్ష్మణుని సమాధానం

"అన్నయ్యా! లోకులు కాకులు. తమవంటి వారు అల్పులను లెక్క చేయరాదు. అదీగాక, ఆ మాటలాడిన వాడు తప్పత్రాగిన వాడని తెలియుచునే వున్నది. త్రాగుబోతుల మాటలు మనము పాటింపదగినవికావు. ఎవరేమన్నా మా వదినగారు మహా పవిత్రురాలు. దేవతలే ఆమె శీలాన్ని కొనియాడారు. మహా యిల్లాలయిన మా వదినగారి నన్నవానిని యిక్కడ మీరు దయతలచి విడిచి పెట్టినా అక్కడ యమధర్మరాజు దండింపక విడిచిపెట్టడు.

ఆనాడు లంకలో తన శీలం రుజువు చేయడానికి నిప్పులలో దుమికింది. అగ్నిదేవుడే స్వయంగా వచ్చి సీత ననుమానించే పనిలేదని చెప్పాడు ఆ సమయాన దేవతలు గగనతలంనుంచి పూలవాన కురిపించారు. ఎక్కడెక్కడివారూ ముక్కుల మీద వ్రేళ్ళేసుకున్నారు. మునిగణమంతా పొగిడింది. అదంతా యిక్కడివారికి తెలియకపోవచ్చు సూర్యభగవానుడు మన వంశానికి మూలపురుషుడు. ఆయన కర్మసాక్షి కూడాను. మనం కోరితే తప్పకుండా వచ్చి నిజం చెప్పుతాడు. సూర్యనారాయణమూర్తి చెప్పినదానికి తిరుగులేదు. మీరా పనికి మాలిన వాని మాటలు మనసునందుంచుకొనక నిశ్చింతగా యుండడం మంచిదని నాయభిప్రాయ మన్నాడు లక్ష్మణుడు.

## భరతుని సమాధానం

అన్నయ్యా! మహనీయులు ఆదేశించినవే మనకు మార్గదర్శాలు. మూఢుల మాటలు మనము పాటింపదగినవికావు. వాడసలే చాకలివాడు. సంస్కారమంతకన్నా లేదు. ఆ పైన తప్ప తాగిన తుంటరి. ఇప్పుడన్న మాట యింక కొంచెం సేపటికి వుండదు. పరువు మర్యాదలన ఎట్టివో వాడికి తెలియవు. పామరుని మాటకు మీరు చింతపడ పనిలేదు.

మా మాటలు మీరు కాదంటే మరొకపని చేయడం మంచిది. మనకంటే పెద్దలున్నారు. మనకు వారు గురుతుల్యులు. వారి నడిగి చూద్దాం. వశిష్ఠముని మనందరికీ పెద్ద మన వంశానికా మహాముని కులగురువులే గాక పురోహితాచార్యులు కూడాను. ధర్మాలు వారికి తెలిసినంతగా యింకొకరికి తెలియవు. ఇంకనూ సుమంత్రాది మంత్రులున్నారు. వారు రాజ్యాంగ ధర్మాల్లో మంచి మేధావులు.

పూజ్యురాండ్రయిన ముప్పురమ్మలున్నారు. వారి తీర్మానము మనకు తల ధరింప తగినది. వారినందరినీ అడుగుదాం. షదిమంది నడిచింది బాట కనుక మనం పెద్దల ననుసరించడం మంచిది అన్నాడు.

## శత్రుఘ్నుని సమాధానము

అన్నయ్యా! మీరు ధర్మమూర్తులు, దయామయులు. ఆకతాయి వారి మాటలకు ఆస్కారమిచ్చి మానవంతులను విడనాడరాదు. మీకు తెలియని న్యాయ మంటూ లేదు. ఒకరు నిందితులుగ శిక్ష పొందవలయు నంటే వేరొకరు నేరము నిరూపించెదనని ముందుకు రావాలి. అప్పుడు నిందితుడు పంచాయితీ వారి ముందర తగిన సమాధానము చెప్పాలి. ఉభయుల వివాదాలు విన్న తరువాత న్యాయ నిర్ణేతలు వానిని దోషిగ నిర్ణయించాలి. అప్పుడు గాని నిందితుడు నేరస్థుడు కాడు. అంత జరిగాకనైనా న్యాయాధిపతులు దండనీతి శాస్త్రాన్ని అనుసరించి తగిన శిక్ష విధించాలి గదా !

ఇప్పుడు నేరారోపణ చేసినవాడు మనకు కనబడనే లేదు. వాని నోట మాటలు మన మాలకింపనూ పనిలేదు. మధ్య వానిగ వినివచ్చిన భద్రుడు మన వాడైనను వానియందు మన కెంత నమ్మక మున్నను ధర్మ శాసనమునకు దూరాలైనందున మనము వానిని పాటింపరాదు. మా వదినగారు నింద్యులుకారు. కావున మీరింక నా విషయాన్ని మరచిపోవచ్చునన్నాడు.

## రాముడు తీసుకున్న రాజనీతి

తమ్ములు చెప్పిన మాటలు రామునికి నచ్చలేదు.

"అబ్బాయిలూ ! రాజ్యపాలన మంటే కత్తిమీద సాములాంటిది. ఎటు మొగ్గినా ప్రమాదమే. పేచ్చు కత్తులు పొంచి యుంటవి. అవి బయటకు కనపడవు. మనకిపుడు వచ్చిన సమస్య కూడ అలాంటిదే. అపవాదుకు నేను భయపడి సీతను యింటినుండి వెడలనంపితే నన్నందరూ పిచ్చివాడనంటారు. పంపకపోతే పిరికివాడ నంటారు. ఏదైనా ఒకటి తప్పదు. తప్పులెంచే వారికి తమ తప్పులు తెలియవు. ఎదుటివారిని వెక్కిరించడమే వారిపని.

సీత నా యొద్దనే ఉంటే ఆ చాకలి మళ్ళీ యిలాగే మాటాడుతాడు. మళ్ళీ అంటాడు. కొన్నాళ్ళకు మరి కొందరూ అనగలరు. ఇక మీద ఎవరూ యీ మాటలనకుండా ఉండాలంటే మీ వదినను వెంటనే యింటినుండి వెడలనంపాలి. ఆమె యీ అయోధ్యలోనే కాదు నగరములో ఏ మారుమూలలగూడా ఉండరాదు. సరయూనది గంగానదులను గూడ దాటిపోవాలి. అది నా నిర్ణయము. మీలో ఎవరైనా సరే వదినను మున్యాశ్రమ ప్రాంతాల్లో విడిచిరండి" అన్నాడు రాముడు.

ఎవ్వరూ మాటాడలేదు.

రామునికి కోపం వచ్చింది. ఐనా తమాయించుకున్నాడు. "ఏం? మీలో ఎవరూ యీ పని చేయలేరా? చేయకండి. తండ్రిగారి ఆనతి తలదాల్చి నేను పదు నాలుగేండ్లు వనవాసం చేసి వచ్చాను. కాని నా తమ్ములు నా మాట విని ఈ చిన్న పనినైనా చేయలేక పోయినపుడు నా కింకా రాజ్యమెందుకు? జీవితమెందుకు? ఏ అడవికైనా పోయి ముక్కు మూసుకుని కూర్చుంటాను. మీరే ఈ రాజ్యాన్ని ఏలు కోండి. మీ వదినగారి నిక్కడే ఉండిపొమ్మనండి" అంటూ ముందడుగు వేయ బోయాడు.

## శత్రుఘ్నుడు చెప్పిన సాకు

ముగ్గురు తమ్ముళ్లూ ఒక్కసారిగా రాముని పాదాలమీద వ్రాలారు. "అన్నయ్యా! ఏమిటి మీరనేది? ఏ పాపమూ తెలియని యిల్లాలిని నట్టడవిపాలు సేయడానికి ఎవరి మనసంగీకరిస్తుంది? రాజవంశములో పుట్టాము. రాజ మర్యాదల్లో పెరిగాము. రాజ్యపాలన చేస్తున్నాము. నలుగురమన్నదమ్ములము ఉండికూడా ఒక స్త్రీకి న్యాయము కలిగించలేకపోతున్న బలహీనత నెంచుకుని యోచించడము మా నేరమా? ఇంత మాత్రానికే మీరు అడవులకు వెళ్ళిపోతారా! పెద్దవారికి మీకే పనికిరాని ఈ రాజ్యము మాకుమాత్రమెందుకు? మేమూ మీ వెంటనే వస్తున్నాము పదండి" అన్నారు. రాముడేమీ చెప్పలేక మళ్ళీ తన పాన్పుమీద కూలబడ్డాడు.

లక్ష్మణ, భరత, శత్రుఘ్నులూ కూర్చున్నారు.

కొంచెము సేపు అందరూ మౌనముగానే వున్నారు.

రాముడే మళ్ళీ కలగచేసుకొని "తమ్ముళ్లూ! నేనీ విషయములో సీతకు అన్యాయం చేస్తున్నానని నాకు తెలుసు. ఉత్తమ యిల్లాలిని యిక్కట్టులు పెట్టిన పాపము నన్నూరకే విడిచిపెట్టదనికూడా నేనెఱుంగుదును. ఐనా జననిందపడిన నేను నింద బాపుకొనడానికే యిలా తెగించాను. మరొక విషయము. ఆమెను వనములో విడిచి వచ్చేదాకా ఈ సంగతి బయటకు పొక్కరాదు. అందువలన కొన్ని ఆటంకాలు రావచ్చు. శత్రుఘ్నా! నీవు మీ వదినను "అడవిలో విడిచి పెట్టిరా!" అన్నాడు.

శత్రుఘ్నుడు "అన్నగారూ ! నేను మీయందరికన్న చిన్నవాడ నా కెందులోను అనుభవం లేదు, నేనీ పని చేయలేను. నన్ను మన్నించండి" అం లేచిపోయాడు.

## భరతుడు చెప్పిన మాట

రాముడు భరతుని చూచి "సోదరా! శత్రుఘ్నుడు చెప్పింది స సబబుగానే వుంది. ఇలాంటి సమయాలలో మెలకువలు కావాలి. జాగ్రత్త చాలక కార్యం చెడిపోతుంది. భరతా! నీవు నా తరువాత వాడవు. రాజ్యానికి యువరాజు నేనేలాల్సిన రాజ్యాన్ని పదునాలుగేండ్లు నీ పాలన క్రిందనే వుంచిన విష అందరికీ తెలిసిందే. ఆనాడు నీవు నా మాట కాదనలేదు. ఈనాడు కూడా పోయి మీ వదినను అడవిలో విడిచిపెట్టిరా" అన్నాడు.

భరతుడు వినయంగానే "అన్నగారూ! నేనేనాడూ రాజ్య మేలలే రాజ్య కాంక్ష నాకులేదు. అన్న చాటున మసలడమే నాకు కావలసింది. గత నాలుగేండ్లు రాజ్యం మేలింది నేనుకాదు. మీ పాదుకలు. నేనా పాదుకలకు కా దారిని మాత్రమే. నాకన్న అనుభవశాలి లక్ష్మణుడు మహారాణి గారి చెంత తమ్ము శత్రుఘ్నున కెంత చనువో నాకు అంతే. మీ దగ్గరా, వదినగారి దగ్గరా చన కలవాడు సౌమిత్రే కనుక వానికే యీ పని నియమించండి. నేనింక పోయి వస్త నంటూ వెళ్లిపోయాడు.

## సమ్మతించిన సౌమిత్రి

"సౌమిత్రీ ఇక మనమిద్దరం మిగిలాం. తమ్ముడై పుట్టినందుకు నా కష్ట అన్నిటిలోను నీవు పాలు పంచుకున్నావు. నీవు నా వెంట లేకపోతే నిజా

నేనా రాక్షసుల్ని చంపలేను. ఇది నేను నిన్ను పొగడడం కాదు. ఇది వరకు లాగే యిప్పుడు కూడా నీవే యీ పని నెరవేర్చాలి. మీ వదినను రథం మీద ఎక్కించుకుని పోయి వాల్మీకి ముని ఆశ్రమ ప్రాంతంలో విడిచి పెట్టిరా” అన్నాడు రాముడు.

లక్ష్మణుని కన్నులు నీటికుండలయ్యాయి. “ఆమె నాకు తల్లిని మరపించిన తల్లి. నన్ను కన్న బిడ్డలా కనికరించి చూచిన వదినగారిని చేతులారా నేను అడవులపాలు చేయగలనా? ఆనాడు పర్ణశాలలో సీత కనపడక పోయినపుడు ఏ క్రూరమృగాల వాతనైన పడిపోయినదేమోనని తహతహలాడి పోయిన మీరే యిపుడు ఆ సీతను అడవులలో విడిచి రమ్మంటున్నారు. ఇపుడు నేనేం చేయగలను” అని నిట్టూర్పు విడిచాడు.

రాముడు తలవంచి “బ్రహ్మ వ్రాసిన వ్రాతను తప్పించే దెవరు? ఎవరి పని వారు చేయడం కావాలి. సీతతో నేనే స్వయంగా చెప్పి ముని పల్లెకు ప్రయాణం చేయిస్తాను. ముని కాంతల్ని దర్శించడమంటే ఆమెకు చాలా యిష్టం. ఆమెను ముని పల్లెకు తీసుక పోయిందాకా దారిలో నీవీమాట చెప్పొద్దు” అని ఆంక్ష పెట్టాడు. అలాగే సుమంత్రుని గూడా పిలిపించి “వెంటనే రథం సిద్ధం చేయించు”మని చెప్పాడు.

## రాణీ[illegible] రామచంద్రులు

పట్టెమంచం పరుపుమీద పవళించింది పట్టపు రాణి. దాసీలు వింజామరలు వీస్తున్నారు. రాణివాసం సంపడికొలువుతూంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. “ఏమిటమ్మా! ఏమయింది?” అంటూ పరిచారికలంతా

గుంపు గూడారు. కాస్త తమాయించుకున్న సీత "ఏమీ లేదే? యధాలాపనగా కన్ను మూసాను. ఆ కన్ను మూతలో ఒక చిన్న కునుకు పట్టింది. ఆ కునుకులో పీడ కలొచ్చింది. అంతే" అన్నది.

తొందరగా వచ్చిన మరొకదాసి "అమ్మా! అమ్మా! రామచంద్రులవారు వస్తున్నారు. అంది. సీత ఎదురేగి రాముని గౌరవించింది. కూర్చుండ నియమించింది. పరాధీన చిత్తంతో పరాకుగానున్న ప్రభువును పలుకరించి "స్వామీ! మాకేమి ఆజ్ఞ?" అన్నది. కొంచెం తటపటాయించిన రాముడు మనసు కుదుటపరచుకుని "మహారాణి గారికొక మంచిమాట చెప్పాలని వచ్చాం" అన్నాడు లేని నవ్వు తెచ్చుకుంటూ. సీత తలవంచి "ప్రభువుల చిత్తం సెలవీయండి" అన్నది. ముక్తసరిగ "రేపే నీ ప్రయాణం" అన్నాడు రాముడు. ఆ మాటకు కంపించిన సీత "ఆఁ" అంటూ తలెత్తి చూచింది. అది గమనించిన రాముడు జాగ్రత్త వహించి "ఈమాత్రానికే యింత కలత పడడం దేనికి? మునిపత్నుల్ని చూడాలనుకున్నావు కదా! పుత్రవతివి కాబోయే ముందు వారి దీవెనలు పొంది రావడం మంచిదని ఏర్పాటు చేయించాం. మీ మరిది లక్ష్మణుడు మీకు వెంట వస్తాడు. రేపే ప్రయాణం అన్నాడు రాముడు.

## రాముడు సీతను మునిపల్లెకు పోయిరమ్మనుట

అసలే అమాయకురాలు. ఆపైన అనుమానం లేదు. సీత మగని మాటల మనసారా నమ్మింది. చాలా కాలానికి సంతానం కలుగబోతుంది. కులముద్ధరించే కుమారుడు కలగాలి. గర్భవతులందుకే పూజ్యుల దీవెనల పొందుతుంటారు. మునిపల్లెకు ప్రయాణమంటే నిజమేనని భ్రమపడిపోయింది. ఇంతవరకూ గడిచిం

ప్రేమమయ జీవితం. అలాంటి భర్త తన కిపుడు అపకారం తలపెట్టాడని ఆమె అనుకునే వీలు లేదు.

సీతమ్మ రామునితో "స్వామీ! మనం వనవాసం చేయబోయేనాడు తిరిగి క్షేమంగా యింటికి చేరితే గంగాభవానికి నేను మాంసం, కల్లు యిస్తానని మ్రొక్కుకున్నాను. అలాగే వచ్చాం. హాయిగా వున్నాం. చల్లనితల్లి గంగానమ్మకు నేనిస్తానన్న మ్రొక్కులు నేనిపుడు చెల్లించుకోనా" అని అడిగింది. పాత మొక్కులు తీర్చడమంటే రామునికి కూడా సంతోషమే. నిండుదనంగా రాముడు "పిచ్చిదానా! దానికి నన్నడిగేదేమిటి ? అలాగే గంగకర్పించే దానిని సక్రమంగా సమకూర్చుకో" అన్నాడు. సీతమ్మ పొందిన ఆనందం చెప్పనలవికాదు. అప్పటికప్పుడే కల్లు, మాంసం తెప్పించి ముడుపులు కట్టించింది.

మరునాటి మూడవజామునందే లేచి తలంటు స్నానం చేసింది సీత. తలదువ్వి పూలు పెట్టుకుంది. బొట్టు కాటుకలు దిద్దుకుంది. మంగళసూత్రం ఒకసారి కన్నులకద్దుకుంది. మునుల దర్శనానికి వెళ్ళేటప్పుడు రాజలాంఛనాలు ధరించటం విధేయత కాదనుకుని నిరాడంబరముగనే అలంకరించుకుంది. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని యెదురు చూస్తోంది. పాపం నేటి రాముడు నిన్నటి రాముడు కాదని తెలియని అమాయకురాలు.

## సీతాదేవి వన ప్రయాణం

సూర్యోదయం కాకముందే రథం వచ్చి కోట ముఖద్వారం ముందాగింది. ప్రయాణ సన్నాహంలో ఉన్న సీత రథం చప్పుడు వినగానే చివాలున లేచింది. సూర్య భగవానునికి నమస్కరించింది. ముని పల్లెకు పోయివస్తానని

ముప్పుర త్తలకూ చెప్పింది. పూలచెట్ల ను పరామర్శించవలసిందిగా దాదులను నియమించింది. పెంపుడు జింకలను పలుకరించునంతలో ఎదురైన రామచంద్రుని పాదాల నంటి కన్నులకద్దుకుని అనుమతి పొంది వచ్చి రథమెక్కి కూర్చుంది. పరివారపు స్త్రీలు పల్లకీలెక్కారు. రాజభటులు గుర్రాలనెక్కారు. మహారాణిగారంతకముందే కట్టించి సిద్ధపరచిన ముడుపుల్ని అంతఃపురంలోని పనివారు తెచ్చి రథంలో వుంచారు. లక్ష్మణుడు వచ్చి మాటాడకుండానే తనస్థానంలో తాను కూర్చున్నాడు. ముత్తయిదువులు హారతులు తిప్పారు. మంగళవాద్యాలు మ్రోగినై, రథం కదిలింది. రాముడప్పుడు "సీతా! నీవు కోరిన కోరిక నీకు చెల్లిస్తున్నాను. నేననుకున్న పనికూడా నెరవేరింది. ముందు నీ దారి సుగమమవుతుంది. నీకు దేవతలు సాయపడుదురు. నీకు జయమగుగాక-నీ సంతానానికి అంటూ నిలబడిపోయాడు.

రథం నడక వేగమయింది. సీతారాములు ఒకరి కొకరు ఎడమయ్యారు.

## సీతాదేవి గంగానదిని దాటుట

రాజ పరివారాలు ఆ రాత్రికి గోమతీనదీతీరం చేరుకున్నాయి. సౌమిత్రి ఆజ్ఞ ననుసరించి వారంతా నాటికక్కడే విడిదిచేశారు. ఎవరెవరి స్థానాలలో వారు శయనించారు. సీతకు మాత్రం కన్ను మూతపడలేదు. రామచంద్రునిలో ఏదో క్రొత్తదనం తనకు కొట్టొచ్చినట్లుగా కనబడుతూంది. వారినడిగి తెలుసుకుందామంటే ప్రయాణం సందడిలో వీలుబడకపోయింది. ఆమె కదే మనోవ్యథగా వున్నందువలన చాలాసేపు నిద్రపట్టక తెల్లవారుజామున కాస్త కునుకుపట్టింది.

మరునాడు వారంతా ప్రయాణాలు చేసి గంగానదీ తీరాన్ని చేరుకున్నారు. ప్రొద్దుక్రుంకినందున అచటనే బసచేశారు. సీతమ్మ మనసులో కలవరం తీరకపోయినా గడిచినరేయి నిద్రలేనందునను ప్రయాణపు బడలిక కలిగినందునను యీ రోజు నిద్రపట్టింది. అప్పుడేవో ఆమెకు దుస్వప్నాలే వచ్చినై. తెల్లవారగ ఆమెగూడ లేచి కాలకృత్యాలు తీర్చుకుంది. గంగాభవాని కీయాలనుకున్న మ్రొక్కుబడులు చెల్లించింది. "అమ్మా! గంగా! నేను వెనుకటి మాదిరే తిరిగి వచ్చి నాపతి సన్నిధిని చేరుకుంటే నీకు మళ్ళీ కల్లు, మాంసం యిస్తానని" చేయెత్తి నమస్కరించింది.

మూడవనాటి ఉదయాన మంది మార్బలమంతా నావలలో గంగానదిని దాటారు. చేరదలచుకున్న ప్రదేశాలకు చేరుకున్నారు. అక్కడ గుడారాలు వేశారు. అక్కడనే నాటికి వారందరి నివాసం. జానకి రావాలనుకున్న చోటికి వచ్చిందే కాని చెందాలనుకున్న తృప్తి చెందలేక పోతూంది. ఆమె మనసులో సంతోషంలేదు. "రామచంద్రులలో మార్పు కలిగిన కారణమేమిటా!" అన్నదామె మనసును కలచివేస్తూంది. ఆమె హృదయంలో సుడిగాలులు చెలరేగినై.

## పరివారమంతా కనపడకపోవ్వటం

సీతమ్మ నిద్రలో ఉన్న సమయం. లక్ష్మణుడు తమవెంట వచ్చిన పరివారాలను, పరిచారికలనూ వెనుకకు తిరిగిపొమ్మని ఆజ్ఞాపించాడు. రాజ సోదరుల ఆజ్ఞ కాదనలేక సైన్యమంతా కిక్కురుమనకుండా ఎటువారటునుంచే తిరిగి గంగానది దాటి వెనుకకు పోయారు. సీత నిద్రలేచి చూచేసరికి శిబిరాలు లేవు, సేవకులూ లేరు. "కలగంటున్నానా! మేలుకున్నానా!" అనే సందేహంలో పడి

పోయింది. లక్ష్మణుడు మాత్రము చేతులుకట్టుకుని నిలబడ్డాడు. మొద్దుబారిపోయిన దేహాన్ని సాధనకు తెచ్చుకుంటూ "ఏమిటయ్యా! సౌమిత్రీ ఇదంతా అగమ్య గోచరముగా వుంది. మళ్ళీ మనమేదయినా రాక్షస మాయలో పడ్డామా!" అన్నది. నేలవంకచూచి గుటకలు మ్రింగుతున్న లక్ష్మణుడు తలెత్తకుండానే "మీకీమాట ఎలా చెప్పాలనో తోచటంలేదు తల్లీ!" అన్నాడు. ఆ మాట విన్న సీతమ్మ గుండె యింకా బేజారెత్తిపోయింది. "ఏమిటి మరిదీ! జరిగిన దేమిటో చెప్పు" మని రెట్టించింది.

## పసిపిల్లవానిలాగ బావురు మన్నాడు లక్ష్మణుడు

"నాకేదో భయంగా వుంది. ఇంటినుండి ఏదైనా వార్త వచ్చిందా? ఎవరికైనా కీడు కలిగిందా! మీ అన్న రామచంద్రులు క్షేమంగా వున్నారా! యిదేమిటి యీ వైపరీత్యము? రాత్రి పవళించిన మన పనివారమంతా తెల్లవారుసరికి కనబడరేమిచిత్రం? మునిపత్నుల్ని చూడడానికి యింకోమారైనా రావొచ్చు. వెంటనే యింటికి పోదాము బయలుదేరు" అంటూ అడుగుముందుకేసింది. అది చూచిన లక్ష్మణుడింకా తలగొట్టుకుని "మిమ్మల్ని తిరిగి పట్నానికి తీసుకొనిపోయే అదృష్టం నాకు లేదు తల్లీ! ఇది ప్రభువులైన శ్రీరామచంద్రుని ఆజ్ఞ" అన్నాడు లక్ష్మణుడు.

సీతమ్మ "ఏమిటి! నన్నిక్కడనే విడిచి రమ్మన్నారా!" అన్నది త్రొట్రుపడుతూన్న మనసుతో. సౌమిత్రి "ఔను" అన్నట్లుగా తలాడించాడు.

## లోకాపవాదు సీత కెరిగించుట

లక్ష్మణుడు నోటితో చెప్పలేక తలతో చెప్పిన సమాధానము గ్రహించి నంతనే "ఆఁ నా స్వామి నన్ను విడిచిపెట్టి రమ్మన్నారా!" అంటూ మొదలు నరికిన మ్రానులాగ పడిపోయింది సీత. లక్ష్మణుడు దరిదాపులనున్న కొలనులోని నీరు తెచ్చి వదినగారి మోముపై చల్లి తామర పాకుతో గాలి వీచాడు. లేచికూర్చున్న జానకి "లక్ష్మణా! నీ వన్నది నిజమా! హాస్యమా!" అని అడిగింది. మానసిక బాధతో క్రుగ్గిపోతున్న లక్ష్మణుడు "అయ్యో తల్లీ! ఎంతమాట! నేనెన్నడైన మీతో పరియాచకములాడి యెరుంగుదునా! యిప్పుడు మాత్రమాడుదునా! ఎంత మాత్ర మును నా మాటలబద్ధములు కావు. మిమ్ము అడవులందే విడచి రావసిందిగా అన్న గారు నన్నాజ్ఞాపించిన మాట పరమసత్యము. అస్వతంత్రుడనైన నాకీ కార్యము తప్పనిసరియైనది" అని మళ్ళీ కన్నీరు పెట్టుకున్న సౌమిత్రితో "రఘు రాములవారికి నా మీద అంత కోపం రావడానికి కారణమైనా చెప్పు" అంది జానకి.

"అన్నగారికి మీమీద కోపం లేదమ్మా! యిదంతా మేము చేసుకున్న పాపం. మన నగరంలోనే తప్పత్రాగిన తుంటరి యెవరో ఏడాదిపాటు రావణుని యింట్లోనున్న యిల్లాలిని విడిచిపెట్టలేక ఎగ్గుసిగ్గులు లేకుండా రామయ్య తీర్పు చెప్పడం-నేను వినడమూనా! పరాయివాని పంచనున్న పెండ్లాన్ని పరువులేని రాముడు కనుక ఏలుకుంటున్నాడు. ఛా!ఛా! చస్తే ఏలుకోనని కారు కూతలు కూశాడట. అందుకై రాముడిలా చేశాడేకాని యిందులో సీతమ్మ పాపమంటూలే" దన్నాడు.

## సీతకు కలిగిన సంతాపం

ఏమి ! రామప్రభువులకు నా వలన అపఖ్యాతి వచ్చినదా! ఎంతచోద్యముగ నున్నదీ సంఘటన ? నేను పడిన శ్రమనైనా రాముడు తలంచలేదా ? నడిమింటి వారి మాటలకు ఓడి నమ్ముకున్న యిల్లాలిని నట్టేట ద్రోయుటయేనా న్యాయము ? కట్టుకున్న కాంతుడే కాదనినప్పుడు కాంత బ్రతుకుట మాత్రమెందుకో ? ఆర్యపుత్రుడు ధర్మమూర్తులు గదా! వివాహకాలమందున అగ్నిసాక్షిగా "యికముందెట్టి కష్టముగాని, సుఖముగాని ఈ నాతిని విడనాడ"నని చేసిన ప్రమాణాలేమైనవి ? అది తప్పరాదని కదా మీ తండ్రి దశరథమహారాజు తన ప్రాణాలలో ప్రాణమైన పెద్ద కుమారుని అడవులకు పంపినాడు ? ఆ దశరథమహారాజుగారి ముద్దుల కుమారులు పెండ్లినాడు చేసిన ప్రమాణాలను పాటించడానికి బదులుగా పరిత్యజింపనెంచి భార్యను విడనాడుతున్నారా.

ఇంతకూ నా తలవ్రాత యిట్లుంది. ఎవరినన్న వచ్చేదేమిలేదు. ఈ మొండి ప్రాణాలతో బ్రతికివుండి లోకులందరి నోళ్ళలోనూ "పెనిమిటిచే యింటి నుండి వెలడనంపబడిన పడతి సీత ఈమె ఈమెయే" అని అనిపించు కొనలేను. ఎవరికినీ పనికిరాని ఈ నీచపు బ్రతుకు బ్రతుకుటకన్న చావు చాలామేలు నాయనా! లక్ష్మణా! మొదటినుండీ యిట్టి దిక్కుమాలిన పనులకు నీవే నడుముగట్టుకొనుచున్నావు. అందుకే మీయన్న నేడు కూడా ఈ పనికి నిన్నే నియమించినాడు. మంచిది ఇంత దూరము వచ్చిన వాడవు రానే వచ్చావు. ఇంకొక పుణ్యముగూడా కట్టుకో నీవుచూస్తుండగానే నా గొంతు కురిబిగించుకొని చనిపోతాను. అంతటి ఈ చివరి వార్త కూడా నీవే మోసుకునిపోయి మీయన్నగారికి వినిపించడం బాగుంటుంది." అంటూ పవిటకొంగుతో గొంతు కురిబిగించుకొన బోయింది.

## మరిది చెప్పిన మంచి మాటలు

సీత మాటలన్నీ ఈటె పోటులై లక్ష్మణుని మనసు గాయపరచినై. సీత కన్నా ముందుగా తనే చచ్చిపో గలిగితే బాగుంటుంది అనుకున్నాడు లోలోపల.కాని అంతకంటె ముందు సీత నా ప్రమాదంనుంచి తప్పించడము అవసరం కనుక "నన్ను మన్నించు తల్లీ!" అని పెద్దపెట్టున కేకపెట్టడంతో ఆమె లక్ష్మణునివంక చూచింది. లక్ష్మణుడంతట దీనాలాపనలుగ "అమ్మా! నీకు నా మొగం చూపుటకుగూడ సిగ్గు పడుతున్నాను. నీవు నీ కొరకు కాకపోయినా నీ గర్భమందున్న ఆ చంటి బాబును గురించియైనా బ్రతకాలని నా ప్రార్థన, భూమిమీద రామభూపాలుని వంశం నశింపరా"దన్నాడు.

"అమ్మా! నీకు పుట్టబోయే పాపాయి నీకానందం చేకూర్చదను నిరాశ పొందుటెందుకు? చిరంజీవి కన్నతండ్రుల కన్నుల దెరిపించగల ప్రజ్ఞాశాలి కాగూడదా! నీ కీ బలవంతపు చావు తగదు. రాచవారింటి బిడ్డలు బట్టై ఆత్మహత్యలు చేసుకొనిన నింకవంశమర్యాద లెక్కడ నిలువగలవు? భగవంతుడు నీకు మేలు చేయగలడు. ధైర్యము వహించి కాలమునకై వేచియుండుము తల్లీ! అని పలికి నందున సీత మనసుమారి జరగబోయే దానిమీదికి ప్రసరించింది.

## సీతాదేవి ఊరట చెందుట

"నా కడుపులో పెరుగుతున్న బిడ్డగతేం కావాలి ? అంతగా చావు ముంచుకొస్తే తప్పించుకునే యత్నంలేదు. చేతులారా ప్రాణాలు తీసుకొనడం మంచిదికాదు. దైవ నిర్ణయం తప్పదనిదిగదా!" యని ఊరటచెందిన సీత "మరిదీ! నీ వింతకుముందుకు నాకు అడవిదారే చూపావనుకున్నాను. ఇప్పుడు బ్రతుకు దారికూడా చూపావు. నేనింక ఏ అఘాయిత్యానికి ప్రాల్మాలనని మాట యిస్తు న్నాను. అయోధ్యా పతుల వారికి స్త్రీ హత్యా దోషంకాని, శిశు హత్యాదోషం కాని అంటవు. నీవు వచ్చిన పనియైనది. ఇక నీవు తిరిగి పొమ్ము అయ్యా! మీరైనను సుఖముగా నుండుడు. మీ అన్నగారితో యికనైన పేరు ప్రతిష్ఠలతో రాజ్య మేలు కొనుమంటినని నా మాటలు చెప్పుము. ముగ్గుర త్తలకు నా కడసారి నమస్కార ముల నందచేయుము. మువ్వురు చెల్లెంద్రను దీవించితినని చెప్పుము. తిరిగి పొమ్మ"ంటూ పమిట చెంగు మొగంబుపై కప్పుకుని పూ పొదలచాటుగా కను మరుగై పోయింది సీత,

## సీతాదేవి పొందిన పరితాపం

దరి దోవలు తోచక వనమంతటా తిరిగిన సీత నీరసించినందున ఒక జలాశయంలో మంచినీరు త్రాగి పూపొద ప్రక్కగా పరుండి "తన గతి ఏమిటి!" అని పరిపరివిధాల యోచింపసాగింది.

పురుడు బయటపడే సమయం దగ్గరలో వుంది. నాకిక్కడ కాన్పు చేయించే మంత్రసాని యెవరు ? పుట్టిన చోటు నీళ్ళెక్కడ? నీడయెక్కడ? ఒక మహారాజు కుమారుడు ఊరు పేరు లేని ఆటవిక బాలుడై బ్రతక వలసిందేనా!

పోనీ కుమారునిగురించియైన పుట్టింటికిపోయి వారికి నేనేమని చెప్పుదును? ప్రజలు నన్ను నిందించినందున ప్రభువులు వెళ్ళగొట్టారు, పుట్టింటికి వచ్చానని చెప్పినచో నాకు గౌరవముంటుందా! అది యింకా నీచం కదా!

నాకిపుడు చెడురోజులు వచ్చినందున నాన్నగారు ఒకవేళ నన్నాదరింపక "అమ్మాయి! కష్టమైనా నీవు నీ పతిచెంతనే ఉండాలి. లేదా నీ దారి నీవు చూచుకోవాలి. కాని యిలాంటి సమయాల్లో మా యింటికి వస్తే మగడు విడిచిపెట్టిన మగువను యింటిలో పెట్టుకున్నందుకు జనులు నన్ను నిందింపరా ! అనెనేని నేనేమి చేయగల"నని తలపోస్తూండగా ఆమెకు నిద్రపట్టింది.

## వాల్మీకిముని ఓదార్పుట

సూర్యుడు పడమటికొండ మీదికి వాలబోయే వేళ, దర్భలకై పోయిన ముని బాలకులు తిరిగి వచ్చేటప్పుడు స్మారకం లేకుండా పడివున్న సీతనుచూచి వచ్చి గురువు గారితో చెప్పారు. అడవి ప్రదేశం, చీకటి పడబోతోంది. ఒంటరి పాటున ఉన్న స్త్రీ ఎవరో తెలుసుకుందామని వాల్మీకి ముని శిష్యులను వెంటబెట్టుక పోయి చూచాడు. ఎపుడో చూచినట్లుయింది. కాని పోల్చుకుని చెప్పలేక పోయాడు. ఆమెను మేల్కొలిపిన తరువాత "ఎవరమ్మా నీవు? అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేక కంటతడి పెట్టింది. ముని మనసు ద్రవించి "అమ్మాయీ! మిగతా వివరాలు రేపు తెలుసుకోవచ్చు గాని చీకటి పడుతూంది. మా ఆశ్రమానికి పోదాంరా!" అని సీతను వెంటబెట్టుకుని వచ్చాడు వాల్మీకి.

నేను పోతా"నని లేవబోయింది. మునికాంతలామెను పట్టుకొని మళ్ళీ కూర్చుండ బెట్టారు.

## వాల్మీకిముని చేసిన వాగ్దానం

అమ్మా! నీవు బెంగపెట్టుకోకు. బిడియపడకు. ఎటువంటి అరిష్టాలైనా మా ఆశ్రమం దరిదాపులకు గూడ రాలేవు. కొంతకాలానికి నీ కష్టాలు తీరిపోతాయి. రేపు నీ కుమారుడు సాకేతపురానికి రాజుకావాలి. రాజుకాదగిన రాకుమారుని నీ వెక్కడనుండి తీర్చి దిద్దగలవు? నీవు నా చెంతనే వుండు. మునికాంతలు నీకు పురుడు పోస్తారు. నేను నీ కుమారునికి అన్ని విద్యలూ నేర్పి తండ్రినిమించిన కొడుకుగా తయారుచేస్తాను. నీవు నా కుమార్తెవు. వాడు నాకు మనుమడు. నన్ను "తాత"అని పిలిస్తే నాకంతేచాలు" అన్నాడు వాల్మీకి మహాముని. ఆ మాటలకందరూ నవ్వారు. సీత కూడా నవ్వింది.

సీతమ్మకిప్పుడు ఆశ్రమంలో పనిచేసే అవసరంలేదు. చేయనీయరు కూడా. పూలమొక్కలకు నీళ్ళు పోయకుండా, పెంపుడు జింకకు మేత పెట్టకుండా ఆమె ఉండలేక పోయింది.

## యమునా నదీతీర మునుల రాక

రామచంద్రులు సీతాదేవిని అడవులకు పంపిన వార్త అప్పటికప్పుడే అంతఃపురంలో ప్రాకింది. మరి రెండుమూడు నాళ్ళకు నగరమంతా అట్టుడికినట్లు ఉడికిపోయింది. రాముడు చేసిన పనిని కొందరు మెచ్చుకున్నారు - కొందరు నొచ్చుకున్నారు. రామునికి కూడా మనసు స్థిమితం తప్పింది.

ఒకనాడు కొలువుదీరి కూర్చున్నాడు రాముడు. కొందరు మునులువచ్చి రాజదర్శనం కావాలన్నారు. రాముడు సగౌరవంగా వారినాహ్వానించి ఉచిత మర్యాదలు చేశాడు. మీరు వచ్చిన పనేమిటో చెప్పమన్నాడు. మునులంతకు "రామా! లవణాసురుడనే దానవుడు మమ్మల్ని చిత్రహింసలు పెట్టుతున్నాడు. మా యజ్ఞ యాగాది క్రతువులు సాగడంలేదు. జపతపాదులకూ భంగం వస్తూంది. రావణాసురుడు మొదలైన దుష్ట రాక్షసుల్ని చంపిన నీవే యీ లవణాసురునిగూడ చంపి మమ్మల్ని కాపాడాలి" అన్నారు.

రాముడోసారి మునులవంక చూచి "ఇంతకూ ఆ లవణాసురుడెవడు? వాని పుట్టుపూర్వోత్తరా లేమిటి! అన్నాడు.

## లవణాసురుని గురించి మునులు రామునితో చెప్పుట

ఆ వచ్చిన మునులలో పెద్దయిన చ్యవనముని అందుకుని కృతయుగం నాటిమాట. లోలాపుత్రుడు మధువు అనే రాక్షసుడు. మధువు మంచివాడే. అతనికి అతని జాతిలక్షణాలేవీ పట్టుబడలేదు. అతని భార్యపేరు కుంభీనసి. మధువు భార్యాసహితంగా మునుల్ని ఆరాధించేవాడు. బ్రాహ్మణుల్ని పోషించేవాడు, గోవుల్ని పూజించేవాడు.

ఆ మధువు శివుని గురించి ఘోరతపస్సు చేసాడు. శివుడు ప్రత్యక్షమై తనశూలం లాంటిదే మరొక శూలాన్ని సృష్టించి యిచ్చాడు. "ఇది నీ చేతిలో ఉన్నంతకాలమూ నిన్నెవరూ జయింపలేరు. యుద్ధంలో నీకు మరణముండదు" అని వరమిచ్చాడు. మధువు శివునితో "దేవా! ఈ శూలం నా సంతతి వారికి పారంపర్యంగా సంక్రమించే వరం గూడా యిమ్మన్నాడు. శివుడు "మధువూ! అలా

యీయడం కుదరదు కాని, నీవు భక్తుడవై అడిగావు కావున నీ తరువాత నీ కొడుకుకు మాత్రం దక్కుతుంది. మూడోతరం వచ్చేనాటి కుండ"దని చెప్పాడు.

ఆ మధువు కొడుకే లవణాసురుడు. తండ్రి సంపాదించిన శూలంతో వాడు మమ్మల్ని వేచుక తింటున్నాడు. వాడిప్పుడు మధువనంలో వున్నాడు. వాడి చేతిలో ప్రతిదినం పదివేల జీవాలైనా చనిపోతుంటై. వాడికి మునుల రక్తంతో చెలగాటం" అని చెప్పినంతనే రాముడు "మీకేమీ భయం లేదు. నేనా లవణాసురుని చంపి మీ కష్టాలు తీరుస్తా"నన్నాడు. మునులు రాముని దీవించి వెళ్ళారు.

## శత్రుఘ్నుడు లవణాసురునిమీద దాడిచేయుట

మీలో లవణాసురుని చంపేదెవరు అన్నట్లుగా రాముడు తమ్ములవంక చూచాడు. వారిలో శత్రుఘ్నుడు చివాలున లేచి యిలా అన్నాడు.

"అన్నయ్యా! మీరునూ లక్ష్మణుడు మొన్న మొన్నటిదాకా వనవాసం చేసి దానవ వధతో అలసి వున్నారు. మన భరతుడు నందిగామలో మీ రాకకై ఎదురుచూస్తూ ఉపవాసాలుచేసి నీరసించి ఉన్నాడు. ఇప్పుడీ లవణాసురుని నేను చంపుతాను. నన్ను దీవించి పంపండి" అన్నాడు.

రాముడు సంతోషించి "మంచిది తమ్ముడూ? నీవే యీ విజయం సాధించు. శుభసూచనగా నేనిప్పుడే నిన్ను మధువనానికి రాజుగా పట్టాభిషేకం చేస్తున్నాను. మరైతే లవణాసురుని దగ్గర శివుడిచ్చిన శూలముంది. వానిని జయించే దెలాగా ననుకుంటావేమో? దానిని మించిన మరోబాణం నేను నీకిస్తాను.

పూర్వం అంటే సృష్టి ప్రారంభమైన రోజుల్లో మధుకైటభులనే రాక్షసులిద్దరుండే వారు. వాళ్ళు పరమదుర్మార్గులు. ఎవరూ ఆ దానవులను జయింపలేకపోయారు. అప్పుడా మధుకైటభుల్ని చంపడానికో గొప్ప అస్త్రాన్ని ఆదిమూర్తి సృష్టించాడు. ఆ బాణం మన ఇంట్లోనే వుంది. నేను వనవాసం వెళ్ళేటప్పుడు పట్టుకపోలేదు కనుక లంకా విజయంలోను దాన్ని ఉపయోగించలేదు. ఇంకొక విశేషమేమిటంటే ఆ బాణం యితరుల కంటికి కనపడ"దంటూ చెప్పి శత్రుఘ్నుని ప్రయాణం చేశాడు. శత్రుఘ్నుడు పెద్దలందరి దీవెనలూ పొంది, వశిష్ఠముని చెప్పిన మంచి రోజున కొంత సైన్యాన్ని వెంటపెట్టుకుని లవణాసురుని మీదకు దాడికి వెళ్ళాడు.

## శత్రుఘ్నుడు సేనలతో గంగానదిని దాటుట

సేనల వెంటబెట్టుకుని మధువనానికి ప్రయాణం గట్టిన శత్రుఘ్నుడు గంగానది తీరాన్ని చేరుకున్నాడు. శత్రుఘ్నుడు మంది మార్బలంతో రావడం చూచిన గుహుడు ఎదిరించారు. శత్రుఘ్నునికి ఆశ్చర్యం కలిగింది. "ఏమిటి రామ భక్తుడైన గుహుడా నన్నెదిరించేది !" అనుకున్నాడు. వెంటనే గుహుని పిలిచి "ఓయీ! నిన్నయితే నేనొక్క వ్రేటుతో చంపి ముందుకుపోగలను. కాని మిత్రులతో వైరం పెట్టుకొనడం మా మతం కాదు. అసలు నీవు నన్నెదిరించిన కారణము చెప్పు" అన్నాడు.

గుహుడు శత్రుఘ్నునికి నమస్కరించి "అయ్యా! సీతమ్మ దొరసాని మాదొడ్డ యిల్లాలు. ఆమెను అనుమానించి మీ అన్న అడవులకి పంపాడు. ఇప్పుడా తల్లి అడవులలోనైనా బ్రతకనీయకుండా చంపడానికే నీవు వస్తున్నావని

మా గూడెంలోవారంతా అనుకుంటున్నారు. రామన్నమీద మాకెంత భక్తి శ్రద్ధలున్నా జానికమ్మకు అపకారము జరిగితే మేము సహింప" మన్నాడు.

శత్రుఘ్నుడు నవ్వి "పిచ్చివాడా! మధువనంలో ఉన్న లవణాసురుని చంపడానికి పోతున్నాను కాని మా వదినగారికి కీడు చేయడానికి కాదోయ్ అన్నాడు అదివిన్న గుహుడు సంతోషించి వారినందరినీ నావలలో గంగానదిని దాటించారు. శత్రుఘ్నుడా రేయి వాల్మీకి మున్యాశ్రమ ప్రాంతంలోనే దండువిడిచి శిబిరాలు వేయించాడు.

## శత్రుఘ్నుడు మధుపురానికి రాజగుట

ఆ రాత్రికే సీతకు కాన్పు జరిగింది. ఇద్దరు కుమారులు కలిగారు. తల్లి పిల్లలు క్షేమముగా ఉన్నట్లు విని వాల్మీకి ఆనందముతో పొంగిపోయాడు. ముని బాలకులవలన శత్రుఘ్ననకు గూడా సీత ప్రసవించిన వార్త తెలిసింది. తరువాత రాజసైన్యాలు మధువనానికి చేరుకున్నాయి. అన్నయ్య ఇచ్చిన బాణముతో శత్రుఘ్నుడు లవణాసురుని చంపాడు. మునులు దేవతలు సంతోషించారు. దేవేంద్రుడు "శత్రఘ్నా! దుర్మార్గుడైన దానవుడ్ని చంపి లోకోపకారము చేశావు. నీకేం వరము కావాలో కోరుకో ఇస్తాను" అన్నాడు.

శత్రఘ్నుడు "ఈ మధువనము నగరములా మారాలి" అన్నాడు. దేవేంద్రుడు మధువనమున్నచోటనే ఒక మంచి నగరము నిర్మింపచేసి, దానికి మధుపురము అని పేరు పెట్టాడు. మధుపురానికి శత్రుఘ్ననే రాజును చేశాడు. శత్రుఘ్నుని పాలనలో ప్రజలు సుఖముగా వున్నారు.

## సీతాదేవి కుమారులకు నామకరణం చేయటం

సీత కన్న కుమారులిద్దరికీ కుశుడని, లవుడని నామకరణం చేశాడు వాల్మీకిముని. వారి జనన కాలాన్ని బట్టి జాతకాలు వ్రాసి "వీరిద్దరూ గొప్పవారవుతారని" చెప్పాడు. దర్భచివరలతో అంత్రాలు కట్టి వీరికే అరిష్టాలూ సోకవని చెప్పాడు. కుశలవులు క్రమ క్రమంగా పెరుగుతున్నారు. వాల్మీకిముని వారికి చదువులు చెప్పాడు. విలువిద్యలు నేర్పాడు. తను రచించిన రామాయణం మొత్తం నోటికి వచ్చేలాగా పల్లె వేయించాడు. సీత కుశలవులను చూచుకుని తన కష్టాలన్నీ మరచిపోయింది. అయినా, ఒక్కొక్కప్పుడు మాత్రం "నా బిడ్డలకు తండ్రియైన రామచంద్రులు వీరినెత్తి ముద్దాడే భాగ్యం లేకపోయెనే" అని లోలోన కుమిలి పోతుంది.

అలాగా కొంతకాలం గడిచింది.

## రామపాలనలో అధర్మం తలెత్తుట

అయోధ్యలో రాముడు సభదీరి కూర్చున్నాడు బ్రాహ్మణులు కొందరు వచ్చారు. వారిలో ఒక బ్రాహ్మణుడు తన భుజంమీద వున్న బాలశవాన్ని సభలో పరుండబెట్టి "రామచంద్రా ! తండ్రి ఉండగా కొడుకు చనిపోవడం ధర్మం కాదు. నీవేమో ధర్మప్రభువు అనుకున్నాం. నీ పాలనలో నా ముందరనే నా యీ ఐదేండ్ల కొడుకు చనిపోయాడు. నీ ఆధర్మం హెచ్చుమీరింది. ధర్మం ఎక్కడ భంగమయిందో విచారించి దానిని రూపుమాపితే యిప్పటికైనా ఈ బాలుడు బ్రతుకుతాడు. నీవలాగా చేస్తావా లేదా !" అన్నాడు.

రాముడు అందులకు తలాడించి "అయ్యలారా! మా రాజ్యంలో బ్రాహ్మణులకీ గోవులకీ ఏ బాధా కలుగరాదు. నేను తప్పక మీరు చెప్పినట్లు చేస్తాను. అంతవరకూ మీరీ బాల కళేబరాన్ని తైలభాండంలో వుంచి కాపాడండి" అన్నాడు.

బ్రాహ్మణులు వారి ప్రయత్నం ఫలించినందుకు సంతోషించి తిరిగి పోయారు.

## రాముడు శంబుకుని చూడబోవుట

ఆ మరునాడే పిలిచినట్టుగా నారదముని రాముని చూడవచ్చాడు. రాముడు నారదుని ఉచితరీతిగా గౌరవించాక "మహామునీ! తండ్రికన్న ముందుగా కొడుకు చనిపోవడం ధర్మభంగమట! మాకిక్కడ ఒక సంఘటన అలాంటిదే జరిగింది. నాకు తెలిసినంతవరకు నేనే పొరపాటులూ చేయుడం లేదు. మరి మా రాజ్యంలో అధర్మం ఎక్కడ జరుగుతుందో, ఎలాగా జరుగుతుందో నాకు బోధపడకుండ ఉంది. మీరు ముల్లోకాలూ తిరుగుతుంటారు. మీకన్ని విషయాలు తెలిసే వుంటవి. అధర్మం ఎక్కడుందో చెప్పండి" అని అడిగాడు.

నారదుడంతట "రాజా! దక్షిణదిశలో శంబుకుడు అనే శూద్రుడు తపస్సు చేస్తున్నాడు. అది యుగధర్మానికి వ్యతిరేకం. బ్రాహ్మణులు క్షత్రియులు మాత్రమే తపస్సు చేయతగినవారు. నీవా శూద్రుని తల తీయిస్తే ధర్మం మళ్ళీ ఉద్ధరింపబడుతుంది" అన్నాడు. రాముడు వెంటనే పుష్పకవిమానాన్ని రప్పించి, దానిలో కూర్చుని "పుష్పకమా! అధర్మం జరుగుతున్న చోటుకు నన్ను తీసుకు పో" అనగానే విమానం చివాలన లేచి గగనతలాన పయనించి శంబుకుడున్న చోటుకు చేర్చింది.

## రాముడు శంబుకుడుని చంపుట

విమానంలోనుండి దిగిన రాముని చూస్తూనే శంబుకుడు ఎదురేగి. "దయచేయండి ప్రభూ! మీరూ దైవాంశ గలవారు. మాలాంటివారి ఆశ్రమానికి రావడం ఎంతో అదృష్టం" అన్నాడు. రాముడామాటలను వినిపించుకొనకుండానే "నీ వెవరువు ? నీ పేరేమిటి?" అని సూటిగా ప్రశ్నించాడు. "నా పేరు శంబుకుడు నేను పుట్టుకతో శూద్రుడ్ని" అని బదులు చెప్పాడు.

"శూద్రులు తపస్సు చేయకూడదని నీకు తెలియదా !" అన్నాడు రాముడు. శంబుకుడు వినయంగా "ప్రభూ! భగవంతుడు మానవుల్ని సృజించాడే కాని కులాలను కల్పించలేదు. అందరం దేవుని బిడ్డలమైనపుడు అందరం ఆ దేవుని దయ సంపాదించుకొనడానికి తపస్సు ఎందుకు చేయగూడదో తమరు న్యాయం ఆలోచించండి" అన్నాడు. రాముడు తిరిగి మాటాడకుండానే ఒరలోని ఖడ్గాన్ని లాగి శంబుకుని తల నరికివేశాడు. శంబుకుని శిష్యులంతా గొల్లుమన్నారు. రాముడు తిరిగివచ్చి కొలువుదీరాడు.

అదంతా గమనించి చూస్తూన్న బ్రాహ్మణులు మళ్ళీ రాముడు చెంతకు వచ్చారు. ఈసారి వారివెంట ఐదేండ్ల బాలుడొకడున్నాడు. "శ్రీరామచంద్ర మూర్తి! నీవు ధర్మమూర్తివి. అధర్మాన్ని రూపుమాపావు. చనిపోయిన మా బాలకుడు బ్రతికాడు. ఇదుగో చూడమంటూ" వారివెంటనున్న కుర్రవానిని చూపారు. రాముడా బ్రాహ్మణులను ఘనముగా సన్మానించి పంపాడు.

## రాముడు రాజసూయం చేయబూనుట

ఒకనాడు వశిష్ఠుడు మొదలైన మునులంతా వచ్చి "రామా! నీవు రాజసూయం చేస్తానని యిదివరలో ప్రకటించావు. అప్పటికేవో కారణాల వల్ల

వా...డా వేసుకున్నావు. ఇపుడు యజ్ఞం చేయదగిన మంచిరోజులు వచ్చినై. దాని వ... ఇహము పరముగూడా లభిస్తాయి. కనుక యజ్ఞం ప్రారంభించు" అన్నాడు.

రాముడు "ఔను యిపుడు నాకే ఆటంకమూ లేదు. రాజసూయం చేస్తా" న...డు. భరతుడు లేచి "అన్నయ్యా! యజ్ఞం చేయడమంటే మాటలుకాదు. ఎది ...న రాజులతో యుద్ధం చేయాలి. యుద్ధంవలన జననష్టం జరుగుతుంది. యజ్ఞ మం...తా రక్తపాతముతో కూడింది. కనుక రాజసూయము మన కవసరంలే" దన్నాడు. రా...డు "అలాకాదు. రాజసూయం చేయడం నా అభిమతం చేసి తీరాలి" అన్నాడు. ల...ణుడు లేచి "అన్నగారి మాట కాదనటంకాదు గాని యజ్ఞంచేసే యజమానికి భా...్య చెంతనుండాలి. భార్యలేనివాడు యజ్ఞం చేయరాదు. ప్రస్తుతం సీతామహాదేవి గా... అంతఃపురంలో లేరు. ఆమె కొరకు వెదికించుదామనుకుంటే అసలు ప్రాణా ల...  వున్నదో లేదో కూడా తెలియదు. మరి రాజసూయం చేయడమెలాగా?" అ...న్నాడు. రాముడు దానికి ఉపాయం మునులే చెప్తారు అన్నాడు.

## బంగారపు సీతబొమ్మ

ఒకముని లేచి భార్యలేకుండా యజ్ఞం చేయకూడని మాటా నిజమే. ఐతే దా...కో ఉపాయముంది. బంగారంతో భార్యలాంటి బొమ్మను చేయించి ఆ బొమ్మను ప్ర...నుంచి యజ్ఞం చేయ వచ్చునని ధర్మశాస్త్రాలు చెప్పుతున్నాయి అన్నాడు. మ...కముని లేచి "బంగారం జీవం కలది కనుక బంగారు బొమ్మయితే ఏ దోషమూ ఉం..."దన్నాడు. "ఐతే బంగారముతో సీత బొమ్మను చేయించుదాం" అన్నాడు

రాముడు. బొమ్మంటే బొమ్మకాదు. ముమ్మూర్తులా సీతాదేవిగారి లాగానే వుండాలి. మంచి పనితనం గల శిల్పాచార్యులకాపనికి నియమించాలి అన్నాడు భరతుడు. "అంత గొప్ప పనివారెవరో విచారించవలసి యుంటుంది" అన్నాడు లక్ష్మణుడు "ఇదంతా యెందుకు? బంగారు పనిలో ఆరితేరిన వారు రావలసిందిగా ప్రకటించుదాం" అన్నాడు రాముడు.

## రాముడు సూర్యుని ఆరాధించుట

అప్పుడు వశిష్టముని యిలా అన్నాడు. "రామా! ఈ చిన్న విషయం కోసం నీవింతగా ఆలోచించాలనా! పనిలేదు. దానికో దగ్గరమార్గం వుంది. అది నీకు చెప్తాను విను. మీరు సూర్యవంశపు రాజులు. సూర్యుడంటే కనక శిల్పం సృష్టించిన శిల్పాచార్యుడు. విరాట్ విశ్వకర్మకు ఐదుగురు కుమాళ్ళు. వాళ్ళనే మనుమయిత్వష్ట శిల్ప విశ్వజ్ఞులంటారు. మనుబ్రహ్మ శివుడు. మయబ్రహ్మ విష్ణు. త్వష్ట బ్రహ్మబ్రహ్మ. శిల్ప బ్రహ్మ దేవేంద్రుడు. విశ్వజ్ఞ బ్రహ్మ సూర్యుడు. వారే తిరిగి సొనగ సనాతన అహ భువన ప్రత్నస సుపర్నస ఋషులయ్యారు. కనుక సూర్యుడు ఋషి సాంప్రదాయానికి చెందినవారు. వారితో మనువుయినుప పనిని కల్పించారు. మయు కొయ్య పనిని కల్పించాడు. త్వష్ట రాగి పనిని కల్పించారు. శిల్ప రాతి పనిని కల్పించాడు. అలాగే విశ్వజ్ఞ కల్పించింది బంగారు. కాబట్టి కనక శిల్పంలో సూర్యునికన్నా లోతుపాతులు తెలిసిన వాడింకొకడు లేడు.

"నీవు సూర్యుని ఆరాధించు. ఆయన దర్శనమిస్తాడు. విషయమంతా చెప్పు. తప్పకుండా ఆనందిస్తాడు. బంగారంతో సీతలాంటి బొమ్మ కావాలని

అడుగు. ఆయనే తగిన నేర్పరులైన పనివారిని నియమించి ప్రతిమను చేయిస్తాడు ఆ శిల్పి బ్రాహ్మణులు చేసే బంగారపు సీతలో జీవకళ తాండవిస్తుంది" అని చెప్పారు. సభలోని వారంతా వశిష్ఠులవారి సలహా బాగున్నదని మెచ్చుకున్నారు.

## బంగారపు సీతను తయారుచేయుంట

ముమ్మూర్తులా సీతను పోలిన బొమ్మను బంగారంతో తీర్చిదిద్దారు విశ్వకర్మ బ్రాహ్మణులు. ఆ పనితనాన్ని చూచి రాముడు అబ్బురపడ్డారు. అబ్బుర పడడమే కాదు శిల్పాచార్యుల నెంతగానో కొనియాడాడు. కొనియాడడమే కాదు వారిని ఘన సత్కారాలతో సంతోషపెట్టి దీవెనలు పొందాడు.

ఆ బొమ్మను తటాలున చూచిన వారంతా సీతే అనుకుంటున్నారు. "పెద్ద కోడలు యింట్లో ఉండే అదృష్టం మనకు లేనేలేదు. ఈనాటికి ఆమె రూప మైనా చూచే అవకాశం కలిగిం"దంటూ కౌసల్య సుమిత్ర కైకేయలు వచ్చి చూచారు. అలాగే జానికమ్మ చెల్లెండ్రు కూడా వచ్చి చూచారు. రాముని సంగతి యికచెప్పే వీలులేదు. అప్పుడప్పుడూ ఏకాంత సమయాల్లో ఆ బొమ్మ దగ్గరనే కూర్చుని ఏవేవో మాడడం బదులు మాట లేనందున మళ్ళీ స్పృహలోకొచ్చి "ఓహో! ఇది బొమ్మకదా!" అని అనుకొని లేచిపోవడమూ జరుగుతూంది.

## కుశలవులు వాల్మీకివెంట అయోధ్యకు పోవుట

ఇక యజ్ఞానికి సంబంధించిన పనులు ప్రారంభించ వచ్చుననుకున్న రాముడు మధుపురం నుండి శత్రుఘ్నుడు మొదలైనవారి నివారించాడు. కిష్కింధ నుండి సుగ్రీవుడు మొదలైన వారిని రావించాడు. లంకాపురి నుండి విభీష

ణుడు మొదలయినవారిని ఆహ్వానించాడు. పెద్ద తలలుగా కనపడే మునుల్ని కూడా రమ్మన్నాడు. ఆ పిలుపు ఆశ్రమంలో ఉన్న వాల్మీకికి కూడా అందింది.

వాల్మీకి అయోధ్యకు బయలుదేరుతూ కుశలవుల్ని పిలిచి "మనుమలూ! మీరు నావెంట అయోధ్యకు రండి. అయితే మీరు నా మనుమలని ఎవరికీ తెలియ కూడదు. మీ బస వేరుగా ఉండాలి. ఒకప్పుడు నేను మీకు రాజసభలోగాని ఇంకెక్కడయినా గాని కనబడినా సరే నేనెవరినో తెలియునట్లుగానే మీరు నటించాలి. మీరు అయోధ్యలో అక్కడక్కడా నేను చెప్పిన రామాయణం గానం చేయండి. రోజు ఒక్కింటికి ఇరవై సర్గలు తప్ప మించి పాడరాదు. ఎవరైనా మీకు ధనమిస్తే పుచ్చుకొనకండి. ఆఖరికి ఆ రాముడు మిమ్ము సన్మానించబోయినా మీ రంగీకరించొద్దు" అని ఆదేశించాడు.

కుశలవులిద్దరూ సీతకు నమస్కరించారు. ఆమె కుమారులను దీవించి "నాయనలారా! మీరిద్దరూ తాతగారి మాట జవదాటకండి. పోయి రండి. మీకు మేలు కలుగుతూంది" అంది. మునికుమారుల వేషములో ఉన్న రాజకుమారులు వాల్మీకి వెంట పయనించి అయోధ్యకు చేరుకున్నారు.

## కుశలవులు రామాయణం గానం చేయుట

కుశలవులు అయోధ్యాపురములో రాజవీధుల వెంట తిరుగుతూ నగర సౌందర్యాలను చూచి ఆనందిస్తూ తాతగారు నేర్పిన రామాయణము గానము చేస్తున్నారు. వారెక్కడ గొంతువిప్పితే అక్కడి కక్కడనే జనము గుంపులు గుంపులు కూడుతున్నారు. వారి పనుల్ని కూడా మరచిపోతున్నారు. అసలే చిన్నపిల్లలు,

వారి ముఖాలు ముద్దుమూటలు గట్టుతున్నాయి. మృదువైన గానము అందులోను రామకథ. బాలకులు చదివే రామాయణము వినడానికి ప్రజలు చెవులు కోసుకుంటు న్నారు. ఆ సంగతి తెలిసిన రాముడు కూడా భటుల నియమించి కుశలవుల్ని తన కొలువుకు పిలిపించుకున్నాడు.

మంత్రులు, సామంతులు, రాజబంధువులు,మునులంతాసభతీరిన సమయము కుశలవులు రామాయణము గానము చేశారు. అక్కడున్న వారంతా పరమానందము చెందారు. రాముని మనసులో ఆలోచనలు తరంగాలుగా పొరలి రాసాగినై. వాని నన్నింటినీ ఒకప్రక్క అణచిపెట్టుకుని "బాబూ! మీరెవరి పిల్లలు?" అని అడిగాడు. కుశలవులకన్న ముందుగా కల్పించుకుని "నా శిష్యులు మహారాజా! నేను మీ చరిత్రను ఇంతకుముందే రచించాను. దానిని వీరికి నేర్పాను. తమరిలా అడిగిన కారణమేమిటో చెప్తారా!" అన్నాడు. రాముడు మార్చుకొని "ఏమీ లేదు. నేనీ బాలకులను పిలిపించాను. పాడించాను. ఆనందించాను. ఇక బహూకరించాలి కనుక అలా అడిగాను" అంటూ సరిపెట్టుకున్నాడు. కుశలవులు వెంటనే "మేము రామాయణము గానము చేయుటయు తప్ప, విన్నవారి దగ్గరనుండి కానుకలు పొంద డానికి మాకు మా గురువుగారి అనుమతి లేదు" అన్నారు.

## శత్రుఘ్నుడు రామునితో రహస్యంగా మాట్లాడుట

శత్రుఘ్నుడు అదంతా గమనిస్తూనే వున్నాడు. కాని యిది మాట్లాడే సమయం కాదనుకుని మౌనము వహించాడు. సభ ముగిసింది. ఎటువారటు లేచి వారి వారి వసతిగృహాలకు చేరుకున్నారు. ఆ రాత్రి శత్రుఘ్నుడు రామనివాస భవనానికి పోయి "అన్నయ్యా! నేను లవణాసురుణ్ని చంపడానికి మధువనము

వెళ్ళేటప్పుడు గంగానదీ దాటిన రాత్రి వాల్మీకి మున్యాశ్రమానికి దగ్గరగానే విడిది చేశాం.ఆ రాత్రే మా వదినగారు ప్రసవించారనిన్నీ, కవలపిల్లలు కలిగారనిన్నీ,తల్లి పిల్లలు కులాసాగానే వున్నారనిన్నీ వార్త విని సంతోషించాను. కాని కొన్ని సందేహాలతో మీకా శుభవార్త వెంటనే చెప్పలేకపోయాను. అనుమానం లేదు. కుశలవులు నీ కుమారులే" అన్నాడు. ఆనందముతో రాముడు పొంగిపోయాడు. "తమ్ముడూ! సీత సజీవముగానే వున్నట్లు తెలిపోయింది. ఆమె తను నిందార్హురాలు కాదని రుజువు చేసుకుంటుందేమో వాల్మీకినడిగి తెలుసుకో" అన్నాడు.

మరునాటి ఉదయాన్నే శత్రుఘ్నుడు వాల్మీకిని కలుసుకుని రామసందేశాన్ని వినిపించాడు. వాల్మీకి తనకేమీ సంబంధము లేదన్నట్లుగా "ఏమో నాకేమి తెలుసు? కావాలంటే నావెంట మునిపల్లెకు వచ్చి నీవే సీతనడిగి తెలుసుకో" అన్నాడు.

## రాముడు యాగాశ్వమును విడచుట

అందరూ సమావేశమయ్యారు. యజ్ఞ విధానమంతా నిర్ణయించుకున్నారు. ఎవరెవరు ఏయే పనులను చేయాలనో తెలుసుకున్నారు. యాగాశ్వాన్ని దేశసంచారానికి పంపడము ఇప్పుడు జరగాలి. పంచకళ్యాణి గుర్రాన్ని తీసుకొచ్చారు. చక్కగా అలంకరించారు. దాని ముఖాన ఒక బంగారు పతకం కట్టారు. ఆ పతకములో యిలా వ్రాయబడి వుంది.

గీ॥ రాజసూయంబు సేయంగ రామవిభుడు
విడిచిన తురంగ మియ్యది ! వీరులైన
వారు మాతోడ పోరాడి పట్టుకొనుడు !
ఏ పురంబులేలెడు రాజు లెవ్వరైన.

జయజయనాదాలు మ్రోగినై. విజయవంతంగా తిరిగి రమ్మంటూ యాగాశ్వాన్ని విడిచారు. శత్రుఘ్నుడు అశ్వపాలకుడిగా దానివెంట బయలుదేరాడు. రాముడు విడిచిన గుర్రం దేశములో చాలాభాగము తిరిగింది. కాని ఎవ్వరూ పట్టుకొనడానికి సాహసింపలేదు. రావణుడంటే సామాన్యుడు కాడు. ఆయన ఇంతకుముందే దండకారణ్యము దాటిపోయి, సముద్రాన్ని కూడా దాటి రావణుడంతవానినీ వాని సైన్యాన్ని నేలమట్టము చేశాడు. ఇక యాగాశ్వ పాలకుడుగా వచ్చినవాడు శత్రుఘ్నుడు. అతడు మొన్న మొన్న లవణాసురుడు అంతవానిని నాశనము చేసి రాజ్యం నెలకొల్పుకున్నాడు. బలవంతులతో పగ మనకెందుకు'' లెమ్మని రాజులంతా ఊరుకున్నారు.

## కుశలవులు యాగాశ్వమును బంధించుట

దేశదేశాలూ తిరిగింది గుర్రం. భూ ప్రదక్షిణ ముగియబోతూంది. ఒకనాడు గంగానదీ తీరాన్ని చేరుకుంది. అక్కడే ఆడుకుంటున్నారు కుశలవులు. గుర్రాన్ని చూచారు. కట్టివేయాలనుకున్నారు. లవకుమారుడు గుర్రము మెడకొక కాషాయపు వస్త్రము గట్టి దాని రెండో చివరతో చెట్టుకు కట్టాడు. కుశుడకా సంగతి తెలిసికూడా తెలియనట్లే నటించాడు.

మరి కొంతసేపటికి శత్రుఘ్నుని సేనలోని భటులు వచ్చి "ఈ గుర్రాన్ని యిక్కడ కట్టింది యెవరు ?" అన్నారు. కుశలవులు "మేమే" అన్నారు ధీమాగా. "ఇది రామచంద్రుని యాగాశ్వం" అన్నారు రాజకింకరులు. "తెలుసు" అన్నారు బాలురు ముక్తసరిగా. "అబ్బాయిలూ ! మీరు మునిబాలకులు, ఈ గుర్రాన్ని పట్టుకొనడమంటే పంచాంగము కట్టకాదు. దీనికి పాలకునిగా శత్రుఘ్నుడు వచ్చి

యున్నాడు. ఆయనతో యుద్ధంచేయాలి. పేరుకెక్కిన పెద్ద పెద్ద ధీరులే మా ప్రభువుల ముందు నిలబడలేక సిక్కుత్రాగారు. మీరెంత ? మీ బలమెంత ? మామాట విని గుర్రాన్ని విడిచిపెట్టండి. మీరు ముని కుమారులు కనుక మిమ్మేమీ అనకుండా మిమ్ము సన్మానించేలాగా చేస్తాము" అన్నారు.

కుశలవులికి కోపము వచ్చింది. "మీ రాజులు అంత గొప్పవారైతే మమ్ముల్ని యుద్ధములో గెలిచాకనే గుర్రాన్ని విడిపించుక పొమ్మని చెప్పండి. మమ్ముల్ని మా బలాన్ని ఎంచే తాహతు మీకులేదు. మళ్ళీ మాటాడకుండా వచ్చిన దానినే తిరిగిపోతే మర్యాదగా వుంటుంది" అని గద్దించారు. రాజసైనికులు తిరిగి పోయి జరిగినదంతా శత్రుఘ్నునితో చెప్పుకున్నారు.

## శత్రుఘ్నుడు సేనా సంప్రతు

గంగానదీతీరం-మునిపల్లె- పది పదునాలుగుగేండ్లు బాలకులనినంతనే వారు తప్పకుండా కుశలవులేనని శత్రుఘ్నుని గుండె జల్లుమంది. కుశలవులు రాకుమారులు కాకపోతే యాగాశ్వాన్ని పట్టుకోరు.

పట్టుకున్నా విడిచిపెట్టమని మొండిపట్టు పట్టరు. పట్టినా ఇంత పౌరుషముగా మాట్లాడరు. ఇంతదాకా వచ్చినాక వాళ్ళు గుర్రాన్ని విడువరు. నాకు యుద్ధము తప్పదు. ఓయి భగవంతుడా! ఏమిటయ్యా ఈ చిత్రము. మూడేండ్ల సాముచేసి మూలనున్న ముసలమ్మను చంపాడు అన్నట్లుగా దేశ దేశాలు జయించిన ధీరాధి ధీరులము గదా మేము. చివరకు మేము మా కొడుకులు మీదనే కత్తి దూయవలసి వచ్చిందా." అని మదనపడ్డాడు.

కుశలవులతో "మీరు మా అన్నకుమారులు. నేను మీ పినతండ్రిని. మనకు మనకూ వైరాలు పనికిరావు గుర్రాన్ని విడిచిపెట్టండి" అని నిజము చెప్ప డానికింకా సమయము రాలేదు. వాల్మీకితో సంప్రదించుదామన్నా లాభము లేదను కున్నాడు. పోనీ సీతతోనే చెప్పాలనుకున్నా మనసంగీకరించలేదు.

సైన్యాన్ని పిలిచి "మీరా బాలకుని మీద యుద్ధముచేసి వారికి ప్రాణా పాయము కలుగనీయకుండా ప్రాణాలతో పట్టుకరండి" అని చెప్పి పంపించాడు. శత్రుఘ్నుని సేనలన్నీ లవకుమారుల చేతులలో ఓడిపోయినై.

## శత్రుఘ్నుడు లవుని మూర్ఛ నొందించుట

శత్రుఘ్నుడు తన సేనలతో యుద్ధానికి తారసిల్లాడు. రాజసేనలు కను చూపు మేర కనపడుతున్నాయి. ముని వాడంతా తల్లడిల్లిపోయింది. ఆ సమయాన కుశుడు ఎక్కడికోపోయాడు. లవుడొక్కడే. ఐనా చలింపలేదు. శత్రుఘ్నుడు ముందుకొచ్చి "అబ్బాయీ! ఇది రామచంద్రులవారు యాగార్థము విడిచిన గుర్రము. రామకార్యానికెవరూ అంతరాయము కలిగించరాదు. శ్రీరాముడంటే ఎంత గొప్ప వాడో మీకు తెలిసేవుంటుంది. గుర్రాన్ని విడిచిపెట్టు" అన్నాడు.

లవునికి ఆ మాటలేవీ చెవికెక్కలేదు. హేళనగా నవ్వాడు. "ఓయీ! ఈ చేతకాని మాటలెందుకు? మీ రాముని గొప్పతనము, మీ గొప్పతనము మాకు తెలియనివి కావులే. మంచికాని చెడుకాని మీ రామయ్యకు లక్ష్మయ్యకూ రామా యణంలో కొంత కథవుంది. ఇక భరతయ్యకు కూడా ఒక రకమైన కథుంది.

మరి నీ వెక్కడా కనపడిందిలేదు. నీపేరెక్కడా వినపడదు. నీ వంత మొనగాడ వైతే చూచే దెందుకు! నాతో యుద్ధంచేసి గుర్రాన్ని విడిపించుకో" అన్నాడు.

యుద్ధము మొదలయింది. సేనలో చాలమంది వీరులు చనిపోయారు అది చూచిన శత్రుఘ్నునికి ఒకవంక సంతోషం ఒకవంక సంతాపం రెండూ ముంచుకొచ్చినై. ఇకతమాయించరాదనుకున్నాడు. ఐనాలవుని చంపడానికియిష్టము లేనందున సమ్మోహనాస్త్రముతో మూర్ఛబడచేశాడు. మూర్ఛలో వున్న లవుణ్ని రథంమీద ఎక్కించుకుని పోయి తన శిబిరంలో వుంచుకున్నాడు.

## కుశుడు శత్రుఘ్ని మూర్ఛనొందించుట

లవకుమారుని శత్రుఘ్నుడు రథంమీద ఎక్కించుకుని పోవడం చూచి మునిబాలకులంతా హడలిపోయారు. పరుగు పరుగున వచ్చి సీతతో చెప్పారు. ఆ మాటలు విన్న సీత నిలువునా కొయ్యబారి పోయింది. "నాయనా! లవకుమారా! వారు యుద్ధాలలో ఆరితేన వారుకదా! మీరు మున్యాశ్రమంలో పుట్టారు. మునికులంలో పెరిగారు. ఇప్పుడా రాచకార్యాలతో పనేమొచ్చింది? మీ అన్న కుశుడు వచ్చి "అమ్మా! తమ్ముడేడి?" అని అడిగితే నేనేం చెప్పేది" అని తలపోస్తుండగా కుశుడు రానేవచ్చాడు.

అమ్మా! తమ్మునికే ప్రమాదమూ రాదు. నేనిపుడే ఆ శత్రుఘ్నుని చంపి లవకుమారుని తీసుకవస్తాను. తాతయ్య యిచ్చిన విల్లు అంబులపొది యిచ్చి నన్ను దీవించి పంపించు" అన్నాడు. కొంచెంసేపు నిదానించింది సీత. "కుశా! తమ్ముని విడిపించుకుని రావలసిందేగాని శత్రుఘ్నుని చంపడానికి మాత్రం నేనొప్పు

కోను. తాపసులకు తామసం తగదు" అంది. కుశుడు మళ్ళీ "అమ్మా! శత్రుఘ్నుని చంపకపోతేపోనీ, మూర్ఛపడ చేయడానికైనా సెలవీయి" అన్నాడు. సీత "అలాగే" నని ఆశీర్వదించి పంపించింది.

కుశుడికి శత్రుఘ్నునికి భయంకరమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధములో శత్రుఘ్నుడు మూర్ఛగతుయ్యాడు. కుశలవులిద్దరూ శత్రుఘ్నుని బంధించుకుని సుఖముగా ఇల్లు చేరుకున్నారు. రామునికావార్త తెలిసింది.

## భరతుడు కుశలవుల మీద యుద్ధానికి వచ్చుట

శత్రుఘ్నుని మునికుమారుడు మూర్ఛనొందించినట్లు వినినంతనే రాముడు సభవంక చూచి మన శత్రుఘ్నుడు ఎన్నో దేశాలు తిరిగి విజయవంతంగా గంగానదీ తీరానికి చేరుకున్నాడట. "గుర్రాన్ని విడిచిపెట్టండి" అని మనవారు ఎన్ని మంచిమాటలు చెప్పినా ఆ గడుగ్గాయి పిల్లలు వినుకోనందున యుద్ధందాకా వచ్చిందనిన్ని, ఆ యుద్ధంలో మొదట మనవారికే జయం కలిగినా చివరికి వారే గెలిచారనిన్ని, మన సోదరుని మూర్ఛనొందిచారనికూడా వింటున్నాం.

మనల్ని గెలిచిన వారు రాజకుమారులన్నాకారు. జయాపజయాలు దైవాధీనాలు కనుక మనమంతగా అనుకునే పని వుండదు, మునిబాలుర చేతులలో మనకు ఓటమి అంటే చిత్రంగానే వుంది. ఒక విధంగా మన వంశానికి అవమానం కూడా" అన్నాడు.

భరతుడు లేచి "మునులంటే తపోబలం గలవారు. ఒకప్పుడు వారు జయించి మనమోడి పోవడంలో విచారపడవలసింది అంటూ ఏమీలేదు. అదలాగ

ఉండనీయండి. మన సోదరుడు యింతకాలమూ విజయయాత్ర చేసి ఉన్నందున బడలిక చెంది మూర్ఛపడెనేమో ! అంతమాత్రాన ఏమైనది ? నేనిపుడే పోయి ఆ ముని కుమారుల్ని యుద్ధంలోనే జయించి మన శత్రుఘ్నుని, యాగాశ్వాన్ని కూడా వెంటబెట్టుక వస్తాను. నన్ను పంపించండి" అన్నాడు. రాముడు భరతునికి కొంత సైన్యాన్నిచ్చి పంపించాడు.

## భరతుడు కుశలవులకు చెప్పిన మంచిమాటలు

భరతుడు సేనలతో రావడం చూచారు మునిబాలకులు. కుశలవులు వెంటనే విల్లుబాణాలు చేతపుచ్చుకొని వారి యెదుటకుపోయి నిలుచున్నారు. వారి ముఖాలు చూడగానే వీరు మొన్న రామాయణం గానం చేసిన వాల్మీకి శిష్యులని పోల్చుకున్నాడు. భరతుడు రథం దిగివచ్చి కుశలవులతో "బాబూ ! మీరు రామాయణం గానం చేసినారు కారా !" అన్నాడు. కుశలవులు "ఔను మేమే. నీవెందుకొచ్చావు ? మళ్ళీ రామాయణము వినాలని వచ్చావా ! లేక నీ తమ్ముని విడిపించుక పోను వచ్చావా !" అన్నారు.

భరతుడు కొంచెము సమాయించుకుని "నాకు అవి రెండూ కావలసినవే ఐనా ఒకమాట వినండి. మీరు రామాయణము పారాయణము చేసేవారు కదా ! రామానుజులతో యిలాగ తగాదాకు దిగడము బాగుంటుందా ? వెనుకటినుండి మీ మునికులమంటే మా రాజులకి గౌరవము. మా రాజులమంటే మీ మునులకీ గౌరవము వుంటూ వచ్చింది. ఆ అలవాటు అలాగే సాగిపోతేనే మంచిది. రేపు జరిగే రాజసూయములో మిమ్మల్ని పిలిపించి మీచేత రామాయణము చదివించి మీ గురువుగారి అనుమతిమీద మిమ్మెంతగానో ప్రేమించాలనుకున్నాడు రామ భూపాలుడు.

ఆ వివరాలన్నీ మీకు చెప్పి మన శత్రుఘ్నుని బ్రతికించుకుని, గుర్రాన్ని విడిపించుకుని వాల్మీకుల వారి అనుమతితో మీ యిద్దరినీ రథముమీద ఎక్కించుకుని పోవాలనే నేను వచ్చాను. అసలు మునులకు రాజులకూ యుద్ధమేమిటి ? చరిత్ర తారుమారు అవుతోంది కనుక జరగకూడదు.

నా పేరు భరతుడు. రామలక్ష్మణులు వనవాసంచేసి వచ్చిందాకా నేనే యిక్కడ రాజ్యము పాలించాను. నా మాటను మా అన్నదమ్ములెవరూ కాదనరు కనుక నా మాట వినండి. శత్రుఘ్నుని మాకీయండి. గుర్రాన్ని విడిచిపెట్టండి" అన్నాడు యుక్తి యుక్తముగా.

## భరతుడు మూర్ఛపడుట

భరతుడు చెప్పిన మాటలన్నీ విన్నారు కుశలవులు. వారికి ఆ మాటల్లో పస కనపడలేదు. తేలికగా నవ్వారు. "నీ పేరు భరతుడా ! విన్నాం. అన్నగారి పాత చెప్పుల కాపలాదారివి. నీవూ ఒక ధీరుడవేనా ? నేను వీరుడనంటూ నీవనుకుంటే సరిపోయిందా ? ఏదీ రామాయణంలో ఎక్కడా నీ పనితనం కనపడలేదే ? పోనీ ఆ ప్రతాపమేదో మేమొకసారి చూడొచ్చుగా, నీ వాలకం చూస్తే కాలం గడుపుకునే బాపతుగాని కత్తిపట్టి కదనం చేసేరకంగా లేవు. నీ యెత్తులు మా ముందు సాగవు. గుండె ధైర్యం వుంటే మమ్మల్ని యుద్ధంలో గెల్చి గుర్రాన్ని విడిపించుకుని పో. లేకపోతే తిరిగి చూడకుండా యింటికి పో" అని విదిలించికొట్టారు.

భరతునికి పట్టలేనంత కోపము వచ్చినది. ఐనా ఏమీ చేయలేక వెనక్కి తగ్గాడు. నెమ్మదిగా "మీరు మునిబాలకులైనందున బ్రతికిపోయారు. ఇదే రాజ

కుమారులై వుండే యీపాటికి నా బాణము వేటుతో యమలోకానికి పంపించి ఉండేవాడ్ని" అన్నాడు ధీమాగా. కుశలవులు "ఓయీ ! మేమెవరమైనా విల్లుబట్టి యుద్ధనికి తొడచరిచాం కనుక రాచబిడ్డలమే. ఇక చూపించు నీ బలం" అంటూ అంబులు చేతపట్టారు. భరతుడు యుద్ధముచేసి మూర్ఛపడిపోయాడు. ముని కుమారులు భరతుని కూడ శత్రుఘ్నుడున్న చోటుకే చేర్చారు.

ఆ వార్త అయోధ్యలో రామునికందింది.

## లక్ష్మణుడు యుద్ధానికి బయలుదేరుట

ధీమాగా ఉన్న రాముడు దిగాలు పడిపోయాడు. అది చూచిన లక్ష్మణుడు "అన్నయ్యా ! మన భరతుడు బలవంతుడైనా అనుభవనీయుడు కాడు, అంచేత అలా జరిగివుంటుంది. నేనంటారా ! మీతోబాటు కొంతవరకు రాక్షసుల్ని చంపాను. చూడండి రావణాసురుని కొడుకు మేఘనాధుడు వాడు దేవేంద్రుని జయించినందున యింద్రజిత్తునని పేరుకూడా పెట్టుకున్నాడు. వాడికి చావకుండా వరాలున్నాయి. ఆకాశానికి ఎగిరి మేఘాలచాటునుండి మనమీద కూడా యుద్ధం చేశాడు. వాడిని నేనెలా చంపానో మీకు తెలిసిందే, నా కాజ్ఞ యిచ్చి పంపించండి నేనా మునిబాలకుల్ని జయించి మన భరత శత్రుఘ్నుల్ని యిద్దరినీ విడిపించుకుని వస్తాను" అన్నాడు.

రాముడు లక్ష్మణునితో "తమ్ముడూ ! మన భరతునికి అనుభవము తక్కువయినా మునిబాలురకు ఓడిపోవడమే చిత్రంగా వుంది. అయితే ఒకటి. కుశలవులు వాల్మీకి శిష్యులు. ముని వాళ్ళకు మంత్రాలు తంత్రాలు నేర్పి వుండొచ్చు" అన్నాడు. లక్ష్మణుడు వెంటనే మనకు మాత్రం విశ్వామిత్ర మహా

ముని యాగం కాపాడడానికి దండకారణ్యం పోయినపుడు మనకు బల, అతిబల విద్యల్ని నేర్పలేదా ! వానితో నేనా ముని బాలకులను జయించి సోదరుల్ని వెంట పెట్టుకుని గుర్రాన్ని విడిపించుకుని కుశలవుల్ని బంధించుకుని వస్తాను" అన్నాడు. రాముడు కొంత సైన్యం యిచ్చి పంపాడు.

విజయ దుందుభులు మ్రోగినై.

## లక్ష్మణుడు మూర్ఛపడుట

రణగణధ్వనులతో దండెత్తి వచ్చిన లక్ష్మణుడు జయభేరి మ్రోగించాడు. కుశలవులు వచ్చి నిలబడ్డారు. "మా యాగాశ్వాన్ని పట్టుకున్న పిల్లలు మీరేనా !" అన్నాడు. లక్ష్మణుడు హుందాగా "మేమే, ఐతే యేమి ?" అన్నారు కుశలవులు ఉదాసీనంగా. లక్ష్మణుడు వెంటనే పౌరుషము తగ్గించుకుని "మా పరివారములో యెవరైనా మీకు ఎగ్గు కలిగించారా ! మిమ్మేమైనా గేలి చేశారా ! వాల్మీకిమునుల వారంటే మాకెంతో భక్తి గౌరవాలు ఉన్నాయి. ఆయనగారి శిష్యులు మాతో యుద్ధము చేయడము మంచిదికాదు. సరే, ఇంతకీ జరిగిందేదో జరిగిపోయింది. మనం మనం పోరాడకుండా స్నేహమయ్యేదెలాగో మీరే చెప్పండి అలాగే చేద్దాము అన్నాడు.

కుశలవులు "ఓహో ! నీవింత ఓర్పుగా నేర్పుగా మాటాడుతున్నా వంటే నీవు నిజమైన లక్ష్మణుడవో కావోనని మాకు అనుమానము పుట్టు కొస్తూంది. ఇంతకి నీవు అసలు లక్ష్మణుడవా ? నకిలీ లక్ష్మణుడవా ! రాముని తమ్ముడు-రామాయణపు లక్ష్మణుడూ ఐతే అది త్రాచుపాము. కదిలించితే కాటే స్తుంది. కాని యిలా మన్ను తిన్న పాములా మాటాడదు" అన్నారు. లక్ష్మణు

నికి నిజముగానే కోపము వచ్చింది. కనురెర్ర చేశాడు. మీరు రామాయణం గానం చేసారనే ప్రేమతో అలా చెప్పాను. నా మంచితనాన్ని మీరుపయోగించుకోకపోతే మీ యిష్టం సరే. యుద్ధము చేద్దాం రండి" అన్నాడు.

లక్ష్మణుడు యుద్ధములో మూర్ఛపడ్డాడు. కుశలవులు వానిని కూడా భరత శత్రుఘ్నులున్న చోటుకి చేర్చారు.

## హనుమంతుడు మునిపల్లెకు వచ్చుట

హనుమంతుడు అంతకుముందే రామేశ్వరమునుండి వచ్చి అయోధ్యలో ఉన్నాడు. ఆయనకు రామనామమే ముఖ్యము. రామనామము తప్ప ఇతర లోకము ఆయనకు తెలియదు. ఎలాగో యిది ఆయన చెవుల బడింది. రాముని తమ్ములు ముగ్గురూ పగవారి చేతిలో పట్టుబడిపోయారు అనగానే పట్టరాని కోపము వచ్చినది. తన ప్రాణాలు పోయినా ఒప్పుకుంటాడుగాని రామునికి రవ్వంత బాధ కలిగితే సహింపలేడు. లేచి కాలుచేతులు విదిలించుకున్నాడు. ఛంగుమంటూ వచ్చి రాముని ముందు పాదాలకు వందనము చేశాడు.

"రామచంద్రప్రభూ! మన లక్ష్మణ భరత శత్రుఘ్నుల్ని బంధించింది యెవరు? ఇంతపని జరుగుతుంటే నాకు చెప్పలేదే? ఇప్పుడైనా చెప్పండి. ఇపుడే పోయి పగవానిని నా వాలముతో కట్టకట్టి తెస్తాను" అన్నాడు. రాముడు సంతోషించి "నీ ఏకాంతం భంగం చేయలేక చెప్పలేదు హనుమా!" అంటూ వివరాలన్నీ చెప్పి దీవించాడు. హనుమంతుడు కుప్పించి ఎగసి గగనమార్గాన రివ్వుమని పోయి గంగానదీ తీరాన వ్రాలాడు. అతడిని చూస్తే కుశలవులికి అనుమానము

వచ్చింది. ఇంటికి పోయి "అమ్మా! అమ్మా! ఒక పెద్దకోతి వచ్చింది అని చెప్పారు.

సీత కొడుకుల్ని వెంటబెట్టుకుని పోయి దూరంగా ఉండి చూచింది. "నాయనలారా ! ఈ కోతి సామాన్యమైన కోతి కాదు. రామాయణంలో దీని కథ చాలా వుంది. దీని పుట్టుపూర్వోత్తరాలు అన్నీ నేను మీకు చెపుతాను. రండి పోదాం" అని కుమారుల్ని ఆశ్రమానికి తీసుకుపోయింది.

## హనుమంతుని తల్లిదండ్రులు

అబ్బాయిలూ ! అసలు బ్రహ్మదేవుని కూతురు అహల్య. అహల్య పెనిమిటి పేరు గౌతమముని. ఆ దంపతులకి వాలి, సుగ్రీవులు అనే కుమారిద్దరూ, అంజని అనే కుమార్తె కలిగారు. గౌతమునికి అనుమానం వచ్చింది. కొడుకులిద్దరినీ గౌతమి నదిలో పడవేశాడు. వాళ్ళు కోతులుగా మారి ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చారు. వాలి దేవేంద్రునికీ, సుగ్రీవుడు సూర్యునికి పుట్టిన సంతానం అని తేలిపోయింది. గౌతముడు "మీరు కిష్కింధను పాలించుకొండి పొండి" అని పంపించాడు. ఇక కూతురును "నీవింతకాలము చూస్తూండికూడా మీ అమ్మ చేస్తున్న పొరపాటు నాకు చెప్పలేదు కాబట్టి గ్రుడ్డిదానివై పో" అని శపించాడు. ఆమె క్షమాపణ కోరుకుంది. గౌతముడు జాలిపడి "అయితే భోజనం వేళకు నీ చేతిలో ఏది పడితే అది తిని బ్రతుకు" అన్నాడు. అంజని పెనిమిటి కేసరిగూడ ఏమి చేయలేకపోయాడు.

ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు భూ సంచారం వచ్చారు. ఆడకోతి, మగకోతి కలిసివుండడం చూచారు. వారికి అనురాగము కలిగి కోతి రూపాలతోనే

లైంగికంలో పడ్డారు. క్రింద పడబోయే శివ వీర్యాన్ని వాయుదేవుడు భద్రంగా తెచ్చి అంజని దోసిట్లో వేశాడు. అంజనికి కంటిచూపు లేదు ఏదో పండే ననుకుని మింగింది. ఆమెకు నెలతప్పింది.

## హనుమంతుని జననము

అంజనీదేవికి నెలలు నిండినై, కాన్పు రాలేదు. నొప్పులధికమయ్యాయి. ఆమె బాధ చూచిన వాయుదేవుడు యిల్లు కదలలేదు. గాలిలేక ప్రాణాలన్నీ గిజ గిజలాడసాగాయి. అప్పుడు పెద్ద పెద్దలంతా కదలివచ్చారు. "గాలిదేవా! నీవు కదిలి మెదిలాడితేనేగాని లోకాలు బ్రతకవు. కూర్చున్నావేం? లే" రమ్మన్నారు. నిర్మొహమాటంగా చెప్పేశాడు. వచ్చినవారంతా "తల్లి కడుపులో ఉన్న పిల్లవాడా! నీవు ముందు బయటకు రావయ్యా!" అన్నారు. నేను మా అమ్మ పొట్టలో ఉండగానే నాకు గోచి జందెం కవచకుండలాలు కావాలి. అవి యిస్తేనే నేను బయటపడతా" నన్నాడు అంజని కడుపులో ఉన్న అల్లరిబాబు.

బ్రహ్మ విష్ణు శివులు ముగ్గురికీ ఆ పని చేతకాలేదు. అందరూ కలసి విశ్వ కర్మను వేడుకున్నారు. ఆయన వారికి దర్శనమిచ్చారు. సంగతంతా తెలుసు కున్నాడు. పొట్టలో ఉన్న బుజ్జి పాపాయికి గోచి జందెం కవచకుండలాలు ఇచ్చాడు. తల్లికి కాన్పు జరిగింది. అంజనీదేవి కొడుకుకి "ఆంజనేయుడు" అని పేరు పెట్టారు. తను కోరినట్లు తల్లి కడుపులో ఉండగానే కావలసినవానిని యిచ్చిన విశ్వకర్మను గురించి పొగిడాడు బాలాంజనేయుడు. నేను నీ జండామీద వుంటాను" అన్నాడు. అంచేతనే విశ్వకర్మ భగవానుని "హనుమత్పతాకధారి" అంటాం.

## హనుమంతుడు మహాపండితుడు

మరునాడు తెలవారింది. తూర్పుకొండల మీదనుండి ఎక్కివచ్చే సూర్యుణ్ని చూచాడు ఆంజనేయుడు. పండనుకుని అమాంతంగా ఎగిరిమింగేశాడు. సూర్యబింబం దాని నోటినుండి జారిపోయింది. ఆంజనేయుని మూతి కాలి ఎర్రబడింది. సూర్యుడు కోపించి ఆంజనేయుని "నీ బలం నీకు తెలియక పోవుగాక" అని శపించాడు. అంజనీ దేవి వచ్చి తనబిడ్డ తప్పిదాన్ని మన్నించుమని వేడుకుంది. ఆయన కరుణించి "అయితే నీ కొడుకు బలవంతుడని ఇతరులు పొగిడి చెప్పితే అప్పుడు తన బలం తనకు ఉపయోగపడుతుంది" అని సమర్థించాడు !

ఇప్పుడు సూర్యుని గొప్ప ఆంజనేయుడికి బోధపడింది. "స్వామీ ! మీరు మహా విద్వాంసులుట. అన్ని వేదాలు తమకు వచ్చినవేనట, నాకు చెప్పండి". అని అడిగాడు. సూర్యుడు "ఓయీ ! నేను ప్రతిదినం తూర్పునుండి పడమటకు పయనిస్తూంటాను. కనురెప్పపాటు కాలంకూడా నేనొకచోట ఉండేవాడను కాను. మరి నేను నీకెలా చదువు చెప్పడం ?" అన్నాడు. ఆంజనేయుడు వెంటనే "అలాగయితే నేనొక కాలు తూర్పు కొండమీదా, ఒక కాలు పడమట కొండమీదా పెట్టి నా చెవి మీకు దగ్గరగా ఉండేలాగా త్రిప్పుతుంటాను. నాకు మీరు వేదం చెప్పండి" అన్నాడు. సూర్యుడు సరేనన్నాడు.

అలాగ ఆంజనేయుడు వేదాలూ, శాస్త్రాలూ చదివాడు. తర్కంలో గొప్ప పండితుడయ్యాడు. సంగీతంలో మంచి ప్రవీణుడూ అయ్యాడు. వాలి సుగ్రీవులు అతనికి మేనమామలు. అయినా ఆంజనేయుడు సుగ్రీవునికి మాత్రమే మంత్రి అయ్యాడు.

## హనుమంతుడు సుగ్రీవునకు మంత్రి

అలా ఉండగా వాలి సుగ్రీవులకు తగాదాలు వచ్చినై. వాలి తన తమ్ముడైన సుగ్రీవుని భార్య రుమను అపహరించాడు. సుగ్రీవుడు అన్న నెదిరింపలేక యిల్లువిడిచి పోయాడు. ఇంతలో దుందుభి అనే రాక్షసునికి వాలికి భయంకర యుద్ధం జరిగింది. దుందుభి పారిపోయి రుష్యమూకాద్రి గుహలో దూరాడు. వాలి అతనిని వెంబడించాడు. చాలాకాలందాకా వారెవరూ బయటకు రాలేదు. సుగ్రీవుడు అది గమనించి కొండ బిలానికి ఓ పెద్దరాయి మూతవేసి యింటికి వచ్చాడు. అన్న చనిపోయాడని చెప్పాడు. కిష్కిందకు రాజయ్యాడు. వాలి భార్య తారను కూడా చేరదీసుకున్నాడు.

కొండలోనికి పోయిన వాలి దుందుభిని వెదికి పట్టుకుని చంపాడు. కసి తీరక శవాన్ని కాలితో బలంకొలది తన్నాడు. దుందుభి కళేబరం పోయి ఒక ముని చెంత పడింది. ఇదంతా తెలియక ఆ ముని కోప్పడ్డాడు. "ఈ శవాన్ని యిక్కడ పడేసినవాడెవడైనా గాని యీ కొండమీదికి యింకొకసారి వస్తే వాడి తల బద్దలుగా పగిలి చనిపోతా"డంటూ శపించాడు.

వాలి చాలా బలవంతుడు కనుక మూత బండను ప్రక్కకు తోసేసి యింటికి వచ్చి చూచాడు. సుగ్రీవుని మీద కోపం రేగిపోయింది. మళ్ళీ వానిని తన్ని వెడలగొట్టి మరదలును చేపట్టాడు సుగ్రీవునికి ముని శాపం తెలిసింది. అందుచేత వాలి రుష్యమూకాద్రి మీదకు రాడని ధైర్యం వచ్చింది. సుగ్రీవుడా కొండమీద నిర్భయంగా కాలం గడుపుకుంటున్నాడు. అప్పుడీ ఆంజనేయుడు మంత్రియై చిన మేనమామదగ్గరనే ఉన్నాడు.

## హనుమంతుడు మహా వీరుడు

కిష్కింధ కథ యిలాగ ఉంది. భార్యతో తమ్మునితో దండకారణ్యానికి వచ్చిన రాముడు ఓ కుటీరం నిర్మించుకుని ఉంటూ వున్నాడు. మునులతో చెలిమి

చేసి రాక్షసులమీద దాడి చేయుచున్నందున రావణునికి రామునిమీద కోపం రెచ్చి పోయింది. ఒకనాడు మాయరూపంలో వచ్చి మోసగించి సీతను లంకకు తీసుక పోయాడు రావణాసురుడు. రామలక్ష్మణులకు సీతజాడ తెలియలేదు. ఆమెకై వారు అడవినంతా గాలించి చివరకు దక్షిణపు దిక్కుగా పయనించారు. హనుమంతుడా సమయంలో ముందుగా పరిచయం చేసుకుని రామునికి సుగ్రీవునికి మైత్రికలిపాడు.

రామ సుగ్రీవులకి ఒడంబడికలు కుదిరినై. రాముడు వాలిని చంపి కిష్కింధకు సుగ్రీవుని రాజును చేశాడు. రుమ తారలు గూడా కపిరాజు వశ మయ్యారు. ఆ తరువాత ఆంజనేయుడు నూరుయోజనాల వారధి దాటి లంకకు పోయాడు. సీత జాడ తెలుకుని రాముని క్షేమం తెలియచేశాడు సీతాదేవికి. తిరిగి వచ్చి రామునికి సీత యిచ్చిన అనవాలు అందించాడు.

రామునికి మేలు చేసేటందుకు సముద్రం మీద వంతెన కట్టిన నలుడు, నీలుడను శిల్పి బ్రాహ్మణులకు సాయం చేశాడు ఆంజనేయుడు. రామరావణ యుద్ధం ప్రారంభమయింది. ఆ యుద్ధంలో ఆంజనేయుడు రాక్షసులను ఎందరినో హతమార్చాడు. ఒకనాడు లక్ష్మణుడు మూర్ఛపడితే అద్దమరేయి పోయి ద్రోణ గిరిని తెచ్చి రామానుజుల వారి ప్రాణాలు కాపాడాడు కూడా.

## హనుమంతుని రామనామము

హనుమంతుడు బ్రహ్మచారి - గొప్ప వేదాంతి, మంచి బలవంతుడు. ఆయన నెవరూ జయింపలేరు. హనుమానుని జయించాలంటే ఒక్కటే ఒక్క సూత్రముంది. అది రామనామం. రామనామం ముందు రామబాణం గూడా పని చేయలేదు. రామనామ సంకీర్తన వింటే పిచ్చిగంతులు పెడతాడు." అని సీత వివరించి చెప్పింది కుశలవులికి కావలసంత గుట్టుదొరికింది. వెంటనే ఆశ్రమము నుండి ఆంజనేయుడున్న చోటుకి పోయారు.

రఘుపతి రాఘవ రాజారాం
పతిత పావన సీతారాం
దశరథ నందన రాజారాం
దశముఖ మర్థన సీతారాం
ఆశ్రిత వత్సల రాజారాం
అభయ ప్రదాతా సీతారాం
మానుష వేషా రాజారాం
మారుతి వందితా సీతారాం

అని పాడడం మొదలుపెట్టారు. ఆ పాట చెవులబడింది ఆంజనేయుడికి తను వచ్చిన పని మరచిపోయాడు. పిల్లలు పాడే పాటకు తాళంవేస్తూ తలత్రిప్పుతూ తోకాడిస్తూ కుశలవులచుట్టూ గంతులు వేయసాగాడు. అది గమనించారు కుశలవులు. అతనిని మెల్లగ మరపించి యింకొక చోటుకి తీసుకపోయారు. ఆయనక్కడ రామ భజనచేసి చేసి అలుపొచ్చి అక్కడనే పడి నిద్ర పట్టించాడు.

## రాముడు కుశలవుల మీద యుద్ధమునకు వచ్చుట

రాముడింక రంగంలో దిగక తప్పలేదు. యుద్ధానికి బయలుదేరాడు. ఆయనకు దారిలో అపశకునాలు, శుభ శకునాలు. గూడా జరిగినై. ఐనా గతిలేనం దున యుద్ధానికి వచ్చాడు మొత్తముమీద మునిబాలకులమీద బాణమెత్తడమంటే బంకుగానేవుంది. బెరకు బెరకుగానే వచ్చి కట్టివేయబడిన గుర్రాన్ని చూస్తూ నిలబడి పోయాడు. ఇంతలోనే కుశలవులు వచ్చి "ఎవరవు నీవు ? ఎందుకొచ్చావు?" అని సూటిగా అడిగారు,

మునికుమారులు అడిగినదానికి సమాధానము చెప్పకుండానే "చిరుత లారా! ఇది మా గుర్రం. దీనిని బంధించింది మీరేనా!" అన్నాడు రాముడు. కుశ లవులు "మేమే కట్టేశాము. మా పరిధిలోనికి వచ్చించి. మేము పట్టేశాము. కట్టే శాము" అన్నారు. "ఐతే బాబూ! దీని ముఖాననున్న ఆ పత్రము మీరు చదువ లేదా!" అన్నాడు రాముడు మళ్ళీ. బాలకులు, "చూడకేం! చూచాము. చూచాము కనుకనే పట్టాము. "రాజులెవరైనా పట్టుకొనండి అని వ్రాసివుంది" అన్నారు.

"అదే నేనంటుంది కూడా. రాజులెవరైనా పట్టుకోండి అన్నాను. మీరు ముని బాలుర కనుక మాతో మీకు సంబంధములేదు. గుర్రాన్ని విడవండి" అన్నాడు రాముడు. "పొరపాటు. రాజులెవరైన అంటే ఏ రాజులైన సరేననిగదా అర్థం" మేము ముని రాజులము కనుక పట్టుకున్నాం. విడిచేపని మాకేముంది?" అన్నారు ముని కుమారులు. "ఐతే గుర్రాన్ని విడువరా!" "విడువము." యుద్ధము చేస్తారా" "చేస్తాం" అంటూ మాటలు పెరిగిపోయినై.

## - కుశలవులు రాముని గెలచేయుట -

రాముడు చివరికిలా అన్నాడు.

సీ॥ ధరణి భారము దీర్చ దామోదరుండు తా
దశరథ తనయుడై తగ జనించి
శివుని విల్లు విరచి! సీతను పెండ్లాడి!
జనకు నానతిచేత వనికినేగి!
వాలిని ఖరిమార్చి వారధి బంధించి
దనుజాతి నెల్ల శాశనము చేసి!
విజయసమేతుడై నిజపురంబును జేరి
పట్టాభిషేక వైభవమునొంది!

గీ॥ దేశ దేశాలు గెల్చిన ధీవరుండ
దేవదేవుండటంచు కీర్తింపబడిన
రామచంద్రునితో మీకు రణమిదేల?
ముక్కుపచ్చలారని చిన్ని ఖుదుతలార!
ఆ మాటలు విని కుశలవుల్లు జవులు చెప్పారు.

సీ॥ అండదండలు లేని ఆడదానిని జంపి
వీరుడనని వెన్ను విరువ దగునె?
చెట్టు చాటున దాగి చిలిపికోతిని గొట్ట
ఘనతకాదు - పిరికితనమె గాని!

యింటిగుట్టును జెప్పు తుంటిరి చెలిమితో
రావణు గూల్చుట ప్రతిభయేమి ?
గాలిమాటలు విని ఆలినడవి కంపు
రాముడెంత పనికిరాని వాడో ?

గీ॥ పరుల కెదురాడ జాలని పిరికిపంద
మంచి చెడ్డలు తెలియని మందబుద్ధి
తెలియుచున్నది బ్రతుకెల్ల తేటపడగ
సిగ్గుచేటు - రాముని గొప్ప చెప్పనేల ?

## కుశలవులు రామునితో యుద్ధము చేయుట

కుశలవులు గుర్రాన్ని విడిచేలాగా లేరు. రాముడు యుద్ధము చేయ సాగించాడు. కుశలవులూ పోరాడుతున్నారు. పట్టుదలలు పెరిగిపోయాయి. యుద్ధము భయంకర రూపము దాల్చింది. ఇంతలో యిదంతా తెలుసుకున్న వాల్మీకి వచ్చి "యుద్ధము నిలపండి" అన్నాడు. కుశలవులువచ్చి తాతగారి పాదాలకు మొక్కారు. రాముడు అక్కడనుంచే చేతులెత్తి నమస్కరించాడు.

వాల్మీకిముని "రామా ! వీరిద్దరూ నీ కుమారులు, కవలలు. కుశలవులని వీరి పేర్లు. ఆనాడు అయోధ్యలో రామాయణము గానము చేసిందికూడా వీరే. నీవు జననిందకు భయపడి సీతను అడవులకు పంపావు. నేనామెకు చోటునిచ్చాను. తండ్రిలా ఆదరించాను. ఆమె యిప్పుడు నా యింట సలక్షణముగా వుంది. సీత కుమారులు వీళ్ళిద్దరూ నాచెంతనే సకలవిద్యలూ నేర్చుకున్నారు" అని చెప్పాడు. రాముడు పరమానందములో కుశలవులను యిద్దరనూ చెరియొక చేతా దగ్గరకు తీసుకుని ముద్దాడాడు. ఇంతలో సీతవచ్చి నిలుచుంది.

రాముడు సీతకు కొంచెం దగ్గరగా వచ్చి "మహారాణీ ! ఆనాడు నేను నీకు అన్యాయము చేసినమాట నిజము" అని యింకా ఏమో చెప్పబోతున్నాడు. కానీ, సాంతం వినకుండానే "పోనీయండి. ఈనాటికైన మీరా మాటన్నారు. నేను విన్నాను, నాకంతవరకే చాలు. ఈ మంచిమాట వినడానికే యిన్నాళ్ళు బ్రతికాను.

వెనక్కు తిరిగింది సీత. రాముడామెను వెంబడిస్తున్నట్లుగా రెండడుగులువేసి "నీవు నిందార్హురాలవు కావని రుజువు చేయగలిగితే" అనగానే సీత వెనుకకు తిరిగి చూచింది. ఆమె ముఖంలో కోపం పొడచూపింది.

## సీత చెప్పిన చివరిమాట

"ఆడదాని బ్రతుకునంత తేలికగా చూడకండి మహారాజా! స్త్రీ విలువ తెలియని శ్రీరాముని భార్యనని చెప్పుకొనడానికి ముందు నేను సిగ్గుపడుతున్నాను. అనుమానాలమారి పెనిమిటికి ఆలియై బ్రతికేదానికన్నా అడవిలో మ్రానై పుట్టడం మేలు ప్రపంచంలో మానవులకు ప్రమాదాలు రావడం సహజం. నిందలు రావడమూ సహజమే. అప్పుడెవరైనా శంకింపవచ్చు. నిందమోపినవారు ప్రమాణము చేయనూ వచ్చు. అదీ ఒక్కసారి. మీ పరిపాలనలో ఆడది ఒకసారి జరిగినదాన్ని గురించి ఎన్నిమారులు ప్రమాణం చేయాలంటారు? ఒకసారి బలమైన ప్రమాణం జరిగింది. ఓహో అన్నారు ప్రభువులు. ఆ ప్రభువులే మళ్ళీ మళ్ళీ రుజువులు కావాలంటు న్నారా! ఇంతకంటే ఆడదానికి అవమానమేముంది?

నిప్పు, నిప్పునిప్పే. దానికి చెదలంటదు, నా శీలాన్ని రుజువు చేయమంటు న్నారు మీరు. చేస్తాను నేను. ప్రభువులు నన్ను అందలం ఎక్కిస్తారు. మళ్ళీ ఎవరో, ఎక్కడో, ఏదో అంటారు. అప్పుడు మీరు నన్ను నమ్మించి నట్టేట నెడతారు. ఈ రకంగా మీ మేడ నేనెన్నిసార్లు ఎక్కిదిగానో తెలియదు. నేనికమీద అందాకా రావడ మెందుకు! అరుగో మీ కుమారుల్ని మీకప్పగించాను స్వీకరించండి. ఇక నాదారి నేను చూచుకుంటాను - కాదనకండి.

## సీత భూదేవిలో కలసిపోవుట

సీత యిలాగా మాటాడుతుందని ఎవరూ ఊహించలేదు. రాముడింక బదు లాడలేకపోయాడు. కుశలవులకంతా అయోమయంగా వుంది. వాల్మీకి గూడ మాటా డక చూస్తూ నిలుచున్నాడు. మిగిలినవారిలో ఎవరికీ కాలుసేతులాడలేదు.

"అమ్మా! అమ్మా! అమ్మా!" అని సీత మూడుసార్లు బిగ్గరగా పిలి చింది. పెళపెళమను ధ్వనులతో భూమి బ్రద్దలుగా చీలింది. అందుండి బంగారు

నగలు, రత్నకిరీటం, పట్టు వస్త్రాలూ ధరించిన ఓ దివ్యాంగన బయటికివచ్చి "ఏమిటి తల్లీ ?" అంది. సీత "అమ్మా ! నేనింక యీ నరకయాతనలను భరింపలేను. పుట్టి నందుకు, పెరిగినందుకు అనుభవించింది చాలును. నన్నింక నీలో కలుపుకో" అని బావురుమంది. భూదేవి "రా తల్లీ !" అంటూ తనవెంట తిరిగివచ్చిన బాటనే సీతను వెంటబెట్టుకుని వెళ్ళిపోయింది. నేల ఎప్పటిమాదిరే మూతబడింది.

కుశలవులు తల్లికోసం విలపించారు. రాముడు పిల్లలకన్నా పిల్లవాడై గొల్లుమన్నాడు. వాల్మీకి వారందరినీ ఓదార్చాడు. "రామా ! చేతులారా చేసు కున్నావు. ఇప్పుడేడిస్తే నీకు వచ్చేది కన్నీళ్ళు మాత్రమే. ఆలిని ఆయాసపెట్టిన వాడెవడూ బాగుపడలేదు. యిప్పుడు నీవెంత శోకించినా సీత తిరిగిరాదు. పిల్లలను ముందుంచుకుని నీ ముందుదారి చూచుకో" అన్నాడు.

## రాముడు రాజసూయము పూర్తిచేయుట

వాల్మీకి కుశలవుల్ని బుజ్జగించాడు. "చిరంజీవులారా ! ఈ రామచంద్రుడే మిమ్ముకన్న తండ్రి. మీరు మహారాజ కుమారులైకూడా మా ముని పాకలలో పెరిగారు. అది దైవనిర్ణయం. గతించిపోయింది. మళ్ళీ తిరిగిరాదు. ముందు ముందు మీరు అయోధ్య పాలింపవలసిన ప్రభువులు. నేనెప్పుడూ మీకు తాతనే. రేపు జరగ బోయే రాజసూయ మహా యజ్ఞానికి నేనూ నగరం వస్తాను. మీరు మీ నాన్నగారి వెంట రాజధానికి పొండి" అన్నాడు.

కుమారుల్ని, తమ్ముల్ని, హనుమానుని వెంటబెట్టుకుని నగరికి పోయాడు. ప్రజలందరూ ఆనందం చెందారు. రాజమాతలు ముప్పురూ వచ్చి మనుమలికి దిష్టి తీయించారు. పినతల్లులు ముప్పురూ ముద్దుబిడ్డలకు తలంటు స్నానాలు చేయించి పట్టుబట్టలు కట్టబెట్టారు. పినతండ్రులు ముప్పురూ సకలాభరణాలు అలంకరింప చేయించారు. తండ్రి యిద్దరినీ చెరియొక తొడమీద గూర్చుండబెట్టుకుని ప్రజలందరికీ పరిచయం చేసాడు. బ్రాహ్మణులు ఆశీర్వదించారు. దేవతలు పూలవాన కురిపిం చారు. జయ జయ నినాదాలతో సభంతా నిండిపోయింది.

రాముడు తరువాత రాజసూయం గూడా మహావైభవంగా చేశాడు. దాంతో రాముని కీర్తి ఇంకా దిక్కులంతా ప్రాకింది. సామ్రాజ్యం సిద్ధించింది.

## కుక్క చేసిన నేరారోపణము

సీతలేని కొరత రామునికి జీవితంలో తీరేదికాదు. అది మినహా అయోధ్యలో ఎవరికీ ఏ లోపమూ లేదు. రామరాజ్యంలో ఎవరికీ అన్యాయం జరగరాదని రాముని ప్రధానాశయం. ప్రభువులు ఆలించరనే శంక, పాలించరనే చింతలు ఎవరికీ కలుగ రాదు. న్యాయస్థానానికి ఎవరైనా నిరాటంకంగా రావచ్చు. ఏదైనా స్వయంగా చెప్పుకోవచ్చు.

ఒకనాడు రామప్రభువులు నేరాలను విచారిస్తున్నారు. రాజసేవకుడు వెలుపలకు వచ్చి "ప్రభువులతో చెప్పుకోదలచిన వారెవరైనా వుంటే రావాలి" అని కేక పెట్టాడు. వెంటనే ఒక కుక్క తోకాడించుకుంటూపోయి నిలుచుంది. రాముడు సవినయముగా "ఏం మహానుభావా ! మీరేమైనా చెప్పేదున్నదా ?" అన్నాడు. కుక్క "నాకే బాధా కలగకపోతే నేను యిక్కడికి వచ్చేపని నాకేముంది ?" అంది. "అయితే చెప్పండి. నేను తప్పక విచారించి నీకు న్యాయం కలిగిస్తాను" అన్నాడు రాముడు. కుక్క తన స్థానములో నిలబడి "రాజా ! నా నివాసమొక బ్రాహ్మణ గృహం. ఆ యింట్లో నన్నంతా ప్రేమగా చూస్తారు. మా యజమానురాలు నాకు పాయసము పోసింది. అది త్రాగి నేను వీధిలోనికి వచ్చాను. మా యింటి ప్రక్క యిల్లు గలవాడు ఆయనా బ్రాహ్మణుడే. నా తప్పేమీ లేకుండానే నా తలమీద కొట్టాడు. గాయం తగిలింది. కట్టు కట్టుకున్నాను. చూడ"మంటూ నేరారోపణ చేసింది.

రాముడు వెంటనే నేరస్తుడిని పిలిపించి "మీమీద చేయబడిన నేరారోపణ నిజమైనదికాదా ?" అని అడిగాడు.

## నేరం చేసిన వానికి అధికార పదవి

ముద్దాయి స్థానంలోవున్న బ్రాహ్మణుడు "మహారాజా ! ఒకరినికొట్టి బాధ పెట్టడమే పాపము. అబద్ధమాడడం ఇంకా పాపము. చేసిన పాపం చెప్పితే పోతుందంటారు. నా పొడుంకాయ యింకొక కుక్క నోట కరుచుకుని వీధిని బడింది. నేనాకుక్కను కొట్టబోయి చేతిలోవున్న కర్రముక్క విసిరాను. అయితే

ఆ శర్రమువక్క వచ్చి ఈ కుక్కకు తగిలింది. దొంగకుక్క దెబ్బ తినకుండానే పారి పోయింది. నేనీ నేరం చేయాలని చేయలేదు. నేరం చేయాలని చేయకపోయినా చేసింది నేరమే. నేను నేరస్థుణ్ని. నాకు శిక్ష విధించండి. అందువలన నాకు పాపం పోతుంది. మీకు కీర్తి వస్తుంది" అన్నాడు.

రాముడు సభవంక చూసి "అయ్యలారా ! ఇక్కడున్న మీరంతా న్యాయ మూర్తులే. ఇప్పుడీ బ్రాహ్మణుడు నిజం చెప్పాడు. పైగా దండన కోరుతున్నాడు. తప్పు చేసినందున దండన విధించాలి. అయితే నేను బ్రాహ్మణుని దండింపను. రాజుగా నాకా అధికారమున్నా నేనందుకు సాహసింపలేను. వీరికి శిక్ష ఏమిటో మీరు చెప్పండి" అన్నాడు. సభలోనివారంతా "రామా ! నీవు ధర్మమూర్తివి. అదేదో నీవే ఆలోచించు" అన్నారు.

ఆలోచన పాలుపోని రాముడు కుక్కతో "మహాత్మా ! మీరు ఏ రూపములో వున్నా మీలో వున్న ఆత్మ గొప్పది. కనుక నేను మిమ్ము గౌరవిస్తున్నాను. ఈ బ్రాహ్మణునికి విధింపదగిన శిక్ష ఏదో తమరే సెలవీయండి" అన్నాడు. కుక్క తడుముకోకుండా "అలాగయితే వీనికి దేవాలయాలమీద అధికారమియ్యండి" అన్నది. వెంటనే రామప్రభువు తన రాజ్యంలోని గొప్ప దేవాలయాలమీద సర్వాధికారి పట్టా ఇచ్చి కొంత ధనముగూడా ఇచ్చి గౌరవముగా నేరము చేసినవానిని పంపించాడు.

## రాముడు కుక్కను కాశీకి పంపుట

సభలోనివారంతా ఇది ఏం న్యాయము అని గుసగుసలాడసాగారు. అది గమనించిన రాముడు కుక్కతో శునతోత్తమా ! మీరు చెప్పిన తీర్పులోని అంతర్యా మేమిటో తెలియని మావారలు మధనపడుతున్నారు. నీ మాటల్లోని చెప్పండి" అని ఉపన్యాస వేదికమీదికి ఎక్కించాడు.

కుక్క చకచకా వెళ్ళి ఆ వేదికమీద కూర్చొని "రామచంద్రప్రభూ ! నీవడిగిన దానికి చెపుతున్నాను వినండి. ఉత్తముడైన బ్రాహ్మణునికి కోపం తగదు. అపకారికి తిరిగి అపకారం చేసే కక్ష ఉండరాదు. పక్షపాతంలేని గుణం

కలిగినవాడు - పరోపకారం చేసేవాడు ఏ కులంలో పుట్టినా కల్తీలేని బ్రాహ్మణుడు వాడే. ప్రొద్దున్నే లేచి అట్టివానిని మనసులో తలచుకుని నమస్కారం చేస్తే అన్ని పాపాలూ పోతాయి. మరి ఈ బ్రాహ్మణుడు సంఘంలో బ్రాహ్మణుడని చెప్పుకొన బడే వేషధారి బ్రాహ్మణుడు. ఇతను ముక్కోపి, మతోన్మాది, లోభి. వీనిని పాపంలో పడద్రోయడమే కావాలి.

దేవాలయాధికారికి పాపాలు చేయడానికి మంచి అవకాశాలున్నాయి. బొమ్మలకు నోరుండదు. కనుక దేవాలయాధికారులు, పూజారులు చేసే నేరాలపై అజమాయిషీ వుండదు. ఇతను తనకు లభించిన పదవిలో అనంతపాపం చేస్తాడు. ఏడేడు పద్నాల్గు తరాలవారితోసహా నరకములో పడతాడు. ఆ తరువాత వీరందరి పని ఆ యమధర్మరాజు పడతాడు" అంటూ వేదిక దిగివచ్చి ప్రభూ ! నేను కాశీకి పోవాలి. నాకు సాయం చెయ్" అన్నది. రాముడు కుక్కకు పాలూ, పాయసము పెట్టించి, దాని మెడలో వరహాల సంచి కట్టించి,ఎవరే అపకారమూ చేయని భద్రతలు కల్పించి కాశీకి పంపించాడు,

## రాజ కుటుంబాభివృద్ధి

రామరాజ్యములో అందరూ సుఖపడ్డారు. రాముని కుమారులిద్దరు. వారు కుశలవులు. వారెంత బలవంతులో తెలియనివారు లేరు. అసలు ఉత్తర రామాయణము కథ వారితోనే ఏర్పడింది. లక్ష్మణునికి ఊర్మిళయందు అందదుడు, చంద్రకేతువులని ఇద్దరు కొడుకులు కలిగారు. భరతునకు మాళవియందు తక్షుడు, పుష్కలుడు అనే యిద్దరు కొడుకులు కలిగారు. శత్రుఘ్నునికి శృతికీర్తియందు సంబాహికుడు, శత్రుఘాతి అనే యిద్దరు కొడుకులు కలిగారు. కుమారులందరూ బలవంతులే.

వయసు మీరినందున కౌసల్య, సుమిత్ర, కైకేయీలు క్రమంగా కాల ధర్మాలు చెందారు. రాముడు తల్లులందరూ భక్తిశ్రద్ధలతో అంత్యక్రియలు జరిపించాడు. వారి వారి పేర్ల మీదుగా గొప్పదానాలూ, ధర్మాలూ చేసాడు. రామునికిప్పుడు ముగ్గురు తమ్ములు, ఎనమండుగురు కుమారవర్గం, మంత్రులు, సామం

తులు కావలసినంతమంది. కుమారులందరికీ రాముడు రాజ్యాలీయాలనుకున్నాడు. అయితే రాజ్యము పంచమునికి క్షత్రియ ధర్మం రాజ్యకాంక్ష కనుక సామ్రాజ్యం పెంచాలనుకున్నాడు.

## రామరాజ్య విస్తీర్ణము

రాముడు బలపరాక్రమాలతో కారుపథ దేశం గెలిచాడు. రాజ్యవిస్తీరణ కాజొచ్చింది. భరతుని పంపించి గాంధారరాజుల నోడించి దానిని స్వాధీనపరచుకున్నారు. గాంధార దేశములో నిర్మించిన తక్షశిలకు భరతుని కుమారులలో పెద్దవాడైన తక్షకునికి,పుష్కలావనికి చిన్నవాడైనపుష్కలుని రాజులుగానియమించాడు.

కారుపథ దేశంలోని అంగదీయం అనే పురానికి లక్ష్మణకుమారులలో పెద్దవాడైన అంగదుడ్ని, చంద్రకేతు పురానికి చిన్నవాడైన చంద్రకేతువును పాలకులుగా నియమించాడు.

మధువనంలో మధుపురమనే మధురానగరానికి శత్రుఘ్నుని కుమారులలో పెద్దవాడైన సుభాహుడ్ని, విదిశానగరానికి చిన్నవాడైన శత్రుఘాతిని ప్రభువులుగా నియమించాడు.

ఇక వింధ్య పర్వత ప్రాంతాలలో నిర్మించిన కుశావతి నగరానికి తన కుమారులలో పెద్దవాడైన కుశడ్ని శాలీస్తిపురానికి చిన్నవాడైన లవుడ్ని సర్వాధికారులుగా నియమించాడు ఈ విధంగా ఉత్తర భారతదేశమంతటా రాముని బంధువర్గమే ఆక్రమించింది. ఇక దక్షిణ భారతదేశంలో కిష్కింధనేలుతున్న సుగ్రీవుడు! లంకనేలుతున్న విభీషణులుగూడా రామునికి భక్తులనే పేరున సామంతులు. కట్నములనే పేరున కప్పములయ్యాయి. రామరాజ్యం లంకనుండి హిమాలయం దాకా వ్యాపించింది.

## రామావతార సమాప్తము

కొంతకాలం జరిగింది. రాముడు కొలువు దీరియుండగా ఒక దివ్య పురుషుడు వచ్చి "దశరథరామ ! నేను యమునిచే పంపబడిన దూతను. మీతో ఏకాంతంగా మాటాడవలయునని వచ్చాను" అన్నాడు. రాముడు వెంటనే రహస్య

సమావేశానికి ఏర్పాట్లు చేసి "లక్ష్మణా! మేము దేవరహస్యాలు మాటాడవలసి ఉంది. నా కోసం ఎవరు వచ్చినా లోనికి రానీయవద్దు. నీవు కూడా రావొద్దు. అలా జరిగినట్టయితే శిరచ్ఛేదన శిక్ష విధించాల్సి వస్తుం"దని చెప్పాడు.

అంతలో దుర్వాసముని వచ్చి రామదర్శనం కావాలన్నాడు. లక్ష్మణుడు "అన్నగారితో కలవడానికి ఇది సమయం కాదని, కొంచెంసేపు నిదానించ"మని మనవి చేశాడు. దుర్వాసుడు ముక్కోపి. "ఆ నాయంతవానికి అంతరాయమా! నిన్ను నీ వంశాన్నంతా బూడిదయైపోయేలా శపిస్తానన్నాడు. లక్ష్మణుడు ఆలోచించాడు ఇప్పుడీ మునిని లోపలకు పంపిస్తే నా ఒక్కని తల మాత్రమే పోతుంది. ఈ మునిని లోపలకు పోనీయకపోతే నా వంశమంతా నశించిపోతుంది" అనుకుని దుర్వాసుని లోపలకు పంపించాడు.

అప్పటికే యమదూత రామునితో "స్వామీ! మీరు వైకుంఠం నుండి భూలోకానికి వచ్చిన శ్రీరామావతారం పూర్తయింది ఇక రామాయణం కథ ముగించి తిరిగి వైకుంఠానికి రావలసిందిగా జ్ఞప్తి చేయడానికి నన్ను ధర్మరాజుల వారు పంపించారు అని చెప్పడం ముగిసింది. రాముడు దుర్వాసుని రాక చూచి గౌరవించాడు. ఇప్పుడు రాజశాసనం ప్రకారం ఆనతిమీరినందున లక్ష్మణునికి మరణదండన విధించాలి. కాని రామసేవకులలో మొదటివాడు లక్ష్మణుడు. అతనిని చంపడమెలాగా! అందుకని ధర్మసూత్రం విచారించి దేశబహిష్కారం కూడా మరణ దండనతో సమానమైనదని పెద్దలు తీర్మానించినందున సౌమిత్రికి రాజ్య బహిష్కారం విధించాడు రాముడు.


లక్ష్మణుడు అన్నయు, రాజుయునైన రామాజ్ఞ తలదాల్చి సరయూనదీతీరాన ప్రాయోపవేశం చేసి స్థూల దేహాన్ని వదిలేశాడు. శ్రీరాముడు సరయూనదియందే ప్రవేశించి వైకుంఠం చేరుకున్నాడు. భరత శత్రుఘ్నులూ ఈలోకాన్ని వీడిపోయారు.

వైకుంఠములో ఆదిశేషునిమీద నారాయణమూర్తి శయనించాడు. శ్రీ లక్ష్మీ దేవి వచ్చి విష్ణుప్రక్కన కూర్చుంది. శంఖుచక్రాలు వచ్చి హరి చేతులలో నిలచినై. రామావతారం ముగిసిందని నారదుడు గానం చేసాడు. దేవతలు పూలవాన కురిపించారు.

***

"వేరొక గదిలో యింకొక రోగి ఉన్నాడు" సోదరులలో చిన్నవాడు చెప్పాడు.

ఆ గదిలోకి వెళ్ళి ఆ రోగిని చూశాను. అతడికి పదిహేడు సంవత్సరాలు ఉంటాయి. అతడి ఛాతీమీద కత్తిగాయం లోతుగా వుంది. అతడు బాధతో మూలుగు



డాక్టర్ మేనెట్‌ని తీసుకొచ్చి తాము చెరబట్టిన యువతిని అతడికి మార్కస్ సోదరులు చూపించుట.

తున్నాడు.

"ఇదెలా జరిగింది?" అని సోదరులలో ఒకడిని అడిగాను.

"ఒక మామూలు వీధికుక్క నా తమ్ముడ్ని కరువబోయింది. చేసేదిలేక

అతడు కత్తిని కుక్కమీద ఉపయోగించక తప్పలేదు" అన్నాడు సోదరులలో ఒకడు.

చావు బ్రతుకుల్లోవున్న కుర్రవాడు శక్తినంతా కూడదీసుకుని "మా వంటి పేదవారిని చంపే హక్కు తమకు ఉందని, మదమెక్కిన యీ కులీన ధనవంతులు భావిస్తున్నారు. మా అక్కను చూసారా డాక్టర్! ఆమెకు ఎలా వుంది?" అని అడిగాడు.

"మీ అక్కను చూసాను!" అని కుర్రవాడితో చెప్పాను.

ఆ కుర్రవాడు బాధతో మూలుగుతూ యిలా చెప్పాడు :

"మా అక్క చాలామంచిది డాక్టర్! ఆమె వివాహం ఒక యువకుడితో నిశ్చయమైంది. మేము అందరం ఈ సోదరులకు సంబంధించిన పొలాలను పండించే కౌలుదారులం! అందువలన వీళ్ళు మమ్మల్ని బానిసలకంటే హీనంగా చూసేవారు. మా స్త్రీలను వీళ్ళు తమ విలాస వస్తువులుగా వాడుకునేవారు. వాళ్ళ జీవితాలతో ఆడుకునేవారు.

కొన్నాళ్ళకు మా అక్క వివాహమైంది. ఈ సోదరులలో చిన్నవాడు ఒక నాడు మా అక్కను చూసాడు. మోహావేశంలో ఆమెను వాంఛించాడు. ఆమెను తనకు అప్పగించమని ఆమె భర్తను అడిగాడు. అతను అంగీకరించలేదు. ఎదురు తిరిగాడు. అందుకు శిక్షగా యితడు నా అక్క భర్తను జంతువులాగ బండికి కట్టి రాళ్ళ మీద యీడ్పించాడు. ఒక రాత్రి ఒక పగలు తిండీ తిప్పలూ లేకుండా అలాగే ఉంచాడు. చివరకు అతడు మా అక్క చేతుల్లోనే మరణించాడు.

తన అన్న అనుమతితో యితడు మా అక్కను ఎత్తుకుపోయి వేరొకచోట దాచాడు. ఈ విషయం నా తండ్రితో చెప్పాను. అతను కోపావేశంతో సోదరులు ఉంటున్న కోటకు వెళ్ళాడు. ఆ తర్వాత నా తండ్రి తిరిగి రాలేదు. నాకొక చిన్న చెల్లెలు ఉంది. ఆమెను దూరప్రాంతంలో ఉన్న మా బంధువుల ఇంటికి పంపేసాను.

ఒకనాడు యీ రెండవ సోదరుడు బండిలో వెళుతుండటం చూసాను. కోపం ఆపుకోలేకపోయాను. ఖడ్గం చేత ధరించి బండిని అనుసరించాను. చివరకు బండి ఊరి వెలుపల ఉన్న ఓ ఇంటిముందు ఆగింది. ఇతడు బండి దిగి లోనికి వెళ్ళాడు. నేను కిటికీ గుండా లోనికి అడుగుపెట్టాను. మా అక్క నన్ను చూసింది. పరుగు పరుగున వచ్చి మా ఇద్దరి మధ్యా అడ్డుగా నిలిచింది.

'ఎవరో ఒకరు మృత్యువాత పడేవరకు మధ్యకు రావద్దు' అని మా అక్కను

హెచ్చరించాను.

మా ఇద్దరికీ జరిగిన కత్తి యుద్ధంలో ఇతడు మోసంతో నా గుండెల్లో పొడిచాడు.

డాక్టర్! వీళ్ళు నరరూప రాక్షసులు! ఏదో ఒకనాడు వీరు చేస్తున్న ఘోర కృత్యాలకు భగవంతుని ముందు జవాబు చెప్పక తప్పదు."

ఆ కుర్రవాడిలో శక్తి నశించింది. ఊపిరి ఆగిపోయింది. అతడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ఆ తర్వాత కుర్రవాడి అక్క కూడా నా కళ్ళముందే చనిపోయింది.

నేను ఆ మర్నాడు ఇంటికి చేరుకున్నాను. రాత్రి జరిగిన సంఘటనలు నన్ను ఉద్రేకపూరితుడ్ని చేసాయి.

ఆ విషయాలన్నీ తెలియజేస్తూ మంత్రిగారికి ఒక లేఖ రాసాను.

లేఖ పూర్తి అవుతూనే ఒక యువతి నా గదిలోకి వచ్చింది. ఆమె వెంట మూడేళ్ళ కుర్రవాడు ఉన్నాడు.

ఆమె తన్ను తాను పరిచయం చేసుకుంటూ "చూడండి డాక్టర్! నేను మార్కుస్ ఎవర్‌మాండే భార్యను. నా భర్త అతని సోదరుడు చేసిన ఘోరకృత్యం గురించి తెలుసుకున్నాను. మీరు వాళ్ళను చూసేందుకు వెళ్ళిన విషయం కూడా తెలిసింది. ఆ అమ్మాయి ఎక్కడ ఉంది డాక్టర్?.... వాళ్ళు ఎవరో మీకు తెలుసా? తెలిస్తే చెప్పండి ఆ పేదవాళ్ళకు న్యాయం చేస్తాను. ధన సహాయం చేస్తాను." అంది.

ఆ బాధితులు ఎవరో నాకు తెలియదనీ, కనీసం వాళ్ళ పేర్లు కూడా నాకు తెలియవని ఆమెతో చెప్పాను.

"చూడండి డాక్టర్! ఈనా చిన్నారి కుమారుడి మీద ఈనా చార్లెస్ మీద ఇతడి తండ్రి క్రూరత్వాన్ని, ఆ ఛాయలను పడనీయను. ఇతని తండ్రి చేసిన ఘోర పాపకృత్యాల ఫలితం నా కుమారుడు అనుభవించకూడదు." అని చెప్పి ఆమె తన మూడేళ్ళ కొడుకు చార్లెస్‌ను తీసుకుని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన తర్వాత లేఖను మంత్రిగారికి పంపించాను.

ఆ రాత్రి నా సేవకుడైన ఎర్నెస్ట్ డిఫార్జ్ నా వద్దకొచ్చి 'మీ కోసం ఎవరో వచ్చార'ని చెప్పాడు. నేను వెళ్ళి చూసాను. ద్వారం వద్ద ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు. 'మెడికల్ ఎమర్జెన్సీ డాక్టర్! మీరు త్వరగా రావాలి!' అని చెప్పాడు.

అతడితో నేను బండిలో బయలుదేరాను. కొంతదూరం వెళ్ళిన తర్వాత ఒకచోట బండి ఆగింది. బండిలో వున్న వ్యక్తి వెనుకపాటున నా నోటికి గుడ్డ కట్టేసాడు. విషయమేమిటో నాకు అర్థంకాలేదు.



మార్కస్ ఎవర్మాండే ఆ యువతి తమ్ముడితో కత్తి యుద్ధానికి సిద్ధపడుట.

అప్పుడు ఆ ఇద్దరు మార్కస్ ఎవర్మాండే సోదరులు చీకటిలో నుండి వెలుగులోకి వచ్చారు. అందులో ఒకడు తన జేబులో నుండి, నేను మంత్రిగారికి

రాసిన లేఖను యువతలికి తీసాడు.

"ఇదేకదూ నువ్వు మంత్రిగారికి రాసిన లేఖ!" అంటూ దానిని కాల్చి నుసి చేసాడు.

ఆ తర్వాత నేను బాస్టిల్లీ జైలులోని నార్త్ టవర్, 105 నెంబరు గదికి తీసుకురాబడ్డాను. ఇది నాకు సమాధి గొయ్యి వంటిదే!—

"నేను అలెగ్జాండర్ మేనెట్‌ని! నికాశతో కుమిలిపోతున్న ఖైదీని! నా భార్య బ్రతికిఉందో లేదో నాకు తెలియదు. ఇది 1767వ సంవత్సరం! ఇన్ని ఘోర పాపాలు చేసినందుకు ఎవర్‌మాండే వంశంలోని ఆఖరి వంశాంకురం వరకు, ఆ పాప ఫలితాన్ని అనుభవించి తీరాలి....తప్పదు."

డాక్టర్ మేనెటు చివరి వాక్యాలను పరిగణనలోకి తీసుకుంటూ అధ్యక్షుడు ఛార్లెస్‌కు మరణ దండన విధించాడు. న్యాయస్థానంలో కూర్చున్న ప్రజలలో, ఛార్లెస్ మీద సానుభూతి కనిపించలేదు. వాళ్ళంతా మౌనముద్ర వహించారు.

"ఇరవై నాలుగు గంటలలో, ఛార్లెస్‌ను మృత్యుయంత్రంద్వారా తల నరికి చంపవలసింది!" అని అధ్యక్షుడు చెప్పిన తీర్పు డాక్టర్ మేనెటు చెవుల్లో గింగురు మంటూనే ఉంది.

అతడికి కన్నీరు ఆగలేదు!—

## 14

డాక్టర్ మేనెటులో ఇంకా ఆశ చావలేదు. ఇంకా తన పలుకుబడి ఉపయోగించి ఛార్లెస్‌ను కాపాడుకోవాలని, న్యాయస్థానం చుట్టూ తిరగడం ప్రారంభించాడు.

మిసెస్ లూసీ దుఃఖానికి అంతులేదు. ఆమె ఇంటిలోనే శోకదేవతవలె పడి ఉంది.

సిడ్నీ కార్టన్‌కు సెయింటు ఆంథోనీలో గల బ్రాందీ షాపుకు వెళ్ళాలనిపించి అక్కడికి వెళ్ళాడు. మద్యం బాగా సేవించిన వాడిలా తూలుతూ, వచ్చీరాని ఫ్రెంచి భాషను ముద్దుగా మాట్లాడుతూ, కౌంటర్ దగ్గరగా ఓ బల్లమీద కూర్చున్నాడు.

మేడమ్ డిఫార్గ్ కార్టన్‌ని చూసింది. అతడు అచ్చుమచ్చు చార్లెస్‌లాగే ఉండటం చూసి ఆ విషయాన్ని భర్తతో చెప్పింది.

మేడమ్ డిఫార్గ్, ఎర్నెస్ట్ డిఫార్గ్, జాక్వీస్ మూడు, బిగ్గరగానే మాట్లాడుకో సాగారు. తప్పతాగినట్లు కనిపిస్తున్న కార్టన్ గురించి వారు అంతగా పట్టించు కోలేదు.

"చట్ట ప్రకారం శిక్ష అమలు జరపడం న్యాయమే. అయినా డాక్టర్ మేనెటు యిప్పటికే ఎన్నో బాధలు అనుభవించాడు. చార్లెస్‌కు విధించిన మరణ దండనను డాక్టర్ తట్టుకోలేకపోతున్నాడు" అన్నాడు డిఫార్గు జాలిగా.

"ఇందులో నువ్వు జాలిపడవలసింది ఏదీలేదు. మరణశిక్ష అనుభవించే, ఎవర్‌మాండే నేరస్థుల పేర్లను నేను ఏనాడో నా లేసు అల్లికలో లిఖించాను. డాక్టర్ మేనెటు రాసిన కాగితం చూసిన తర్వాత, నా కక్ష ద్విగుణీకృతమైంది. ఎవర్‌మాండే సోదరులచేత చంపబడినవారు ఎవరో కాదు, నా వాళ్ళు. నా రక్త సంబంధీకులు!.... నా అక్క, నా బావ, నా అన్న, మా నాన్న.... ఆ కుటుంబంలో మిగిలివున్న దానిని నేనొక్కతెనే!— ఎవర్‌మాండే కుటుంబంలోని వారు అందరూ చావవలసిందే!....చార్లెస్‌తోబాటు అతడి భార్య, కూతురూ కూడా చావవలసిందే!" అంది మేడమ్ డిఫార్గు.

అంతలో కొంతమంది షాపులో అడుగుపెట్టారు. వాళ్ళ సంభాషణ ఆగి పోయింది. తను ముఖ్యమైన విషయాలు ఆలకించాడు కనుక అక్కడ ఉండటం అనవసరమనిపించి, కార్టన్ లేచి షాపు బయటికి వచ్చేసాడు.

ఆ విషయాలను లూసీకి, మిస్టస్ లారీకి, డాక్టర్ మేనెట్‌కి తెలియజేయడం మంచిదనుకున్న కార్టన్ తిన్నగా బ్యాంక్‌కి వచ్చాడు.

అర్థరాత్రి దాటిన తర్వాతగానీ డాక్టర్ అక్కడికి రాలేదు. అయితే డాక్టర్‌కి మనస్థిమితంలేదు. పిచ్చిచూపులు చూడసాగేడు. ఏమైనా మందులు ఉంటా యేమోనని కార్టన్ డాక్టర్ కోటు జేబులు వెదికాడు. అతడికి ఒక జేబులో చిన్న పెట్టె కనిపించింది. దానిని తెరిచి చూడగా కార్టన్‌కి మడతపెట్టిన కాగిత మొకటి దొరికింది.

దానిని విప్పి చూస్తూనే కార్టన్ సంతోషంగా కేకపెట్టి "భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పవలసిందే!" అన్నాడు.

తన జేబులో నుండి ఒక కాగితాన్ని తీసి, ఆ రెండింటినీ మిస్టర్ లారీ చేతికిచ్చాడు.

"చూడండి! ఈ సర్టిఫికేట్లతో, డాక్టర్ మేనెటు, మిసెస్ లూసీ, ఆమె కుమార్తె, నేనూ క్షేమంగా పారిస్‌ను విడిచిపెట్టి అవతలికి వెళ్ళగలం! మీరు నా కోసం వీటిని రేపటి ఉదయం వరకూ జాగ్రతగా ఉంచండి" అన్నాడు కార్టన్, మిస్టర్ లారీతో.

"ఎందుకు? వీళ్ళు అపాయంలో ఉన్నారా?"

"మహా ప్రమాదంలో ఉన్నారు! మనం ఒక్కక్షణం కూడా వృథా చేయ కూడదు మిస్టర్ లారీ! ఎలాగైనాసరే, నువ్వు వీళ్ళను రక్షించాలి!" అన్నాడు కార్టన్ ఆతృతగా.

"ఏ విధంగా?" మిస్టర్ లారీ ప్రశ్నించాడు.

"రేపు మధ్యాహ్నం రెండు గంటలకు పారిస్ నుండి బయలుదేరే విధంగా ఒక కోచ్‌బండిని ఏర్పాటు చేయాలి. అందులో నాకూ, నీకూ, డాక్టర్ మేనెటుకీ మిసెస్ లూసీకి ఆమె కుమార్తెకూ సీట్లు రిజర్వ్ చేయించు! నేను బండి దగ్గరకు వచ్చిన మరుక్షణం నన్ను లోపలకు చేర్చి బండిని పోనివ్వాలి. కాగితాలను, సర్టిఫి

కేట్లను నీ వద్దనే జాగ్రత్తగా ఉంచు. ఏది జరిగినా సరే యీ పథకాన్ని మాత్రం మార్చవద్దు. తెలిసిందా?"

దానికి మిస్టర్ లారీ అంగీకరించాడు!



సిడ్నీ కార్టన్ చార్లెస్‌కి మత్తు మందు వాసన చూపించి
స్పృహ పోగొట్టుట!

మిస్టర్ కార్టన్, డాక్టర్ మేనెటుని తీసుకుని అతడి ఇంటి దగ్గరకు వచ్చాడు. డాక్టర్ నెమ్మదిగా, ఇంటి లోపలికి వెళ్లాడు. తనని ఎవరు తీసుకు వచ్చారో తెలుసుకునే స్థితిలో లేడు అతను.

కార్టన్ వీధిలోనే నిలబడిపోయాడు. తలెత్తి లూసీ గదివంక చూసాడు. గదిలో దీపం వెలుగుతున్నది.

"నీకు శుభాకాంక్షలు, నా ప్రియమైన లూసీ!....తుది వీడ్కోలు అందుకో!" అన్నాడు కార్టన్ గాలిలో చేతులు ఊపుతూ.

## 15

చార్లెస్ డార్నే తన గదిలో కూర్చుని తన వారికి తుది వీడ్కోలు లేఖలు రాయడం ప్రారంభించాడు. ఆ మధ్యాహ్నం మూడు గంటలకు అతడి మరణశిక్ష అమలు జరుపబడుతుంది.

అప్పుడు సరిగ్గా రెండు గంటలైంది. మరొక గంటకల్లా అతడికి ఈ లోకంతో ఋణం తీరిపోతుంది.

అంతలో అతడి గది తలుపులు తెరుచుకున్నాయి. సిడ్నీ కార్టన్ లోనికి అడుగు పెట్టడం చార్లెస్‌కు ఆశ్చర్యాన్ని కలిగించింది. కార్టన్ తలుపులు మూసి చార్లెస్ వద్దకొచ్చాడు.

"చూడు చార్లెస్! సమయంలేదు. నేను నీ భార్య వద్దనుండి వస్తున్నాను. నేను చెప్పినట్టు చేయడమే నీ తక్షణ కర్తవ్యం. నీ బూట్లు, నెక్ టై, బట్టలు, తలకు కట్టిన రిబ్బను అన్నీ విప్పేసెయ్!.... నా బట్టలు నువ్వు వేసుకో! మనమిద్దరం ఒకే పోలికలో ఉంటామని నీకు తెలుసు. నాలాగ నీ వెంట్రుకలను చిందర వందర చేసుకో!" అన్నాడు కార్టన్.

"మిస్టర్ కార్టన్! ఇది కేవలం పిచ్చితనం!....మృత్యు కుహరంవంటి యీ స్థలంనుండి ఎవరూ తప్పించుకుని బయటికి వెళ్ళలేరు. నాతోబాటు నువ్వు కూడా దేనికి మరణిస్తావు?" అన్నాడు చార్లెస్.

"నేను నిన్ను తప్పించుకు వెళ్ళమని చెప్పలేదే! కూర్చుని నేను చెప్పినట్టు ఓ ఉత్తరం రాయి" అన్నాడు కార్టన్.

చార్లెస్ కూర్చున్నాడు. కార్టన్ అతడి వెనుకభాగంలో నిలబడి జేబులో నుండి మందులషాపులో కొన్న మత్తుమందును తీసి చార్లెస్ ముక్కువద్ద ఉంచాడు. మరుక్షణంలో చార్లెస్ స్పృహతప్పి నేలమీద పడిపోయాడు.

కార్టన్ నెమ్మదిగా చార్లెస్ బట్టలుతీసి తన బట్టలు అతడికి తొడిగాడు. చార్లెస్ బట్టలు తను వేసుకున్నాడు. చార్లెస్ కట్టుకొన్న రిబ్బను తన తలకు కట్టుకొన్నాడు. ముమ్మూర్తులా చార్లెస్‌లా తయారయ్యాడు.

అన్నీ సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ చేసుకొన్న తర్వాత బైట వేచివున్న గార్డును లోనికి పిలిచాడు.

అక్కడ గార్డుగా పనిచేస్తున్న జైలు గూఢచారి అయిన జాన్‌బర్సడ్ లోనికి వచ్చాడు.

"నన్ను చూడటానికి వచ్చిన నా స్నేహితుడు మూర్ఛపోయాడు. బయటికి తీసుకువెళ్ళు" అన్నాడు కార్టన్.

జాన్‌బర్సడ్ చార్లెస్ కుడిచేతిని తన భుజంమీద వేసుకొని గది వెలుపలికి తీసుకొచ్చాడు.

"చూడు మిస్టర్ బర్సడ్! కోర్టు ఆవరణవద్ద ఒక ప్రయాణీకుల కోచ్ బండి వుంటుంది. అందులో మిస్టర్ లారీ ఉంటాడు. ఇతడ్ని మిస్టర్ లారీకి అప్పగించు" అని చెప్పాడు కార్టన్.

జాన్‌బర్సడ్ అలాగే చేసాడు—

మధ్యాహ్నం మూడు గంటలలోపు కోచ్ బండి పారిస్ నగరాన్ని విడిచి బయలుదేరింది. సిటీగేటువద్ద చెకింగ్‌కోసం కోచ్‌బండిని ఆపుచేసారు.

"మీ పేపర్స్ చూపించండి" అన్నాడు గార్డు.

మిస్టర్ లారీ పేపర్లు గార్డుకి యిచ్చాడు. డాక్టర్ మేనెట్, మిసెస్, లూసీ, ఆమె కూతురూ, మిస్టర్ లారీ, సిడ్నీ కార్టన్ పేపర్లు సక్రమంగా ఉన్నట్టు గార్డు ఆమోద ముద్ర వేశాడు. సిడ్నీకార్టన్ పేరుతో చార్లెస్ డార్నే ఆ కోచ్‌బండిలో తప్పించుకు వెళుతున్న విషయం ఎవ్వరికీ తెలియదు.

కోచ్‌బండి వేగంగా పారిస్ నగరాన్ని విడిచిపెట్టి లండన్ నగరాభిముఖంగా బయలుదేరింది.

## 16

మేడమ్ డీఫార్గ బ్రాందీషాపులో కూర్చుని వున్నది. ఆమె వద్ద జాక్విస్ మూడు మాట్లాడుతూ నిలబడి ఉన్నాడు.

అప్పటికి మధ్యాహ్నం రెండు కావస్తున్నది.

"ఇంకా ఇద్దరు దేశద్రోహులు అక్కడ వున్నారు. ఒకరు చార్లెస్ ఎవర్‌మాండే భార్య లూసీ! రెండవది దాని కూతురు. నేను వెళ్ళి వాళ్ళ వ్యవహారమేదో

చూసి అటునుండి జైలువద్దకు వస్తాను. నా కుర్చీ మృత్యు యంత్రం దగ్గరగా వేసి వుంచు" అని మేడమ్ డిఫార్గు చెప్పింది జాక్విస్‌మూడుతో.

అతడు వెళ్ళిపోయాడు.



చార్లెస్ స్థానంలో సిడ్నీ కార్టన్, మృత్యు యంత్రానికి బలైపోవుట.

మేడమ్ డిఫార్గ్ తన కుర్చీలోంచి లేచింది. ఆమెలో ప్రతీకార జ్వాలలు చెలరేగుతున్నాయి. ఛార్లెస్ ఎవర్‌మాండే సోదరులు చంపిన రక్తసంబంధీకు లందరూ ఆమె కళ్ళముందు కదులుతున్నారు.

మేడమ్ డిఫార్గులో కక్షతో కూడిన ఉద్రేకం ఉప్పొంగుతోంది. శరీరంలో రక్తం పోటెక్కిపోతోంది. టేబుల్ సొరుగులో నుంచి పిస్టల్ తీసుకుంది. పిడి బాకును కూడా మొలకు పెట్టుకున్న బెల్టులో దాచుకుంది.

బ్రాందీ షాపులోంచి బయటపడి రోడ్డు మీదకు వచ్చింది. ట్రాఫిక్ రద్దీగా ఉంది. అటుగా వస్తున్న టాక్సీని ఆపింది. లోపల కూర్చుని వెళ్ళవలసిన చోటు చెప్పింది.

అరగంటలో టాక్సీ ఒక ఇంటిముందు ఆగింది. మేడమ్ డిఫార్గు టాక్సీ లోంచి దిగి, బిల్ చెల్లించి టాక్సీని పంపించి....తిన్నగా ఆ ఇంటి వీధితలుపుల దగ్గరకు వెళ్ళింది. కాలింగ్ బెల్ స్విచ్ నొక్కింది.

రెండు నిమిషాల్లో తలుపులు తెరుచుకున్నాయి. మెరుపు వేగంతో లోపలికి వెళ్ళి వెంటనే తలుపులు మూసేసింది.

స్థాణువులా నిలబడిపోయింది చార్లెస్ ఎవర్మాండే కూతురు మిస్ ప్రాస్. మేడమ్ డిఫార్గు ఎందుకు వచ్చిందో ఆమెకు తెలుసు. ఆమె ముఖంలో నెత్తురు చుక్క లేదు. భయంతో కనుగుడ్లు ముందుకు పొడుచుకొచ్చాయి. పెదాలు విడి వడ్డాయి.

మేడమ్ డిఫార్గు చేతిలోని పిస్టల్ మిస్ ప్రాస్ గుండెలకు గురిపెట్టింది. "దేశద్రోహి" అని ఆమె నోటివెంట మాట రావడంతోపాటు చేతిలోని పిస్టల్ పేలింది. గుండెల్లోంచి రక్తం చిమ్మింది.

ఆ శబ్దానికి మేడమీద నుండి హడావుడిగా మెట్లు దిగి క్రిందికి వచ్చిన చార్లెస్ ఎవర్మాండే భార్య లూసీ— మేడమ్ డిఫార్గును చూడగానే భయంతో కంపించిపోయింది. క్రింద పడున్న కూతుర్ని చూస్తుంటే దుఃఖం పెల్లుబికింది.

పిచ్చెక్కినట్లు మేడమ్ డిఫార్గు మీదికి దూకబోయింది. కానీ అంతలోనే మేడమ్ డిఫార్గు చేతిలోని పిస్టల్ నిప్పులు కక్కింది.

ఆ మరుక్షణం పెద్దగా అరుస్తూ క్రింద పడిపోయింది లూసీ.

మేడమ్ డిఫార్గులో కసి ఆ రెండు చావులతో కొంత చల్లారింది. ఇక మిగిలింది చార్లెస్....అతనికి ఎలాగూ జైలులో శిరచ్ఛేదన తన ప్రమేయం లేకుండానే జరిగిపోతుంది.

ఆ సంఘటన తన కళ్ళతో చూడాలి....అక్కడ నుండి బయలుదేరి జైలుకు వెళ్ళింది. అక్కడ మృత్యుయంత్రం ముందు చార్లెస్ రూపంలోనున్న సిడ్నీ కార్టన్ మోకరిల్లి శిరస్సును చెక్క మీద వుంచాడు.

అక్కడ నించుని వున్న గార్డు కత్తికి కట్టిన తాడును చేతి వాచీలో టైమ్ చూసుకుని వదిలిపెడతాడు. ఆ పదునైన కత్తి సిడ్నీ కార్టన్ శిరస్సును ఖండించి మొండానికి వేరు చేస్తుంది. అది చూసిన మేడమ్ డిఫార్గులో కక్ష తీరింది.... కానీ అతను చార్లెస్సా కాదా అనే సందేహం మాత్రం మనసులో పీకుతూనే వుంది.

—)o(—